

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 3-1-2019 గురువారం సిటీ సంపుటి 45 సంచిక 144

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మళ్లొచ్చేసరికి మొత్తం గావాలె



అన్నారం బ్యారేజీ పనులపై ఇంజినీర్లకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. పక్కన ప్రభుత్వ సలహాదారు వివేక్

- ఏప్రిల్ మొదటి వారంలో మరోసారి వస్తా
- సమన్వయంతో వేగంగా పనులు పూర్తిచేయండి
- అనుమతులు అవసరమైతే సీఎస్ నుంచి తీసుకోండి
- అధికారులు, గుత్తేదారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు
- పలుచోట్ల పనులు నెమ్మదించడంపై అసంతృప్తి
- రెండు రోజుల కాళేశ్వరం పర్యటన పూర్తి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కోటి ఎకరాలు సాగులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుపెడుతోందని.. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఏప్రిల్ మొదటి వారంలో మళ్లీ వస్తానని.. (మిగతా 2లో)

అయ్యప్ప గుడిలోకి అతివల ప్రవేశం

- పోలీసుల రక్షణ మధ్య వెళ్లిన ఇద్దరు 50 ఏళ్లలోపు మహిళలు
- గుడి మూసివేసి శుద్ధి
- కేరళ వ్యాప్తంగా భక్తుల నిరసనలు
- హింసాత్మకంగా మారిన ఘర్షణలు

శతాబ్దాలుగా అనుసరిస్తున్న సంప్రదాయాల్ని తోసిరాజని హిందూ సంస్థల సవాళ్లను ధిక్కరిస్తూ శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి యాభయ్యేళ్ల వయసులోపు మహిళలు ప్రవేశించి చరిత్ర సృష్టించారు. బుధవారం తెల్లవారుజామున 3.38 గంటల సమయంలో 44 ఏళ్ల వయసున్న కనకదుర్గ, 42 ఏళ్ల వయసున్న బిందు పోలీసుల సాయంతో ఆలయంలోకి వెళ్లి దర్శనం చేసుకున్నారు. శాశ్వత బ్రహ్మచారిగా పేరొందిన అయ్యప్ప ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్ల వయసు బాలికలు, మహిళలకు ఆలయ ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన 3 నెలల తర్వాత నల్లని వస్త్రాలు ధరించిన మహిళలు, ముఖాలపై ముసుగు వేసుకుని దర్శనానికి వెళ్లారు. మహిళల ఆలయప్రవేశంతో రాష్ట్రవ్యాప్తంగా పలువురు నిరసనలు చేపట్టారు. ఇవి హింసాత్మకంగా మారాయి.

-పూర్తి వివరాలు 14లో



దేవాలయం లోపల భక్తుల మధ్య బిందు, కనకదుర్గ



దేవాలయ సందర్శన తరువాత బిందు, కనకదుర్గలను తీసుకెళ్తున్న పోలీసులు

రఫేల్‌పై రచ్చ రచ్చ

దిల్లీ

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుపై సాగుతున్న ఆరోపణ ప్రత్యారోపణలు బుధవారం మరో మలుపు తిరిగాయి. ఇందుకు సంబంధించిన మొత్తం దస్త్రాలన్నీ అప్పటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పడకగదిలో ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఓ ఆడియో టేపు ఆధారంగా ఈ విమర్శలను సంధించింది. లోక్‌సభలో ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

ఆడియో వెలుగులోకి వచ్చిన తీరు..


తొలుత ఉదయం కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా పార్లమెంటు బయట విలేకరులతో మాట్లాడుతూ రఫేల్ వ్యవహారంపై ఓ ఆడియో టేపును వినిపించారు. పారికర్ గత వారం మంత్రివర్గ సమావేశంలో చెప్పిన సంగతులంటూ గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ రాణే మూడో వ్యక్తికి చెబుతుండగా రికార్డు చేసినదని వెల్లడించారు.

టేపులో ఏముంది?

ఆ టేపులో రాణే మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి చాలా ఆసక్తికరమైన ప్రకటన చేశారు. రఫేల్‌కు చెందిన మొత్తం సమాచారమంతా ఆయన పడక గదిలో (మిగతా 2లో)

పారికర్ పడక గదిలో దస్త్రాలు!

- గోవా మంత్రి రాణే చెప్పారంటూ కాంగ్రెస్ ఆడియో విడుదల
- లోక్‌సభలో వాద ప్రతివాదాలు
- నకిలీదన్న అధికార పక్షం
- పార్లమెంటరీ దర్యాప్తునకు ప్రభుత్వం తిరస్కరణ





రఫేల్ వివాదంపై లోక్‌సభలో బుధవారం మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

ప్రధానితో ముఖాముఖికి సిద్ధమే

రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ రఫేల్‌పై ప్రధానితో ముఖాముఖికి సిద్ధమేనని అన్నారు. "ప్రధానితో 20 నిమిషాలపాటు ముఖాముఖి మాట్లాడే అవకాశం నాకివ్వండి. వాస్తవమేమిటో మీరే నిర్ణయించండి. మీ ఎదుట కూర్చొనే ధైర్యం ప్రధాని లేదు" అని ఆయన విలేకరులను ఉద్దేశించి అన్నారు. రఫేల్ వ్యవహారంలో తనపై వ్యక్తిగతంగా ఎలాంటి ఆరోపణలు లేవని ఇంటర్వ్యూలో ప్రధాని చెప్పడాన్ని కూడా తప్పుపట్టారు. 'ప్రధాని ఏ లోకంలో జీవిస్తున్నారో అర్థం కావడం లేదు. అనిల్ అంబానీకి రూ.30 వేల కోట్ల కాంట్రాక్టును ఎందుకిచ్చారో అని ప్రజలు అడుగుతున్నారు. ఈ ప్రశ్నలకు వేరేవారికి అడుగుతున్నట్లు ప్రధాని భావిస్తుండడం ఆసక్తికరంగా ఉంది" అని అన్నారు.

రఫేల్ పత్రాలను తన పడక గదిలో పెట్టుకొని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ప్రధాని మోదీని బెదిరించి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. అట్టహాసంగా ఫ్రాన్స్ దేశానికి వెళ్లి ఒప్పందం కుదుర్చుకున్న ప్రధాని మౌనంగా ఉంటున్నారని, ఆర్థిక మంత్రే సమాధానాలు ఇస్తున్నారని విమర్శించారు.

టెక్నాలజీతో చదువులు బాగవుతున్నాయా?



- కొద్ది సంవత్సరాలుగా పిల్లల చదువుల్లో టెక్నాలజీ వాడకం విపరీతంగా పెరుగుతోంది. దానివల్ల చదువులు నిజంగానే మెరుగవుతున్నాయా?
- విద్య, వైద్యం వంటి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో చాలా ప్రయోజనాలున్నాయిగానీ.. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లకుండా ఈ టెక్నాలజీని వాడటం ఎలా?

ఈ రెండూ ప్రస్తుతం మన ముందున్న కీలక సవాళ్లని వ్యాఖ్యానించారు బిల్ గేట్స్! సాధారణంగా కొత్త సంవత్సర తీర్మానాలకు దూరంగా ఉండే తాను.. ఈ 2019లో మాత్రం వీటి మీద గట్టి కృషి చేయాలని తీర్మానించుకున్నట్లు వెల్లడించారు.

2018లో తాను సాధించిన పురోగతి గురించీ, తనను అమితంగా ఆకట్టుకున్న 5 పుస్తకాల గురించీ, తన కొత్త సంవత్సర తీర్మానాల గురించీ తన బ్లాగ్‌లో సవివరంగా చర్చించారు బిల్ గేట్స్. -పూర్తి కథనం 5లో

కొత్త జిల్లాలపై ఉత్తర్వులు

- ములుగు, నారాయణపేట ఏర్పాటుపై ప్రభుత్వ మార్గదర్శకాలు 3 లో

సత్వర న్యాయం అందిద్దాం



హైకోర్టులో బుధవారం జరిగిన న్యాయమూర్తులు, న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్

- 1.87 లక్షల పెండింగ్ కేసులతో మన ప్రస్థానం మొదలైంది
- చేయి చేయి కలుపుదాం.. 'ఉన్నత' సేవలు అందిద్దాం
- తొలి ప్రధాన న్యాయమూర్తి కావడం నాకు దక్కిన గౌరవం
- ఫుల్‌కోర్టు సమావేశంలో సీజే జస్టిస్ రాధాకృష్ణన్ వ్యాఖ్యలు
- తెలంగాణ హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు కొలువుదీరింది.. ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. బుధవారం నుంచి ఉన్నత న్యాయస్థానం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ నేతృత్వంలో తొలిరోజున.. మొదటి కోర్టు హాలులో 12 మంది న్యాయమూర్తులూ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు భారీగా హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీజే జస్టిస్ రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ తొలి ప్రధాన న్యాయమూర్తి కావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంతో పాటే ఆవిర్భవించిన ఈ న్యాయస్థానం 1.87 లక్షల పెండింగ్ కేసులతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిందన్నారు. చిరస్మరణీయమైన (మిగతా 2లో)



ఇదీ సంగతి!



దేశంలోని వందలాది మంత్రుల్లో మీరొక్కరే సత్యం చెప్పారు మేడం, అభినందించకుండా ఉండలేకపోతున్నాం.

ఆమెకు అగ్ర తాంబూలం!



తెలంగాణలో 6,378 మంది మహిళా సర్పంచులే

- దేశంలో ఐదో స్థానం
- రాజ్యాంగ సూచనకు మించి 17 శాతం ఎక్కువ కేటాయింపు
- 56,690 వార్డులూ వారికే
- పదేళ్లు కొనసాగనున్న రిజర్వేషన్లు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలోని 6,378 పంచాయతీలలో మహిళా సర్పంచులే ఎన్నిక కాబోతున్నారు. తద్వారా మహిళా సర్పంచులు అధికంగా గల రాష్ట్రాల్లో ఐదో స్థానం రాష్ట్రానికి దక్కనుంది. ఈ దఫా పంచాయతీల సంఖ్య భారీగా పెరగడం మహిళా ప్రాతినిధ్యం పెరుగుదలకు దోహదం చేసింది. ఈ రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగనున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు ఒకటింట మూడు వంతుల(1/33) స్థానాలను తప్పక కేటాయించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి చెబుతోంది. తెలంగాణ సహా 19 రాష్ట్రాలు 50 శాతం స్థానాలు వారికే కేటాయిస్తున్నాయి. ఆ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వు అయిన స్థానాలతో పాటు, ఎవరికీ రిజర్వు కాని చోటా సగం స్థానాలు ఈ దఫా మహిళలకు లభించాయి. వాటిని లాటరీ ద్వారా అధికారులు ఎంపిక చేశారు. దాన్నిబట్టి రాష్ట్రంలోని 12,751 పంచాయతీలలో సగం మేర అంటే 6,378 స్థానాల్లో మహిళలే (మిగతా 2లో)



కన్నెపల్లి వద్ద గ్రావిటీ కాలువ పనులపై ఆరా తీస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. పక్కన సీఎం కార్యాలయ ఓఎస్డీ స్మితా సబర్వాల్, మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎంవో ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, సీఎస్ ఎస్‌కే జోషి, ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి, ఇంజినీర్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్ హౌస్ సమీపంలో గ్రావిటీ కాలువ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

తగ్గని ఇగం

- **ఆదిలాబాద్, మెదక్‌లో 6 డిగ్రీల నమోదు**

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో శీతలగాలుల ఉద్ధృతి కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 8 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆదిలాబాద్, మెదక్‌లో 6, రామగుండంలో 9, హైదరాబాద్‌లో 10 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో శీతల గాలుల ఉద్ధృతి తీవ్రంగా ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురు, శుక్రవారాల్లో సైతం ఇలాంటి వాతావరణమే ఉంటుందని వివరించింది.

చలి తీవ్రతకు ఇద్దరి మృతి

కొడంగల్, వికారాబాద్, న్యూస్‌టుడే: చలి తీవ్రత తట్టుకోలేక వికారాబాద్ జిల్లాలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. కొడంగల్ పట్టణానికి చెందిన పూరి రాయప్ప (రాములు) చలిని తట్టుకోలేక రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎంత చికిత్స చేసినా శరీరం సహకరించక మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని అతని సోదరుడు పూరి మధు పేర్కొన్నారు. అలాగే వికారాబాద్‌లోని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న జంగయ్య (54) మృతి చెందినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాలి శ్రీహరి తెలిపారు. మంగళవారం రాత్రి జంగయ్య తన గృహంలో భోజనం చేసి నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో చలికారణంగా గుండెపోటు రావటంతో కుప్పకూలిపోయారు. ఆయనను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు.

మళ్లొచ్చేసరికి మొత్తం గావాలె!

(మొదటి పేజీ తరువాయి)

అప్పటిలోగా కాళేశ్వరం పనులన్నీ పూర్తి కావాలన్నారు. అటు గుత్తేదారులు, ఇటు ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి మార్చి ఆఖరుకల్లా లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అన్ని అంశాలనూ తాను పరిశీలించిన నేపథ్యంలో పనులు వేగంగా చేసే క్రమంలో ఏమైనా అనుమతులు అవసరమైతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి తీసుకోవాలని ఆదేశించారు. కొన్నిచోట్ల పనులు నెమ్మదిగా జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని మళ్లించే ప్రధాన పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో రోజు బుధవారం సైతం పరిశీలించారు. గుత్తేదారులు, ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో సమీక్షించి సూచనలు చేశారు.

అక్కడికక్కడే ఆదేశాలు..

ఈ పథకంలో భాగంగా ఎల్లంపల్లి వరకు ఉన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ పనులు చేస్తున్న ఎల్అండ్‌టి ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, నవయుగ ఛైర్మన్ సి.వి.రావు, ఆఫ్కాన్స్ ఛైర్మన్ పరేట్కర్, ఈ బ్యారేజీల వద్ద మూడు పంపుహౌస్‌ల పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి, సీఎస్ ఎస్.కె.జోషి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు తదితరులు ముఖ్యమంత్రి వెంట ఉండటంతో ఎవరు ఏ పనులు చేయాలో అక్కడికక్కడే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వచ్చే మూడు నెలలు పనులు చేయడానికి పూర్తిగా అనుకూలమైన సమయమని.. దాన్ని వినియోగించుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఎక్కడెక్కడ పనుల వేగం పెంచాల్సిన అవసరం ఉందో గుర్తించాం కాబట్టి వాటిని అధిగమించాలని ముఖ్యమంత్రి సూచించగా.. కచ్చితంగా పూర్తి చేస్తామని గుత్తేదారులు హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆయన బాల్య స్నేహితుడు, ఆ ఆలయ ఛైర్మన్ వెంకటేశం, పూజారులు. ఈ సందర్భంగా 'వెంకటేశం బాగున్నావా' అంటూ సీఎం ఆప్యాయంగా పలకరించారు.

కన్నెపల్లి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు నిర్మిస్తున్న గ్రావిటీ కాలువను బుధవారం ఉదయం సీఎం పరిశీలించారు. గ్రావిటీ కాలువ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని గుత్తేదార్లు, అధికారులను ఆదేశించారు. ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించాలన్నారు. లైనింగ్ పనులు కేవలం 3 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి కావడంపై గుత్తేదార్లను ప్రశ్నించారు. మరీ ఇంత తక్కువ స్థాయిలో కావడమేంటని అసంతృప్తి వ్యక్తంచేశారు. కూలీల సంఖ్యను పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయించాలన్నారు. చివరగా కాలువ ముగిసే అండర్ టన్నెల్ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు రివర్స్ పంపింగ్ ఆరంభమయ్యేది ఇక్కడి నుంచే కావడంతో కాలువను త్వరితగతిన నిర్మించాలన్నారు. వచ్చే ఖరీఫ్‌కు నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. 66 గేట్లతో పూర్తయిన అన్నారం బ్యారేజీని సీఎం సందర్శించారు. సకాలంలో పనులు పూర్తిచేయడంపై ఇంజినీర్లను అభినందించారు. బ్యారేజీ నిర్మాణం చేపట్టిన గుత్తేదారు సంస్థకు భవిష్యత్తులో మరో ప్రాజెక్టును అప్పగిస్తామని చెప్పారు.

సుందిళ్ల, గోలివాడ..

మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల ఆనకట్ట, అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్ పనులను సీఎం పరిశీలించారు. సుందిళ్ల ఆనకట్ట ఫ్లాడ్ బ్యాంకు పరిధిలో రివెట్‌మెంట్ పనులు ఆలస్యంగా జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ 2 టీఎంసీల నీటిని ఎత్తిపోసే దిశగా పనులు జరగాలనీ, ఈ పనుల తర్వాతే ట్రయల్‌రన్ నిర్వహించాలని సూచించారు. గోలివాడ పనులు కూడా మార్చి 31 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంప్ హౌస్ పనుల్లో వేగం అవసరమని, త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.

శ్రీరాంపూర్ పునరుజ్జీవ పథకం..

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్(ఎస్సారెస్పీ) పునరుజ్జీవ పథకం పనులను మరింత వేగంగా పూర్తిచేయాలని కేసీఆర్ అధికారుల్ని ఆదేశించారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో గోలివాడ పంప్‌హౌస్ నుంచి జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేటకు ముఖ్యమంత్రి చేరుకున్నారు. సుమారు గంటపాటు అక్కడ జరుగుతున్న పనుల తీరును గమనించారు. ముఖ్యంగా వరద కాలువ పక్కన చెరువుల్ని నింపేందుకు వీలుగా తూములను నిర్మించేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. వచ్చే వర్షాకాలంలో పనుల్ని పూర్తి చేసి ఆయా జిల్లాల రైతులకు సాగునీరు అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. తరువాత మల్యాల మండలం రాంపూర్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌజ్ పనులను సీఎం పరిశీలించాల్సి ఉన్నప్పటికీ సమయాభావం వల్ల అక్కడికి వెళ్లలేదు. హెలికాప్టర్‌లో నుంచి ఆ పనుల్ని పర్యవేక్షిస్తూ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

–ఈనాడు డిజిటల్ కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి; న్యూస్‌టుడే, కాళేశ్వరం



న్యాయమూర్తులతో సమావేశమైన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్

సత్వర న్యాయం అందిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంలో బార్, బెంచ్, అధికారవర్గాలు అందరం కలిసి అత్యుత్తమ సేవలందించేలా ప్రతిన పూనడానికి ఇక్కడ సమావేశమయ్యామని వివరించారు. ప్రజలకు సత్వరమే.. 'నాణ్యమైన' న్యాయాన్ని అందించడానికి కంకణబద్ధులమవుదామని ఆయన పిలుపునిచ్చారు. న్యాయవాదులతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వం, అధికారులు, హైకోర్టు జడ్జీలు, రిజిస్ట్రార్లు, సిబ్బంది కృషితో ఈ న్యాయస్థానం ఉమ్మడి హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుగా మారిందన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంతోమంది ప్రముఖులు, న్యాయవాదులు తదితరులు హాజరుకావడం ఈ వ్యవస్థపై వారికున్న నమ్మకానికి తార్కాణమని.. హైకోర్టుపై ఉన్న భారీ అంచనాలకు ప్రతిబింబమని అభివర్ణించారు. ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు క్రమశిక్షణ అలవరచుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బార్, బెంచ్ కలిసి సమష్టిగా పనిచేస్తేనే సత్వర న్యాయం సాధ్యమవుతుందన్నారు. బార్, బెంచ్ నాణేనికి రెండు ముఖాలు మాత్రమేకాదని, న్యాయరథానికి రెండు చక్రాలు వంటివని, ఇవి రెండూ న్యాయవ్యవస్థ గౌరవాన్ని ఇనుమడించేలా పనిచేయాలన్నారు. నిబద్ధతతో పనిచేసి న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచుదామని పిలుపునిచ్చారు.

చారిత్రక ఘట్టానికి సాక్షులం

ఇలాంటి చారిత్రక సంఘటనకు సాక్షులుగా నిలవడం గౌరవంగా ఉందని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలే తమ యజమానులని.. వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులుగా సామాజిక న్యాయం అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమానికి, న్యాయవ్యవస్థ పవిత్రత పరిరక్షణకు బార్ కౌన్సిల్ కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. తదనంతరం విచారణ ప్రక్రియ ప్రారంభమైంది.

ఏపీ హైకోర్టులో సందడి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మొదటి రోజు విధులు బుధవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి కోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించారు. న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడేందుకు ఏసీజేతోపాటు హైకోర్టు న్యాయమూర్తులంతా (ఫుల్ కోర్టు) మొదటి కోర్టు హాలులో సమావేశమయ్యారు. ఏసీజే జస్టిస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన ఏపీ హైకోర్టు ప్రతిష్ఠను పెంచే బాధ్యత న్యాయవాదులు, న్యాయమూర్తుల భుజస్కంధాలపై ఉందని పేర్కొన్నారు.

రఫేల్‌పై రచ్చ రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్టు చెప్పారు. బెదిరించే రీతిలో వాటిని దగ్గర పెట్టుకున్నారన్న మాట. ఇక్కడి ఫ్లాట్‌లోని పడక గదిలోనే రఫేల్‌కు చెందిన ప్రతి ఒక్క పత్రమూ ఉందని సీఎం చెప్పారు" అంటూ ఆ మూడో వ్యక్తికి వివరించారు. అయితే ఇది రాణే గొంతేనా అన్నది నిర్ధారణ కాలేదు. మూడో వ్యక్తి ఎవరన్నది తెలియరాలేదు. ఆడియోను వినిపించిన అనంతరం సుర్జేవాలా మాట్లాడుతూ అవినీతి జరగకపోతే ఆ దస్త్రాలు పారికర్ వద్ద ఎందుకు ఉన్నాయో ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండు చేశారు.

> **జవాబిచ్చే ధైర్యం ప్రధానికి లేదు: రాహుల్**
>
> సభకు వచ్చి రఫేల్‌పై సమాధానాలు చెప్పే ధైర్యం ప్రధానికి లేదని అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్‌ను కాదని 'ప్రియమైన మిత్రుడు', 'విఫల వాణిజ్యవేత్త' అయిన 'డబుల్ ఏ' (ఏ..ఏ.. అనిల్ అంబానీ)కి రూ.30 వేల కోట్ల కాంట్రాక్టు ఇచ్చారని ఆరోపించారు. అనిల్ అంబానీ పేరును పదేపదే ప్రస్తావించడంతో సభలో లేనివారి పేర్లను అలా చెప్పడం తగదంటూ స్పీకర్ వారించారు. జేపీసీ వేయాలని శివసేన కూడా డిమాండు చేయడం గమనార్హం. ఈ అంశంపై గురువారం కూడా చర్చ జరగనుంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల నిరసన కారణంగా సభ పలుమార్లు వాయిదా పడింది.

ఖండించిన రాణే, పారికర్

ఇది జరిగిన కొన్ని గంటల అనంతరం గోవా రాజధాని పనాజీలో మంత్రి విశ్వజిత్ రాణే మాట్లాడుతూ కాంగ్రెస్ వినిపించిన ఆడియో నకిలీదని, అదంతా ఆ పార్టీ కల్పన అని ఆరోపించారు. దీనిపై దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరానని పేర్కొంటూ ఆయన భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు లేఖ రాశారు. దీనిపై ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ట్వీట్ చేస్తూ రఫేల్ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో నిరాశతోనే కాంగ్రెస్ అభూత కల్పనలు చేస్తోందన్నారు. మంత్రివర్గ సమావేశంలో కాదు కదా, ఎక్కడా రఫేల్‌పై చర్చలు జరగనేలేదని స్పష్టం చేశారు.

లోక్‌సభలో మాటా మాటా

ఈ వ్యవహారం లోక్‌సభలో ప్రతిధ్వనించింది. ఆడియో టేపును వినిపించడానికి అనుమతించాలని రాహుల్ గాంధీ అనుమతి కోరారు. ఇందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అభ్యంతరం తెలుపుతూ ఆ గొంతు ఎవరిదో ధ్రువీకరించగలరా? అని ప్రశ్నించారు. అలా చేయలేనని సమాధానం ఇవ్వడంతో.. ..నకిలీదని తెలిసినందువల్లనే ధ్రువీకరించడం లేదని జైట్లీ విమర్శించారు. దీన్ని వినిపించడానికి స్పీకర్ సుమిత్రా మహాజన్ అనుమతివ్వలేదు.

జేపీసీ ఏర్పాటుకు ప్రభుత్వం నిరాకరణ

రఫేల్ వ్యవహారంపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిరాకరించింది. లోక్‌సభలో కాంగ్రెస్ చేసిన ఈ డిమాండుపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధానమిస్తూ యుద్ధ విమానాల కొనుగోలులో ప్రభుత్వ అంతరంగం స్వచ్ఛంగా ఉందంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, అందువల్ల మళ్లీ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేశారు.

లోక్‌సభలో కాగితం విమానాలు!

రఫేల్‌పై చర్చ జరుగుతున్న సందర్భంగా లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు కాగితం విమానాలు విసరడం కాసేపు కలకలం సృష్టించింది. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రసంగిస్తున్నప్పుడు నినాదాలు చేసిన కాంగ్రెస్ సభ్యులు కాగితం విమానాలు విసిరారు. దీనిపై రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సభ్యులపై ఆగ్రహించిన స్పీకర్ 'మీరు చిన్న పిల్లలా ఏమిటి? చిన్నప్పుడు వీటితో ఆడుకోలేదా?' అంటూ ప్రశ్నించారు. కాంట్రాక్టు దక్కని యూరో ఫైటర్‌కు గుర్తుగా వీటిని విసురుతున్నట్టు ఉందని అరుణ్ జైట్లీ ఆ సభ్యులను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

సభలో జేమ్స్ బాండ్ డైలాగు

చర్చ సందర్భంగా జేమ్స్ బాండ్ సినిమా 'గోల్డ్ ఫింగర్'లోని డైలాగు ప్రస్తావనకు వచ్చాయి. జైట్లీ తన ప్రసంగంలో ఆ సినిమాలోని డైలాగు "ఒకసారి జరిగితే ఏదో అలా జరిగినట్టు. రెండోసారి జరిగితే కాకతాళీయంగా జరిగినట్టు. మూడోసారి కూడా అదే జరిగితే కుట్ర ఉన్నట్టు" అంటూ గుర్తుచేశారు. రక్షణ వ్యవహారాల్లో కుట్రలకు పాల్పడినవారు ఇప్పుడు ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ సమయంలో తృణమూల్ సభ్యుడు సౌగత్ రాయ్ మాట్లాడుతూ "డైలాగులో తప్పుంది. మూడోసారి జరిగితే కుట్ర కాదు, అది శత్రు చర్య" అంటూ సరిదిద్దారు.

సుప్రీంను ఆశ్రయించిన సిన్హా, శౌరి

రఫేల్ వ్యవహారంపై ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం సీల్డు కవర్‌లో సమర్పించిన ఎలాంటి సంతకం లేని తప్పుడు పత్రాల ఆధారంగా తీర్పు వెలువడిందని, దీన్ని సమీక్షించాలని కోరారు.

> ## సీబీఐని పెంపుడు కుక్కలా మార్చారు
>
> - **లోక్‌సభలో భాజపాపై గల్లా జయదేవ్ ధ్వజం**
>
> **ఈనాడు, దిల్లీ:** కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని భాజపా ప్రభుత్వం పెంపుడు కుక్కలా మార్చిందని తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో రఫేల్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. "ప్రభుత్వం సీబీఐని పంజరంలో చిలుకలా మార్చిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భాజపా ఆరోపించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే సీబీఐని భాజపా పెంపుడు కుక్కలా మార్చేసింది" అని ధ్వజమెత్తారు. రఫేల్ ఒప్పందంపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిందని ఆరోపించారు. దీనిపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రధాని సభకు హాజరుకాకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు.
>
> - రఫేల్ విమానాల కొనుగోలు విషయంలో యూపీయే, ఎన్డీయే ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాల్లో తేడాలేమిటి?
> - ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రధానమంత్రి ఫ్రాన్స్‌కు వెళ్లినప్పుడు ఆయనతోపాటు ఎవరెవరు వెళ్లారు? సమావేశం జరుగుతుండగానే ఒప్పందంపై సంతకాలు చేయాల్సిన ప్రధాన వ్యక్తులను ఎందుకు మార్చారు?
> - కొత్త ఒప్పందాన్ని ఎందుకు కుదుర్చుకోవాల్సి వచ్చింది? దీనివల్ల కలిగే అదనపు ప్రయోజనం ఏంటి?
> - భారత్‌లో తయారీ అంటూనే వీటిని దేశంలో రూపొందించకుండా ఫ్రాన్స్ నుంచి నేరుగా ఎందుకు కొనుగోలు చేస్తున్నారు?
> - అనిల్ అంబానీ కంపెనీ ఇప్పటికే రూ.లక్ష కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. అందులో దాదాపు రూ.38 వేల కోట్లు రక్షణ రంగానికి సంబంధించిన అప్పులే. అలాంటి సంస్థకు కాంట్రాక్టును ఎందుకు అప్పగించారు? అంటూ నిలదీశారు.
>
> జయదేవ్ ప్రసంగానికి రాహుల్‌గాంధీ అభినందనలు తెలిపారు.

> **ఇవ్వటానికి సిద్ధమేగానీ..**
>
> నేను నా ప్రాణాలు అర్పించైనా సాధించాలనుకునే లక్ష్యాలు చాలానే ఉన్నాయిగానీ.. ప్రాణాలు తీసి అయినా సాధించుకోవాలనుకుంటున్న లక్ష్యం మాత్రం ఒక్కటి కూడా లేదు!
>
> – మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

3–1–2019 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; మార్గశిర మాసం; బహుళ పక్షం
త్రయోదశి: తె. 3.57 తదుపరి చతుర్దశి
అనూరాధ నక్షత్రం: మ. 12.34 తదుపరి జ్యేష్ఠ
అమృతఘడియలు: తె. 4.26 నుంచి 6.06 వరకు
వర్జ్యం: సా. 6.25 నుంచి 8.05 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10.15 నుంచి 10.59 వరకు
తిరిగి మ. 2.39 నుంచి 3.22 వరకు
రాహుకాలం: మ. 1.30 నుంచి 3.00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; **సూర్యాస్తమయం:** సా.5-34

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	6.0	34.6
ఆదిలాబాద్	6.0	28.8
రామగుండం	9.0	30.4
హైదరాబాద్	10.0	30.5
కరీంనగర్	10.0	26.0
హన్మకొండ	11.0	29.0
నిజామాబాద్	11.7	29.8
విశాఖపట్నం	12.8	27.6
గుంటూరు	12.8	30.1
కడప	13.0	32.0
మహబూబ్‌నగర్	13.5	32.6
సూర్యాపేట	14.0	19.0
నల్గొండ	14.6	29.4
కర్నూలు	14.6	32.0
తిరుపతి	15.1	29.5
విజయవాడ	15.4	28.6
ఖమ్మం	18.0	28.0

ఏప్రిల్ 1 నుంచి నిరంతర విద్యుత్తు

కేంద్రం ప్రణాళిక

దిల్లీ: ఎలాంటి అంతరాయాలూ లేకుండా రోజంతా విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడడానికి కేంద్ర సర్కారు రంగం సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి రానుందని కేంద్ర ఇంధన శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ ఒక ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ముఖాముఖిలో వెల్లడించారు. అధిక రుసుముల బారి నుంచి తప్పించుకునేందుకు విద్యుత్తును కొనుగోలు చేయకుండా ఉద్దేశపూర్వక కోతలు విధించాలనుకుంటే ఆ తేదీ తర్వాత డిస్కంలకు వీలుండదు. ఒకవేళ అవి అలా చేస్తే నియంత్రణ సంస్థల నుంచి భారీ అపరాధ రుసుములను ఎదుర్కోవాల్సి వస్తుంది. సాంకేతిక సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు సరఫరా నిలిచిపోవడాన్ని మాత్రం అనుమతిస్తారు. నిరంతర విద్యుత్తు అవసరం లేని వ్యవసాయ రంగం వంటి ఒకటిరెండు మినహా మిగిలిన అన్నింటికీ రోజులో 24 గంటలూ సరఫరా ఉండాలనేదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి చెప్పారు.

ఆమెకు అగ్ర తాంబూలం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇతర స్థానాల్లోనూ(మహిళకు రిజర్వు కాని) పోటీ చేసేందుకు వారు అర్హులే కనుక అక్కడా నెగ్గితే వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది.

ఎనిమిది నుంచి ఐదో స్థానానికి

రిజర్వేషన్ల ప్రకారం 4,602 మంది మహిళా సర్పంచులతో తెలంగాణ ఇంతవరకు దేశంలో 8వ స్థానంలో ఉండేది. ఇప్పుడు వారి సంఖ్య 6,378కి చేరుతున్నందున అయిదో స్థానంలో నిలబడనుంది. 19,992 మంది మహిళా సర్పంచులతో ఉత్తర్‌ప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. వార్డు సభ్యుల పదవుల్లోనూ సగం మహిళలకే లభిస్తాయి కనుక రాష్ట్రంలోని 1.13 లక్షల వార్డుల్లో 56,690 మహిళలే దక్కనున్నాయి.

స్వయం నిర్ణయాలకు అవకాశం

ప్రస్తుత రిజర్వేషన్లు పదేళ్లు అమల్లో ఉంటాయి. దీనివల్ల మహిళా ప్రతినిధులు స్వయంగా నిర్ణయాలను తీసుకుంటూ బాగా పనిచేసేందుకు వీలువుతుందనేది సర్కారు భావన. 'ఇంతవరకు రిజర్వేషన్లు ఐదేళ్ల పాటు మాత్రమే అమల్లో ఉండేవి. ఒకసారి మహిళకు దక్కిన స్థానాన్ని తర్వాత పురుషులకు కేటాయించేవారు. పాలనపై పట్టు పెంచుకునేలోపే ఐదేళ్ల కాలం గడిచిపోయేది. ఇదే అదనుగా వారి భర్తలు, ఇతర కుటుంబ సభ్యులు పెత్తనం చేసేవారు. అందువల్లనే ప్రభుత్వం రెండు విడతల రిజర్వేషన్ విధానాన్ని నూతన చట్టంలో పొందుపర్చింది. బాగా పనిచేస్తే రెండోసారీ తమకే అవకాశం వచ్చే వీలున్న నేపథ్యంలో మహిళలు లోటుపాట్లను అధిగమించి పాలనపై పట్టుసాధిస్తారు. ఫలితంగా మగవారి జోక్యం తగ్గుతుంది' అని పంచాయతీరాజ్ శాఖ అధికారి ఒకరు విశ్లేషించారు.

మహిళా సర్పంచులు అధికంగా గల కొన్ని రాష్ట్రాలివీ

రాష్ట్రం	సంఖ్య
ఉత్తర్ ప్రదేశ్	19,992
మహారాష్ట్ర	13,960
మధ్యప్రదేశ్	11,864
ఆంధ్రప్రదేశ్	6,584
తెలంగాణ	6,378
ఛత్తీస్‌గఢ్	5,822
రాజస్థాన్	5,341
గుజరాత్	4,676
పంజాబ్	4,431
తమిళనాడు	4,289

తెలంగాణలో వర్గీకరణల వారీగా మహిళా సర్పంచుల సంఖ్య ఇలా

షెడ్యూల్ ఏరియా	641
నూరు శాతం గిరిజన జనాభా గల చోట	589
షెడ్యూలేతర ప్రాంతాలు	
ఎస్టీ పంచాయతీలు:	344
ఎస్సీ:	1,057
బీసీ :	1,173
ఎవరికీ రిజర్వు కానివి:	2,574
మొత్తం:	6,378

ప్రజాదరణ కోల్పోతున్న విపక్షాలు

- కాంగ్రెస్, భాజపాలకు ప్రత్యామ్నాయంగానే ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నం
- రాష్ట్రంలో 16 ఎంపీ సీట్లు గెలిస్తే.. దిల్లీని నిర్దేశించొచ్చు
- ఇక తెలంగాణలో చంద్రబాబు, లోకేశ్‌లు తిరగరు
- తెదేపాకు ఇక్కడ భవిష్యత్తులేదు
- సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

బన్సీలాల్‌పేట్ - న్యూస్‌టుడే

దేశంలో భాజపా, కాంగ్రెస్‌లు ప్రజల విశ్వాసం కోల్పోతున్నాయని, అందువల్లే ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రంలో ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ప్రయత్నం చేస్తున్నారని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాల్లో తెరాసను గెలిపిస్తే దిల్లీ పీఠంపై ఎవరు కూర్చోవాలో నిర్ణయించే శక్తి తెలంగాణ ప్రజలకే వస్తుందన్నారు. రాష్ట్రానికి కావాల్సిన నిధులు, మహానగరానికి రావాల్సిన ప్రయోజనాలను దిల్లీ మెడలు వంచి తీసుకొచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లిన వారు గెలిచిన పరిస్థితి లేదన్నారు. ఇందిరాగాంధీ, వాజ్‌పేయీ, ఎన్టీఆర్, చంద్రబాబు ముందస్తుగా సభలను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లిన సందర్భాల్లో చేదు అనుభవం ఎదురైందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సెప్టెంబరు 6న అసెంబ్లీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి గంటల వ్యవధిలోనే 105 మందిని అభ్యర్థులుగా ప్రకటించి సంచలనం సృష్టించారన్నారు. కేసీఆర్ ఏది చేసినా ఓ చరిత్ర అని చెప్పారు. తెరాస ఆవిర్భావం నాడు తెలంగాణ కల సాకారమవుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. ప్రతి ఎన్నికనూ ఉపయోగించుకుంటూ రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెస్తూ ఉద్యమాన్ని కేసీఆర్ ఒక్కో మెట్టు ఎక్కించారన్నారు. ఒక నాయకుడు తన జీవిత కాలంలో ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టి.. దాని ఫలితాన్ని ప్రజలకు చూపించి.. తాను నాయకత్వం వహిస్తున్న రాష్ట్రానికే ముఖ్యమంత్రి కావడం ఓ రికార్డన్నారు. ఈ విషయాన్ని మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో 34 శాతం ఓట్లతో తెరాసకు 63 సీట్లు వచ్చాయన్నారు.



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ కృతజ్ఞత సభలో కార్యకర్తలు బహూకరించిన విల్లును ఎక్కు పెడుతున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్. పక్కన స్థానిక ఎమ్మెల్యే తలసాని

సరిగ్గా నాలుగున్నరేళ్ల తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు బంగారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు, రాహుల్‌గాంధీలు రాష్ట్ర ప్రజలను గందరగోళం చేసే ప్రయత్నం చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా వచ్చి విమర్శలు చేసినా, అమిత్‌షా విస్తృతంగా పర్యటించినా, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 11 మంది కేంద్ర మంత్రులు వచ్చినా ప్రజలు పట్టించుకోకుండా కేసీఆర్‌కు 88 సీట్లతో అద్భుతమైన మెజార్టీ ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుతో కొందరు మీడియాకు కనబడకుండా పోయారని, ఇంకొందరు ఆగమాగమైతున్నారని ఎద్దేవా చేశారు. కొందరు ఈవీఎంలు పని చేయడంలేదని ఆరోపించారని.. పనిచేయనిది ఈవీఎంలు కాదని వాళ్ల బుర్రలని విమర్శించారు. చంద్రబాబు లాంటి వాళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారని, వారి కోపం ఆశీర్వాదంగా తీసుకొని పనిచేద్దామన్నారు. తెలంగాణలో చంద్రబాబు, లోకేశ్‌లు ఇక తిరగరని, ఆ పార్టీకి ఇక్కడ భవిష్యత్తు లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 16 స్థానాలు గెలుచుకోకపోతే శాసనసభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును మనమే తక్కువ చేసుకున్నట్లవుతుందని కార్యకర్తలనుద్దేశించి అన్నారు. 15 పార్లమెంటు స్థానాల్లో తెరాస ఆధిక్యంలో ఉందని, ఖమ్మం నియోజకవర్గంలో మాత్రమే వెనకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. ప్రస్తుతం కేసీఆర్‌కు ఉన్న ఆదరణ దేశంలో ఏ నేతకూ లేదన్నారు. కేటీఆర్ పార్టీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కార్యకర్తలకు కొండంత అండ వచ్చిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే బాల్క సుమన్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆయన వెంట ఉన్నారు. కేటీఆర్ ఈ సందర్భంగా గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ పథకాలన్నీ విజయవంతం

- దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- 'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తకం ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ విజయవంతమయ్యాయని, అవి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. త్వరలో కేంద్రం కూడా తెలంగాణను అనుసరిస్తుందన్నారు. బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు రాసిన 'దేశానికి దిక్సూచి తెలంగాణ' పుస్తకాన్ని కేటీఆర్ బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఆంజనేయగౌడ్‌లు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రజల మనసెరిగిన వ్యక్తి అని, వారి అవసరాల మేరకు, పూర్తిగా వారి కోణంలో పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. పథకాల అధ్యయనానికి ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం ప్రతినిధి బృందాలు వస్తున్నాయని చెప్పారు. రైతుబంధు పథకం అత్యుత్తమైందని, ఇతర రాష్ట్రాలూ దానిని ప్రారంభిస్తున్నాయని తెలిపారు. కేంద్రం త్వరలో దీనిని ప్రవేశపెట్టేందుకు యోచిస్తోందని చెప్పారు. రెండు పడకగదుల ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి వంటివి కొంత నిదానంగా నడుస్తున్నా, అవి చాలా గొప్ప పథకాలని, నిరుపేదలపాలిట వరం లాంటివని తెలిపారు. తెలంగాణ పథకాలు దేశానికి నమూనాగా మారడం గర్వకారణమని, కేసీఆర్ ప్రజారంజక పాలనకు ఇది నిదర్శనమన్నారు. రాష్ట్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ చేరేందుకు తెలంగాణ రచయితలు కృషి చేయాలన్నారు. బీఎస్ రాములు తెలంగాణ సిద్ధాంత భావజాలంతో ఉద్యమ సమయం నుంచి రచనలు చేస్తూ అందరినీ చైతన్యపరుస్తున్నారని తెలిపారు. కేటీఆర్ అంతకుముందు కర్రె సదాశివ్ రాసిన 'బీఎస్ రాములు సాహిత్యం-సమగ్ర పరిశీలన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

కొత్త జిల్లాలపై ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సందర్భంగా ప్రకటించినట్లుగానే రాష్ట్రంలో మరో రెండు కొత్త జిల్లాలు- ములుగు, నారాయణపేట ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం తాజాగా (జీవో నెం. 533, 534) ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నామని దానిలో పేర్కొంది. భూపాలపల్లి జిల్లాను విభజించి ములుగు, మహబూబ్‌నగర్ జిల్లాను విడదీసి నారాయణపేట జిల్లాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. గత నెల 31వ తేదీతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని కోసం వెంటనే ప్రాథమిక ప్రకటన (నోటిఫికేషన్) జారీ చేయాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి.. భూపాలపల్లి జయశంకర్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాల్లోని ప్రజల వద్ద నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరించాలని సూచించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక కొత్త జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. అప్పుడు రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కు చేరనుంది.

ఇదీ ములుగు జిల్లా

భూపాలపల్లి నుంచి ములుగు జిల్లాను విభజించారు. ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం, వాజేడు మండలాలతో కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మండలాలన్నీ ప్రస్తుతం ములుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోనివే.

నారాయణపేట జిల్లా ఇలా...

నారాయణపేట రెవెన్యూ డివిజన్‌లోని దామరగిద్ద, ధన్వాడ, కోస్గి, కృష్ణ, మద్దూరు, మాగనూరు, మక్తల్, మరికల్, నారాయణపేట, నర్వ, ఊట్కూరుతోపాటు కోయిల్‌కొండను కూడా కలిపి మొత్తం 12 మండలాలతో నారాయణపేట జిల్లా ఏర్పాటు కానుంది.

మరో నాలుగు కొత్త మండలాలు

రాష్ట్రంలో మరో నాలుగు కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలో చందూరు, మోస్రా, మేడ్చల్ జిల్లాలో మూడుచింతలపల్లి, సిద్దిపేట జిల్లాలో నారాయణరావుపేట మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. గుండాల మండలాన్ని జనగామ జిల్లా నుంచి విడదీసి యాదాద్రి భువనగిరి జిల్లాలో కలిపేందుకు మరో ఉత్తర్వునిచ్చింది.

గద్వాల చేనేత 'ఆన్‌లైన్' విక్రయాలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గద్వాల జరీవస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర చేనేత, జౌళి శాఖ కృషిచేస్తోంది. పోచంపల్లి, వరంగల్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల చేనేత వస్త్రాలను అమెజాన్‌లో అమ్ముకునేలా ఇదివరకే చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు గద్వాల ప్రాంత చీరలు, ఇతర వస్త్రాలు కూడా అమ్ముకునే అవకాశం కల్పిస్తూ...ఇక్కడి చేనేత సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి అమెజాన్ సంస్థ దక్షిణ భారత అమ్మకాల విభాగం అధిపతి నూరుల్ హుస్సేన్‌తో పాటు ప్రతినిధులు షాలిక, పృథ్వీ హాజరయ్యారు.

31లోగా 'సింగరేణి' పరిహారం చెల్లించండి

ఖమ్మం జిల్లా జడ్జికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: సింగరేణి గనుల కోసం సేకరించిన భూముల పరిహారానికి సంబంధించి లోక్ అదాలత్‌లో అవార్డు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు చెల్లించకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పరిహారం నిమిత్తం ప్రభుత్వం డిపాజిట్ చేసిన సొమ్మును లోక్అదాలత్‌లో నిర్ణయించిన ప్రకారం బాధితులకు జనవరి 31లోగా చెల్లించాలంటూ ఖమ్మం జిల్లా జడ్జికి బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పరిహారం చెల్లించాక పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంటూ విచారణను ఫిబ్రవరి 2వ తేదీకి వాయిదా వేసింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో సేకరించిన సింగరేణి భూముల పరిహారంపై లోక్అదాలత్‌లో వివాదం పరిష్కారమైనప్పటికీ సొమ్ము చెల్లించకపోవడంపై చింతల బలద్ర విఠలయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ 2013లో భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు అవార్డును కొత్త భూసేకరణ చట్టం అమలుకు ముందు ప్రకటించారన్నారు. దీనిపై బాధితులు కోర్టును ఆశ్రయించారని, చివరికి లోక్అదాలత్‌లో వివాదం పరిష్కారమైందని చెప్పారు. 2016లో పరిహారానికి సంబంధించి లోక్అదాలత్ అవార్డు జారీ అయిందని తెలిపారు. అయితే కోర్టులో డిపాజిట్ చేసిన సొమ్మును ఇప్పటికీ బాధితులకు అందజేయలేదన్నారు. పిటిషనర్‌కు 5 ఎకరాల భూమికి రూ.89 లక్షల దాకా రావాల్సి ఉందన్నారు. ఇదే వివాదంపై గతంలో పలు పిటిషన్‌లు దాఖలయ్యాయని, వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం కోర్టు వద్ద డిపాజిట్ చేసిన మొత్తం సొమ్మును బాధితులకు ఈ నెల 31లోగా అందజేసి నివేదిక సమర్పించాలంటూ ఖమ్మం జిల్లా జడ్జిని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

'తెల్ల'బోయిన పత్తిరైతు

- గతేడాది కన్నా 15.96 లక్షల క్వింటాళ్ల తక్కువ దిగుబడి
- ఎకరానికి సగటు దిగుబడి 2-3 క్వింటాళ్లే
- గులాబీ చీడ, వర్షాభావంతో నష్టపోయిన పత్తి రైతు
- పెట్టుబడులు తిరిగిరాక అల్లాడుతున్న రైతులు

ఈనాడు, హైదరాబాద్: పత్తి రైతులు నష్టాల ఊబిలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి తగ్గి పెట్టుబడులు తిరిగి రాక అప్పుల పాలయ్యారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో వర్షాధార భూముల్లో పత్తి సాగుచేసిన రైతులు పైరును కాపాడుకోలేక, ఒకసారి దూది తీసిన తరవాత ఎండబెట్టేస్తున్నారు. బోర్ల కింద సాగుచేసిన పంట కూడా గులాబీ చీడ ధాటికి దెబ్బతినడంతో రైతులు రెండు విధాలా నష్టపోయారు.



వరంగల్ మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన పత్తి

అంచనాలు తలకిందులు

ప్రస్తుత ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా 44.91 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, 3.59 కోట్ల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తొలుత మార్కెటింగ్ శాఖ అంచనా వేసింది. గత అక్టోబరు నుంచి ఇప్పటివరకు 56.72 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే మార్కెట్లకు వచ్చినట్లు తాజా నివేదికలో మార్కెటింగ్ శాఖ వెల్లడించింది. అంటే ఎకరానికి సగటున కేవలం 126 కిలోల దిగుబడే వచ్చిందన్న మాట. గతేడాది ఇదే కాల వ్యవధిలో ఇప్పటికన్నా 15.96 లక్షల క్వింటాళ్ల పత్తి అదనంగా మార్కెట్లకు వచ్చింది. పత్తి మద్దతు ధర ప్రస్తుతం క్వింటాలు ఒక్కింటికి రూ.5,450. దాన్నిబట్టి చూస్తే తగ్గిన సరాసరి దిగుబడి 15.96 లక్షల క్వింటాళ్లకు రైతులు కోల్పోయిన ఆదాయం అక్షరాలా రూ.870.09 కోట్లు.

రైతును ముంచిన వర్షాభావం

రాష్ట్రంలో ఎక్కువ మంది రైతులు ఎకరానికి కౌలు రూ.10 వేలకు పైగా చెల్లించి పత్తి సాగుచేశారు. అదనంగా ఎకరా సాగుకు రూ.25 వేల వరకూ ఖర్చవుతుంది. సాగునీరు అందుబాటులో ఉండి, సక్రమంగా పంట పండితే ఎకరానికి సగటున 8 క్వింటాళ్లకు తగ్గకుండా పత్తి దిగుబడి వస్తుందని అంచనా. ఈ సీజన్‌లో అత్యధిక శాతం రైతులకు అందులో సగమైనా రాలేదు. ఫలితంగా పెట్టుబడిలో సగం కూడా తిరిగి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీమా పరిహారం వేజారింది

పత్తి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం వర్తిస్తుంది. ప్రీమియం చెల్లింపు గడువు తేదీని వ్యవసాయశాఖ గత జులై 14గా నిర్ణయించింది. అప్పటికి వర్షాలు సరిగా కురవకపోవడం, పంట వేయకపోవడంతో రైతులు బీమా జోలికే వెళ్లలేదు. ప్రీమియం గడువు తేదీ నిర్ధారణలో అసంబద్ధత, అప్పటికి బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం(రుణం ఇచ్చేటప్పుడే బ్యాంకులు ప్రీమియం మినహాయించుకుని, ఆ సొమ్మును బీమా సంస్థలకు చెల్లిస్తాయి) తదితర పరిణామాలతో రైతులకు పరిహారం వచ్చే అవకాశాలూ వేజారాయి.

2 ఎకరాలకు 3.5 క్వింటాళ్లే వచ్చింది



అప్పులు తెచ్చి 2 ఎకరాల్లో పత్తి సాగుచేస్తే కేవలం 3.5 క్వింటాళ్లే వచ్చింది. మార్కెట్‌కు తెస్తే క్వింటాలుకు రూ.4,700 ఇచ్చారు. పెట్టుబడి రూ.50 వేలు దాటితే, చేతికి దాదాపు రూ.17 వేలే రావడంతో అప్పులు మిగిలాయి.

- సముద్రాల సాంబయ్య, వంచెనగిరి, శాయంపేట మండలం, వరంగల్ గ్రామీణ జిల్లా

అనుమతి లేని లేఅవుట్‌లకు అడ్డుకట్ట

- వాటికి రిజిస్ట్రేషన్‌లు నిలిపివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- తరువాత అక్రమ కట్టడాలకూ ఇదే వర్తింపు
- పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు
- వీటికి అడ్డుకట్ట వేసేందుకే నిర్ణయం

ఈనాడు - సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

రాష్ట్రంలో అనుమతిలేని స్థలాలకు, అక్రమ నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ చట్టంలో మార్పులను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం తుది కసరత్తు మొదలైంది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ లేఅవుట్లను, భవనాలను నిరోధించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే తమిళనాడులో అనుమతి లేని స్థలాల రిజిస్ట్రేషన్లను గత రెండేళ్ల నుంచి నిరోధిస్తూ చర్యలు తీసుకున్నారు. ఇదే తరహాలో తెలంగాణలోనూ చేపట్టనున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ

రాష్ట్రంలో బల్దియా పరిధిలో ఇటీవల కాలంలో ఎక్కువగా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. పలువురు అనుమతి లేని స్థలాలకు కూడా రిజిస్ట్రేషన్లను చేయించి అందులో నిర్మాణాలు చేసేస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లోనూ ఇలా అనుమతి లేని లేఅవుట్లు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం హైదరాబాద్ నగర పరిధిలో అయితే బల్దియా, హెచ్ఎండీఏ పరిధిలో అయితే ఈ సంస్థ మిగిలిన ప్రాంతాల్లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అనుమతి ఇవ్వాల్సింది. వీటి అనుమతిలో లేఅవుట్‌కు అనేక నిబంధనలను పాటించాల్సి రావడంతో చాలామంది వ్యాపారులు ఏళ్ల కిందట పంచాయతీ లేఅవుట్‌కు అనుమతి ఇచ్చినట్లు చూపించి అందులో ప్లాట్లను విక్రయిస్తున్నారు. వీటి గురించి రిజిస్ట్రేషన్ల శాఖ ఎలాంటి ఆరా లేకుండానే రిజిస్ట్రేషన్ చేస్తోంది.

తమిళనాడు విధానం ప్రభుత్వం దృష్టికి

తమిళనాడులో అనుమతిలేని స్థలాలకు రెండేళ్ల కిందటి నుంచి రిజిస్ట్రేషన్‌ను అక్కడి అధికారులు నిలిపివేశారు. వాస్తవానికి ఈ నిబంధన చాలా ఏళ్ల నుంచీ ఉన్నా అక్కడి అధికారులు తొలుత అమలు చేయలేదు. కొందరు మద్రాస్ హైకోర్టుకు వెళ్లడంతో తక్షణం రిజిస్ట్రేషన్ చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని ఉన్నత న్యాయస్థానం అక్కడి ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సదరు శాఖ రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఈకారణంగా అక్కడ మొదట్లో కొంత ఆదాయం తగ్గినా తరువాత గణనీయంగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.



తొలిదశలో అనుమతి లేని స్థలాలకు...

ఈ విషయాన్ని ఏడాది కిందట జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌కు వివరించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసిన కేటీఆర్ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. చట్టంలో మార్పునకు అప్పట్లో సీఎం కూడా ఆమోదముద్ర వేశారని అధికారులు చెబుతున్నారు. శాసనసభ ఎన్నికలు రావడం, ఇతరత్రా కారణాల వల్ల దీనికి సంబంధించి తయారైన ఫైలు రెవెన్యూ శాఖ దగ్గరే ఉండిపోయింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వివిధ శాఖల అధికారులతో సమావేశమై దీనిగురించి చర్చించారు. తుది ఫైలును రూపొందించి దీనిపై న్యాయశాఖ అభిప్రాయాన్ని కోరాలని నిర్ణయించారు. తరువాత ముఖ్యమంత్రి తుది అనుమతి కోసం ఫైలును పంపాలని నిర్ణయించినట్లు అధికారవర్గాలు 'ఈనాడు'కు తెలిపాయి. తొలిదశలో అనుమతి లేని లేఅవుట్‌లోని స్థలాల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని అనుకుంటున్నారు. ఇందులో సాధక బాధకాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత అక్రమ నిర్మాణాలపై కూడా తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. స్థలాలతో పాటే అక్రమ భవనాలకు కూడా రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేస్తేనే ఫలితం ఉంటుందని బల్దియా, హెచ్ఎండీఏ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రూ.400 కోట్లు ఆదాయం తగ్గే అవకాశం

రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ ఆధ్వర్యంలో ఏటా 12 లక్షల రిజిస్ట్రేషన్లు, ఏటా 50 వేల నుంచి లక్ష వరకు స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇందులో అనుమతిలేని స్థలాలు అధికంగా ఉంటున్నాయి. వీటి రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తే మొదటి ఏడాది రూ.400 కోట్ల వరకు ఆదాయానికి గండి పడుతుందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తొలుత తగ్గినా తమిళనాడు తరహాలో రెండో ఏడాది నుంచి అనుమతి పొందిన స్థలాల రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగి ఆదాయం వృద్ధి చెందే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రయోగాత్మకంగా ఈఎన్‌టీ వైద్య పరీక్షలు

- 3 జిల్లాల్లో ఈ నెల 6నుంచి

ఈనాడు, హైదరాబాద్: చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలను ముందుగా మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. వీటిని ఈ నెల 6 నుంచి 8 వరకు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. శాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రాంతంలోని ఐదు జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా వైద్యపరీక్షలు జరపనుండటంతో, ఏర్పాట్లపై చర్చించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈఎన్‌టీ, దంతవైద్య విభాగాలకు చెందిన మూడేసి బృందాలను ప్రయోగాత్మక శిబిరాల్లో వినియోగించాలని నిర్ణయించారు. ఒక్కో బృందంలో 11 మంది సిబ్బంది ఉంటారు. బుధ, గురువారాల్లో ప్రత్యేక శిక్షణ అనంతరం ఆయా ప్రాంతాలకు పంపిస్తారు. శిబిరాల్లో అనుభవాల ఆధారంగా, పూర్తిస్థాయి మార్గదర్శకాలు రూపొందిస్తారు. సన్నాహక సమావేశంలో పాల్గొన్న రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు పలు సూచనలు అందించారు.

నత్తనడకన యాసంగి సాగు

- వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత యాసంగి(రబీ) పంటల సాగు సాధారణంకన్నా చాలా తక్కువగా ఉంది. ఇప్పటివరకు 77 వేల హెక్టార్లలోనే వరి నాట్లు పడ్డాయి. గతేడాది యాసంగిలో ఇదే సమయానికి లక్షా వేయి హెక్టార్లలో నాట్లు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నందున నీటి వసతి లేక వరి నాట్లు తక్కువగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. యాసంగిలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 13.38 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటికి 4.31 లక్షల హెక్టార్లలోనే విత్తనాలు, నాట్లు వేశారు. గతేడాది ఇదే కాలవ్యవధిలో ఇంతకన్నా మరో 43 వేల హెక్టార్లు అదనంగా సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ సీజన్‌లో అధికంగా సాగయ్యే పంటల్లో సెనగ తప్ప మరేదీ వందశాతం ఇప్పటి వరకూ వేయలేదు. మొక్కజొన్న, వేరుసెనగ, జొన్న తదితర పంటలన్నీ చాలా తక్కువగా వేశారు. నీటి వసతి లేని ప్రాంతాల రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఈనాడు

దేదీప్య భారతానికి భరోసా

ఏ దేశ ఉజ్జ్వల ప్రగతికైనా నిరంతర విద్యుత్ సరఫరా వ్యవస్థే కీలక చోదకశక్తి. కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చెప్పినట్లు- మనిషికి శ్వాస మాదిరిగానే జాతికి విద్యుత్ ప్రాణాధారంగా మారింది. అంతటి ప్రాధాన్యంగల విద్యుత్తును వచ్చే ఏప్రిల్ ఒకటినుంచి దేశ వ్యాప్తంగా వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలూ లేకుండా సరఫరా చేయనున్నామని మోదీ ప్రభుత్వం తీపి కబురు వినిపించింది. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తి అయ్యాయన్న కేంద్రమంత్రి- అవసరం మేరకు విద్యుత్ కొనకుండా సరఫరా సంస్థలు (డిస్కమ్‌లు) కరెంటు కోతలకు ఇక సిద్ధపడలేవని, వాటి పని పోకడలను రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ మండళ్లు ఓ కంట కనిపెడుతుంటాయనీ భరోసా ఇస్తున్నారు. ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్ని డిస్కమ్‌లు కుదుర్చుకొన్నాయో లేదో నియంత్రణ మండళ్లు పరిశీలిస్తాయని, కావాలని కోతలకు తెగబడే సంస్థలపై భారీ అపరాధ రుసుము వడ్డిస్తాయనీ కేంద్రమంత్రి చెబుతున్నారు. తమ నష్టాల్ని తగ్గించుకోవడానికి, అహేతుక రుసుముల భారాన్ని వినియోగదారులపై మోపకుండా చూడటానికీ డిస్కమ్‌లు వ్యూహరచన సాగించాలంటున్న కేంద్రం- వచ్చే ఏప్రిల్‌నుంచి అవి గాడిన పడతాయని గట్టిగా తీర్మానిస్తోంది. కొన్ని రాష్ట్రాలు వినియోగదారులనుంచి కరెంటు బిల్లుల్ని సక్రమంగా వసూలు చెయ్యకపోవడంతో, ఆశించిన రాబడుల్లో సగం దాకా కోల్పోతున్నాయంటూ- విద్యుత్ ఉద్యోగులతో నిమిత్తంలేని కొత్త తరహా వసూలు ప్రతిపాదనలతో కేంద్రం ముందుకొచ్చింది. వచ్చే మూడేళ్లలోగా అన్ని రాష్ట్రాలూ తప్పనిసరిగా చిన్న వినియోగదారులకైతే ముందస్తు చెల్లింపు మీటర్లు, పెద్దస్థాయి వారికోసం స్మార్ట్ మీటర్లను సమకూర్చాల్సి ఉంటుంది. దానివల్ల అవినీతికి అడ్డుకట్టపడి, కరెంటు బిల్లులు సక్రమంగా వసూలవుతాయంటున్న మోదీ ప్రభుత్వం- ఏనాడో 1991లో పురుడుపోసుకున్న విద్యుత్ రంగ సంస్కరణల్ని అక్షరాలా కొత్త పుంతలు తొక్కిస్తోంది. ప్రధానంగా అవినీతి చీకట్లు మలిగిపోతే, విద్యుత్‌రంగం ఇక జేగీయమానమే!

దేశంలో ప్రతి గ్రామానికీ విద్యుత్తును అందుబాటులోకి తీసుకువచ్చిన చరిత్రాత్మక దినంగా నిరుడు ఏప్రిల్ 28ని ప్రధాని మోదీ కొనియాడారు. అదే విధంగా ప్రతి ఇంటిలోనూ 'విద్యుత్ వెలుగులు విరబూయించడానికి రూ.16,320 కోట్లతో చేపట్టిన 'సౌభాగ్య' పథకం కింద నూరుశాతం విద్యుదీకరణ లక్ష్యం వచ్చే గణతంత్ర దినోత్సవం నాటికి పూర్తి అవుతుందంటున్నారు. సౌభాగ్య కింద మొత్తం రెండు కోట్ల 49 లక్షల గృహాలకు కరెంటు సౌకర్యాన్ని ఈ ఏడాది మార్చి ఆఖరునాటికి కల్పించాల్సి ఉండగా- అసోం, రాజస్థాన్, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్‌లలో కేవలం పదిన్నర లక్షల ఇళ్లే ఇంకా పెండింగులో ఉన్నాయంటున్నారు. మొన్న డిసెంబరు నాటికే కోట్లమంది కొత్త వినియోగదారులు జమపడ్డారని, వచ్చే ఐదేళ్లలో 8-9శాతం వృద్ధికి ఊతమిచ్చేలా విద్యుత్ గిరాకీ ఇంతలంతలు కానుందన్న అంచనాల్తో వీసమెత్తు చేటు లేదు. కేవలం ఆరు రాష్ట్రాలకు చెందిన గ్రామాల్లోనే ప్రస్తుతం నిరంతర విద్యుత్ సరఫరా సాగుతుండగా, తొమ్మిది రాష్ట్రాల్లో రోజుకు 18 గంటలు కూడా కరెంటుకు దిక్కులేదు. మిజోరం, హరియాణాల్లోని గ్రామాలైతే 13 గంటల విద్యుత్తుతోనే సతమతం కావాల్సి వస్తోంది. ఈ దురవస్థ రూపుమాసిపోయి దేశ వ్యాప్తంగా గ్రామాలన్నింటా నిరంతర విద్యుత్ స్వప్నం సాకారమైతే- పల్లెపట్టుల ముఖచిత్రమే గణనీయంగా మారిపోతుంది. ఈ ఏడాది ఇండియా, విద్యుత్ మిగులుతో కళకళలాడనుందని కేంద్రీయ విద్యుత్ ప్రాధికార సంస్థ చెబుతున్నా- నిరంతరాయ విద్యుత్ సరఫరా నిబంధన కచ్చితంగా అమలైన పక్షంలో ఆటుపోట్లు తప్పవన్న హెచ్చరికలు అప్పుడే చెవినపడుతున్నాయి. కేవలం పునరుత్పాదక ఇంధన వనరులమీద మాత్రమే ఆధారపడటం సరికాదంటూ పారిశ్రామిక వర్గ నిపుణుల హితవునూ చెవిన పెట్టి- గట్టి సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగేయాలి!

దేశంలో విద్యుదుత్పాదక సామర్థ్యం 346 గిగావాట్లు; నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో మరో 5-10 గిగావాట్లు దానికి జతపడి, 2026-'27 దాకా గరిష్ఠ డిమాండు మేరకు సరఫరా సామర్థ్యం ఇప్పటికే సిద్ధంగా ఉందని విద్యుత్ ప్రాధికార సంస్థ చెబుతోంది. అదనపు కనెక్షన్లు, నిరంతర విద్యుత్తుతోను, పారిశ్రామిక కార్యకలాపాలు ముమ్మరించడంవల్లా ఆ లెక్కలు తప్పే ప్రమాదం ఉందని, సత్వరం కళ్లు తెరవకుంటే 2023 తరవాత విద్యుత్ లోటు వెక్కిరిస్తుందని అధ్యయనాలు చాటుతున్నాయి. చైనా, అమెరికాల తరవాత ప్రపంచంలోనే అతిపెద్ద విద్యుదుత్పత్తిదారుగా ఇండియా నిలిచినా తలసరి వినియోగమే ప్రగతికి ప్రామాణికమైతే- ఎన్నో యోజనాల దూరం వెనకబడి ఉంది. విద్యుత్ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవటంతోపాటు, డిస్కమ్‌లు కృత్రిమంగా గిరాకీని అదుపు చెయ్యడంతో- విద్యుత్ మిగులు తేలుతున్నా, అదంతా కనికట్టే! సహజంగా సంభవించే సరఫరా నష్టాలు 2.62- 7.71శాతం మధ్యలో ఉండాలిగాని, దేశవ్యాప్త సగటు 2015-'16లో 21.8శాతంగా నిగ్గుతేలడం డిస్కమ్‌ల అసమర్థత, అవినీతికి సంకేతమే! సరఫరా నష్టాల్ని ఒక్క శాతం పరిహరించగలిగినా విద్యుత్ కొనుగోలు వ్యయంలో రూ.4,146 కోట్లు కలిసివచ్చినట్లేనంటున్న కేంద్రమంత్రి- కరెంటు తీగలకు కొక్కేలు తగిలించే చేతివాటాలకూ చెల్లుకొట్టే కొత్త ప్రతిపాదనల్ని సిద్ధం చేశారు. ఎంత వాడతామో అంతకే ముందస్తు చెల్లింపుతో మొబైల్ 'సిమ్' తీసుకొన్న తరహాలో పేదింటివారూ తమ అవసరానికి తగ్గట్లు ప్రీపెయిడ్ మీటర్లతో నిరంతర కరెంటు సేవల్ని పొందే సౌలభ్యం- విప్లవాత్మకం కానుంది. అన్ని రాష్ట్రాలతో సంప్రదించి కేంద్రం చూపుతున్న చొరవ దేశ సామాజిక ఆర్థిక స్థితిగతుల్ని మేలి మలుపు తిప్పేటంత ప్రభావాన్వితమైనది!

అడుగైనా కదలని నదుల అనుసంధానం



నదుల అనుసంధాన ప్రతిపాదన, దానిపై చర్చలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ పథకానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా కమిటీలు, చర్చలతో కాలయాపన తప్ప అడుగు ముందుకు పడనేలేదు. అన్ని అనుమతులు లభించి, రాష్ట్రాల మధ్య అంగీకారం ఉన్న పథకాలను సైతం చేపట్టలేకపోయింది. నదుల అనుసంధానంలో భాగంగా ప్రతిపాదించిన 30 పథకాలను వేగవంతంగా చేపట్టాలని 2014లో కేంద్రం నిర్ణయించింది. నదుల అనుసంధానం ద్వారా మూడు కోట్ల హెక్టార్ల ఆయకట్టు సాగులోకి వస్తుందని ప్రకటించింది. కానీ కమిటీల మీద కమిటీలు, రెండు నెలలకోసారి రాష్ట్రాలతో సమావేశాలతోనే పొద్దుపుచ్చుతోంది. అనుసంధానానికి రూ.5.6 లక్షల కోట్లు వ్యయమవుతుందని మొదట అంచనా వేశారు. తరవాత కొన్ని మార్పులతో రూ.4.34 లక్షల కోట్లకు తగ్గించారు. ఆపై ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్థిక, సాగునీటి రంగ నిపుణులతో ఓ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని నదుల అనుసంధానానికి రూ.8.44 లక్షల కోట్లు ఖర్చవుతుందని తేల్చింది. ఇందులో రూ.6.39 లక్షల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, రూ.2.02 లక్షల కోట్లు జల విద్యుత్తు ప్రాజెక్టులకు ఖర్చవుతుందని లెక్కకట్టింది. నదుల అనుసంధాన ప్రాజెక్టులన్నింటికీ జాతీయ హోదా కల్పించి కేంద్రం 90 శాతం, రాష్ట్రం పదిశాతం నిధులతో పూర్తి చేయాలన్నది మొదట్లో నిర్ణయం. ఇప్పుడు ఆ ఆలోచనను పక్కనపెట్టింది. అంతర్జాతీయ బ్యాంకులు, సంస్థల నుంచి రుణంగా తీసుకొని చేపట్టాలని కొత్తగా ప్రతిపాదించారు. మూడు దశాబ్దాల్లో అంటే 2020 నుంచి 2050 మధ్య పథకాలను పూర్తి చేయాలన్నది లక్ష్యం. అంటే 30 ఏళ్లలో పెరిగే ధరలను పరిగణనలోకి తీసుకొని పదిలక్షల కోట్ల రూపాయల మేర ఖర్చు చేయాలి. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 15 శాతం వ్యయపరిస్తే- మిగిలింది బ్యాంకులు, విదేశీ ఆర్థిక సంస్థల నుంచి రుణంగా తీసుకోవచ్చని నదుల అనుసంధానం ఆర్థిక అంశాలపై ఏర్పాటైన కమిటీ సూచించింది. అంటే పూర్తిగా అప్పుల మీద ఆధారపడి ఈ ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఆలోచన అంత ఆచరణ సాధ్యమయ్యే పనికాదు. ఆ సంస్థలు రుణం మంజూరు చేసేటప్పటికే సగం గడువు ముగుస్తుంది.

తొలుత నాలుగు పథకాలు

నిధుల సమస్యను పరిగణనలోకి తీసుకొని నాలుగు అనుసంధానాలను మొదట ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. ఇందులో కెన్-బెత్వా, దామన్‌గంగ-పింజల్, పార్-తాపి-నర్మద, గోదావరి-కావేరి అనుసంధానాలున్నాయి. వీటిని పదేళ్లలో పూర్తి చేయాలన్నది కమిటీ సూచించింది. అందుకు రూ.93,194 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. అంటే ఏడాదికి సగటున పదివేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే నాలుగు అనుసంధానాలు పూర్తవుతాయి. కేంద్రానికిది పెద్ద సమస్య కాదు. రాష్ట్రాలపై భారం వేయకుండా నిధులు సమకూర్చి తమది మాటల ప్రభుత్వం కాదని కేంద్రమూ చెప్పుకోవచ్చు. కానీ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా పథకం వల్ల ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ప్రత్యేకించి వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా రెండు దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి దశకు అన్ని అనుమతులూ వచ్చాయి. 2017 జూన్‌లో పెట్టుబడి అనుమతీ లభించింది. ఫాస్ట్‌ట్రాక్ కింద నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించినా, ఆచరణలో ఒక్క అడుగైనా ముందుకు పడలేదు. మరోవైపు, అంచనా వ్యయాలు పెరుగుతున్నాయి. కెన్-బెత్వా ప్రాజెక్టు రెండుదశలు పూర్తి చేయడానికి రూ.35వేల కోట్లు కావాలి. మరో ప్రాధాన్య పథకం దక్షిణాది రాష్ట్రాలకు చెందిన గోదావరి-కావేరి అనుసంధానం. గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌లోని నాగార్జునసాగర్‌కు మళ్లించడం, అక్కడి నుంచి

ముందుకు సాగని చర్చలు


పెన్నా బేసిన్‌లోని సోమశిలకు, ఆపై తమిళనాడు ద్వారా కావేరిపై ఉన్న గ్రాండ్ ఆనకట్టకు నీటిని తరలించాలన్నది ప్రణాళిక. దీని ద్వారా నాలుగు నదులను అనుసంధానం చేయవచ్చు. 247 శతకోటి ఘనపుటడుగుల (శకోఘ- టీఎమ్‌సీల) నీటిని మళ్లించి మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ఆయకట్టుకు నీటిని ఇవ్వడంతోపాటు కావేరిపై ఉన్న గ్రాండ్ ఆనకట్టకు 50 శకోఘలు మళ్లించాలన్నది ప్రణాళిక. మొదట నదుల అనుసంధానంలో ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ లింక్ ఉండగా, ఇది ఆచరణ సాధ్యంకాదని గోదావరి(అకినేపల్లి వద్ద నుంచి)- కావేరి(గ్రాండ్ ఆనకట్టవరకు) అనుసంధానాన్ని కేంద్రప్రభుత్వం నిరుడు అకస్మాత్తుగా ముందుకు తెచ్చింది. గోదావరి నీటిని కావేరికి మళ్లించడం ద్వారా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం భావించింది. జాతీయ జల అభివృద్ధి సంస్థతో నివేదిక తయారు చేయించి 2018 జనవరిలో భాగస్వామ్య రాష్ట్రాలతో ఓ సమావేశం ఏర్పాటు చేసింది. ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించే పనిలో జాతీయ జల అభివృద్ధి సంస్థ ఉంది. ఆర్థిక కమిటీ అంచనా ప్రకారం ఈ పథకానికి రూ.45,700 కోట్లు కావాలి. సమగ్ర ప్రాజెక్టు నివేదిక తరవాత తుది అంచనా వస్తుంది. నిధుల్ని అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణంగా తీసుకోవాలన్నది ప్రతిపాదన. పదేళ్లలో పూర్తి చేయాలంటే ఏడాదికి అయిదు వేల కోట్ల రూపాయల దాకా అవసరం. కేంద్రం తలచుకుంటే ఇదేమీ పెద్ద పని కాదు. అయినా మీనమేషాలు లెక్కిస్తోంది. పథకంపై తెలంగాణ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని పరిష్కరించి ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది.

వ్యూహం మారాలి

నదుల అనుసంధానంపై కేంద్ర ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాల మధ్య విభేదాలు లేని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగే అనుసంధానాలపై తొలుత దృష్టి సారించాలి. దశాబ్దాల తరబడి సాగే చర్చల వల్ల ప్రజల్లో నమ్మకం కలగదు. రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి రంగంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి పనులు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలు భారీగా నిధులు గుమ్మరించి పనులు చేపట్టాయి. కేంద్రంతో సంబంధం లేకుండా నదుల అనుసంధానాన్ని చేపట్టాయి. ఒక నదిపై ప్రాజెక్టు చేపట్టి ఇంకో నదీ ప్రాంతంలోని ఆయకట్టుకు నీటిని మళ్లిస్తున్నాయి. నీటి లభ్యత ఉండి ఇలాంటి పథకాలను చేపట్టే రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నిధులిచ్చి త్వరగా పనులు పూర్తి చేయడానికి దోహదపడాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఓ అవగాహనకు వచ్చి కొంత నీటిని అవసరం ఉన్న పక్క రాష్ట్రానికి మళ్లించడానికి అంగీకరింపజేయాలి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మహారాష్ట్ర సానుకూలంగా స్పందించడంతో మేడిగడ్డ నుంచి కొంత నీటిని ఆ రాష్ట్ర రైతుల అవసరాలకు తీసుకోవడానికి తెలంగాణ అంగీకరించింది. రెండు రాష్ట్రాల మధ్య సంప్రతింపుల ద్వారా ఇది సాధ్యమైనపుడు కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు కాదన్నది ప్రశ్న. నదుల అనుసంధానం కొత్తేమీ కాదు. దశాబ్దాల క్రితమే తెలుగు రాష్ట్రాల్లో ఒక బేసిన్ నుంచి ఇంకో బేసిన్‌కు నీటిని మళ్లించగలిగారు. 2005లో పోలవరం నిర్మాణం ద్వారా 80 శకోఘల గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌కు మళ్లించే పనులు ప్రారంభమయ్యాయి. ఇది జాప్యం కావడంతో రాష్ట్రాల పునర్విభజన తరవాత పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏడాదిలోనే పూర్తి చేసి నీటిని మళ్లించింది. ఈ పథకం పూర్తయినప్పటి నుంచి 243 శకోఘల గోదావరి నీటిని కృష్ణాకు మళ్లించింది. తాజాగా గోదావరి-పెన్నా అనుసంధానం మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తయిన తరవాత 80 శకోఘలకు పైగా కృష్ణా బేసిన్ ప్రాంతంలోని ఆయకట్టుకు వెళ్తాయి. సీతారామ ఎత్తిపోతల, దేవాదుల... ఇలా గోదావరి నుంచి నీటిని మళ్లించే పథకాలన్నింటి కింద కృష్ణాబేసిన్‌లోని ఆయకట్టుకు నీరందుతుంది. ఇప్పటికే ప్రతిపాదించిన కొన్ని అనుసంధానాలను పక్కనపెట్టి రాష్ట్రాల మధ్య సానుకూలత ఉన్న, ఎక్కువ ఉపయోగపడే పథకాలకు కేంద్రం నిధులు సమకూర్చగలిగితే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఆలమట్టి-పెన్నా లాంటి అనుసంధానాలకు ఇప్పుడు అవకాశం లేదు. ఇలాంటి పథకాలకు స్వస్తి పలికి మార్పులు చేర్పులతో, రాష్ట్రాల భాగస్వామ్యంతో పనులు చేపడితేనే నదుల అనుసంధానం కార్యరూపం దాల్చుతుంది!

– ఎం.ఎల్.నరసింహారెడ్డి

దిగిరాని రాష్ట్రాలు



నదుల అనుసంధానంపై కేంద్ర ప్రభుత్వం తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నా, నీటి లభ్యత విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. లభ్యమవుతున్న జలాలు తమ అవసరాలకే సరిపోవడం లేదని, పైనుంచి తెచ్చి మళ్లిస్తే అభ్యంతరం ఉండదంటూ ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చెబుతోంది. దేశం మొత్తమ్మీద 30 అనుసంధానాలు ఉంటే ఒడిశా, దక్షిణాది రాష్ట్రాల్లో తొమ్మిది అనుసంధానాలు ఉన్నాయి. ఒడిశాలోని మహానది నుంచి గోదావరికి మళ్లించడం, అక్కడి నుంచి కృష్ణా-పెన్నా-కావేరి అనుసంధానాలు వీటిలో ఉన్నాయి. మహానది నుంచి 430 శకోఘలు మళ్లిస్తే, ఇందులో ఒడిశా అవసరాలు పోను 230 శకోఘలు ధవళేశ్వరం వద్ద గోదావరిలో కలవాల్సి ఉంది. అంత నీటి లభ్యత లేదని, ఉన్నది తమ అవసరాలకు సరిపోతుందని, పైనుంచి తెస్తే దిగువకు విడుదల చేయడానికి అభ్యంతరం లేదని, ముంపు సమస్యలూ రాష్ట్రంలో ఎక్కువగా ఉంటాయని... ఇలా అనేక అభ్యంతరాలను ఒడిశా వ్యక్తీకరించింది. పలు ప్రత్యామ్నాయాలపై జాతీయ జల అభివృద్ధి సంస్థ అధ్యయనం చేసి, నీటిలభ్యత ఉందని తేల్చింది. ఒడిశా ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తోంది. ఇది ఓ కొలిక్కి వస్తేగానీ అనుసంధానం ముందుకు సాగదు. ఇది జాప్యమవుతుందని భావించిన కేంద్రం గోదావరి-కావేరి అనుసంధానానికి పూనుకోగా, దీనికి తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒడిశా మాదిరిగానే తెలంగాణ కూడా స్పందించింది. ఇక ఇంద్రావతిలో తమ వాటాను ఛత్తీస్‌గఢ్ వాడుకోవడం లేదు కాబట్టి ఆ నీటిని మళ్లిస్తామని కేంద్రం చెప్పింది. ఏడాది క్రితం ఈ పథకం గురించి కేంద్రం మాట్లాడినప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో భాజపా ప్రభుత్వం ఉంది. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏ రాష్ట్రమూ తమకు హక్కుగా ఉన్న నీటిని వదులుకోవడానికి సిద్ధపడదు. మారిన పరిస్థితుల్లో గోదావరి-కావేరి ముందుకెళ్లడం కూడా అంత సులభంగా జరిగే పని కాదు.

పరిశోధనల్లో ఏదీ ప్రగతి?

భారత విజ్ఞానశాస్త్ర రంగం మరో మైలురాయిని అధిగమిస్తోంది. 106వ భారత వైజ్ఞానిక మహాసభలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు జలంధర్‌లో ప్రారంభించనున్నారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో విజ్ఞానశాస్త్రం ఆసరాతో భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దడమెలాగన్నది ఈ అయిదు రోజుల మహాసభల్లో ప్రధాన చర్చనీయాంశం కానుంది. భారత ప్రభుత్వం విజ్ఞానశాస్త్ర వికాసానికి, విశిష్ట పరిశోధనల ద్వారా వినూత్న ఆవిష్కరణలకు అండదండలు అందించాల్సిన అవసరాన్ని చాటి చెబుతున్న సందర్భమిది.

దేశాభివృద్ధిలో శాస్త్రసాంకేతిక విజ్ఞానరంగానికి గల ప్రాధాన్యం ఎనలేనిది. ఆర్థిక వ్యవస్థలోని పలు పార్శ్వాలపై శాస్త్రసాంకేతిక విజ్ఞానం, నిరంతర పరిశోధనలు నూతన ఆవిష్కరణలు గణనీయమైన ప్రభావం చూపాయి. ముఖ్యంగా శాస్త్రసాంకేతిక రంగాల్లో ఇటీవల సంభవించిన పలు విప్లవాత్మక మార్పులు, విజ్ఞానశాస్త్ర ఫలాలైన నూతన ఆవిష్కరణలు మానవ జీవితాన్ని సుఖమయం చేశాయి. నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు చక్కటి పరిష్కారాలను చూపాయి. పరిశోధనలకు, ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇచ్చిన పలుదేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా ఎదగడంతో పాటు అనతికాలంలోనే ప్రబల ఆర్థికశక్తులుగా అవతరించాయి. భారత దేశం వివిధ రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించేందుకు శాస్త్రసాంకేతిక విజ్ఞానం పరిశోధనలు అత్యంత కీలకమైనవని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించారు. 1958లో శాస్త్ర విజ్ఞాన విధాన తీర్మానం (సైంటిఫిక్ పాలసీ రిజల్యూషన్) ప్రతిపాదించారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించి, వాటి ఫలితాలను దేశంలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా బృహత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ తీర్మానం రూపొందించారు. పంచవర్ష ప్రణాళికలద్వారా సత్వర ఆర్థికాభివృద్ధి సాధనకు, శాస్త్రసాంకేతిక విజ్ఞాన పరిశోధనలకు విశేష ప్రాధాన్యం ఇచ్చారు. జాతీయస్థాయి ప్రయోగశాలలు, పరిశోధన సంస్థలు, భారతీయ సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిలో మౌలిక వసతుల కల్పనకు నాటి పాలకులు పెద్దపీట వేశారు.

అరకొర నిధులు

శాస్త్ర సాంకేతిక విజ్ఞాన మంత్రిత్వశాఖ పరిధిలోని వివిధ సంస్థల్లో జరుగుతున్న పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే వెనకబడి ఉన్నాయి. కొత్త ఆవిష్కరణలు, సర్వహక్కులు (పేటెంట్లు) భారత్‌కు రాకపోవడానికి ఇదే కారణం. పొరుగున చైనాతో పోలిస్తే శాస్త్ర పరిశోధనల్లో భారత్ చాలా వెనకబడి ఉంది. ప్రపంచవ్యాప్తంగా పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై పెడుతున్న ఖర్చు 1.14 లక్షల కోట్ల డాలర్ల పైమాటే. ఇందులో సింహభాగం (33.6 శాతం) అమెరికాదే. ఐరోపా సమాజం 24.5 శాతం; జపాన్, చైనాలు 12.6 శాతం ఖర్చుపెడుతున్నాయి. భారత్ వాటా కేవలం 2.1 శాతమే. ఇండియాలో పరిశోధకుల సంఖ్య తక్కువే. అమెరికాలో ప్రతి పది లక్షల మందికి 4,651 మంది పరిశోధకులుండగా, భారత్‌లో కేవలం 156మంది ఉన్నారన్నది నిష్ఠుర సత్యం. నిధుల కేటాయింపూ అంతంత మాత్రమే. భారత్ తన స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో పరిశోధన- అభివృద్ధి కోసం కేటాయిస్తోంది కేవలం 0.8 శాతమే. మరోవైపు దక్షిణ కొరియా జీడీపీలో 4.3 శాతం, ఇజ్రాయెల్ 4.2, అమెరికా 2.7, చైనా 2.04 శాతం ఇందుకోసం ఖర్చుపెడుతుండటం గమనార్హం. మన పాలకులు ఆర్ అండ్ డీపై ఖర్చును జీడీపీలో 1.2 శాతానికి పెంచుతామన్న హామీలు నీటి మూటలయ్యాయి. గత ఇరవై ఏళ్లుగా కేటాయింపులు 0.6 నుంచి 0.8 శాతమే ఉండటం ఆందోళన కలిగించే విషయం. దేశం 10 శాతం వృద్ధిరేటు సాధించాలంటే పరిశోధనలపై నాలుగు శాతం నిధులు కేటాయించాలి. పరిశోధన-అభివృద్ధికి ప్రభుత్వరంగమే అధికశాతం (75.8శాతం) నిధులు కేటాయిస్తోంది. ప్రభుత్వేతర సంస్థలు ప్రైవేటు కంపెనీలు చేస్తున్న ఖర్చు 20 నుంచి 25 శాతానికి పరిమితమవుతోంది. ఇక విశ్వవిద్యాలయాలు పరిశోధన-అభివృద్ధికి కేటాయిస్తున్న మొత్తం మూడు శాతానికి మించడంలేదు. అమెరికా, జపాన్, సింగపూర్ లాంటి దేశాల్లో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. ఆయా దేశాల్లో పరిశోధన-అభివృద్ధి రంగాలకు అనేక ప్రభుత్వేతర సంస్థలు భారీయెత్తున నిధులు సమకూరుస్తున్నాయి. ఫలితంగా అధ్యాపకులు, విద్యార్థులు తమ మేధకు పదునుపెట్టి వినూత్న పరిశోధనలతో సరికొత్త ఆవిష్కరణలు చేయగలుగుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం దిగ్గజ కర్మాగార సంస్థలు, ధార్మిక సంస్థలు, గేట్స్, ఫోర్డ్ ఫౌండేషన్ వంటి దాతృత్వ సంస్థలు విశ్వవిద్యాలయాలకు, పరిశోధన సంస్థలకు నేరుగా నిధులు కేటాయిస్తుండటమే!



నేటి నుంచే భారత వైజ్ఞానిక మహాసభలు

భారత్‌లో ఏటా నాలుగు లక్షల మంది ఇంజినీరింగ్‌లో, మూడు లక్షల మంది కంప్యూటర్ విద్యలో, 30 వేల మంది ఉన్నత పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యలో పట్టాలు తీసుకుంటున్నారు. 14 వేల మందికిపైగా పరిశోధకులు పీహెచ్‌డీ పట్టాలను విశ్వవిద్యాలయాలు ప్రదానం చేస్తున్నాయి. చైనాతో పోలిస్తే భారత్‌లో ప్రచురితమవుతున్న పరిశోధన పత్రాలు నాలుగోవంతైనా లేకపోవడం దురదృష్టకరం. ఇక పేటెంట్ల విషయానికి వస్తే అమెరికన్ విశ్వవిద్యాలయాలు ఏటా వివిధ అంశాలపై నాలుగువేల సర్వహక్కులను సొంతం చేసుకుంటున్నాయి. మనదేశానికి అవి వందైనా ఉండటం లేదు. మోదీ ప్రభుత్వం గడచిన మూడేళ్లలో బడ్జెట్‌లో శాస్త్ర పరిశోధనలకు కేటాయింపులు పెంచినప్పటికీ అవి సరిపోవడం లేదన్నది వాస్తవం. అయినా ఆయా రంగాల్లో భారత్ గణనీయ విజయాలనే నమోదు చేస్తోంది. ఉపగ్రహ ప్రయోగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న భారత్ గగనయానంలో సరికొత్త చరిత్ర లిఖించడానికి సిద్ధమవుతోంది. మానవ సహిత అంతరిక్ష యాత్రలు చేస్తున్న రష్యా, అమెరికా, చైనాల సరసన చేరడానికి సమాయత్తమవుతోంది. అంతర్జాతీయ దిగ్గజ సంస్థల అధిపతులు ఎక్కువ మంది భారత సంతతివారు ఉండటం ఎంతో గర్వకారణం. నేడు ప్రపంచంలో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల సంఖ్యలో భారత్ ద్వితీయ స్థానాన్ని ఆక్రమిస్తుంది. అణు, అంతరిక్ష పరిశోధనల్లో సైతం భారత్ అగ్రరాజ్యాల సరసన నిలబడుతోంది.

రచ్చగెలుస్తున్నా...

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం అంచనాల ప్రకారం భారత్ నుంచి అమెరికాకు ఏటా లక్షల మంది వృత్తి నిపుణులు వలస వెళ్తున్నారు. భారత శాస్త్రవేత్తలు, విద్యార్థులు అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన సంస్థల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నా అందులో భారతీయుల భాగస్వామ్యం ఉండటం మన దేశానికి గర్వకారణం. భారతీయుల పరిస్థితి రచ్చగెలుస్తున్నా ఇంట తీసికట్టుగా ఉండటమే బాధాకరం. ఈ పరిస్థితి మారాలి. విద్యార్థుల్లోని పరిశోధన ప్రతిభను వెలికి తీసేలా విద్యావ్యవస్థను రూపొందించుకోవాలి. గ్రామసీమల్లో విద్యాగంధంలేని పామరులు సైతం సంప్రదాయ విద్య ద్వారా రాణిస్తూ వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. నిత్యజీవితంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు కనుగొంటున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలి. పరిశోధనలకు నిధుల కొరత లేకుండా దాదాపు ఏటా రూ.60 వేల కోట్లు కేటాయిస్తున్నామని కేంద్రం చెబుతోంది. సమున్నత ఆశయాలు ఆచరణలో సాకారమైనప్పుడే- ప్రపంచంలో భారత్ గొప్ప వైజ్ఞానిక శక్తిగా ఎదుగుతుంది!


– డాక్టర్ జె.సురేశ్

(రచయిత- ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులు)

తారక మంత్రం

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో మంత్రానికి ఒక విశిష్ట స్థానం ఉంది. పరమాత్మతో ఆత్మానుసంధానానికి, భక్తికి మంత్రం కీలకమైందని యజుర్వేదం చెబుతోంది. మనం దైవానికి చేసుకొనే విన్నపాలు మంత్రంలోని బీజాక్షర శక్తి కారణంగా నేరుగా చేరతాయన్నది పౌరాణికుల భావన. పూర్వ కాలంనుంచీ వైదిక మంత్రాలను మూర్తిలోకి దైవత్వాన్ని ఆవాహన చేసేందుకు ప్రయోగించడం సంప్రదాయం. మూర్తిలోకి అంటే మన హృదయంలోకి అనే భావార్థమూ ఉంది. మంత్రాలు మౌలికంగా ప్రచలిత సంహితాలు. ఏ మంత్రాన్నైనా ఓం అక్షరం చేర్చి ఉచ్చరిస్తే ఆ మంత్ర ధ్వని సత్య వ్యక్తీకరణకు కారణమవుతుందని మంత్రోపనిషత్తు వివరిస్తోంది. మంత్రాలన్నింటికీ భిన్నమై, మానసాన్ని భక్తికి గురిచేసే మంత్రం తారక మంత్రమని రామ రహస్యోపనిషత్తు తెలుపుతోంది. శ్రీరామ నామమే తారకమంత్రం. శుక్ల యజుర్వేదానికి చెందిన అద్వయ తారకోపనిషత్తులో తారక మంత్రం మహత్తు గురించిన సంపూర్ణ వివరణ ఉంది. తొలుత ఈ మంత్రం శివుడు పార్వతికి ఉపదేశించినట్లు చెబుతారు.

'శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే' అన్నదే తారక మంత్రం. కుండలినీ శక్తికి రా అనే బీజాక్షరమే మూలాధారమని స్యావన స్మృతి వెల్లడిస్తోంది. మ అనే బీజాక్షరం సహస్రార చక్రాన్ని చైతన్యపరుస్తుంది. రామ అనే నామాన్ని పలికినంతనే కుండలినీ శక్తి సర్పం ఆకారంలో పడగెత్తి కపాలాన్ని స్పృశించే ప్రయత్నం చేస్తుందని ఈ స్మృతి వివరిస్తోంది. యోగిగా మారే యోగ్యత కోసం మానవుడు సదా ఈ నామాన్ని స్మరిస్తూనే ఉండాలని పార్వతికి శివుడు చెప్పాడంటారు. ధరణిలోని మానవుడి ధన్యత కోసం రెండు మంత్రాలు అమేయమైనవని వసిష్ఠుడు దశరథుడితో అంటాడు. ఒకటి ప్రణవం, మరోటి రామ శబ్దం! అందుకే వసిష్ఠుడు దశరథుడి పెద్ద కుమారుడికి శ్రీరామ అని నామకరణం చేశాడట.



రామ రహస్యోపనిషత్తు అథర్వణ వేదానికి సంబంధించినది.

శ్రీరామ అనే పదంలోనే విశ్వాల ఆవిర్భావానికి కారణమైన రహస్యం ఉందని సప్తర్షుల్లో ఒకడైన గౌతముడు తాను రాసిన ధర్మశాస్త్రంలో వివరించాడు. అగస్త్యుడు రామ రహస్యోపనిషత్తును హనుమంతుడికి ఉపదేశించాడంటారు. స్వాయంభువ మన్వంతరంలో మానవులందరి నిజ నామం చివర రామ అని ఉండేదట. అలా ఒకరినొకరు పిలుచుకునేందుకు అనుకోకుండానే రామ నామం పలికేవారు. అందుకే ఆ మన్వంతరంలో నరకంలో పని లేక యముడు సదా నిద్రలోనే ఉండేవాడన్నది కథనం.

కాశీ క్షేత్ర స్థల పురాణాన్ని అనుసరించి- మానవుడు తనువు చాలించే ముందు అతడి కుడిచెవిలో విశ్వనాథుడు తారకమంత్రం ఉపదేశిస్తాడన్నది ఒక నమ్మకం.

రాముడు తన వంశానికి చెందినవాడని సూర్యుడికి గర్వమట. భూమిపై శ్రీరామనవమి ఉత్సవాలు చూసేందుకు సూరీడు అందుకే ఒకింత కిందికి వస్తాడట. అందువల్లే ఆ సమయంలో ఎండలు మండుతాయన్నది ఒక కవి హృదయం! అష్టాక్షరిలోని రా అక్షరం, పంచాక్షరిలోని మ అక్షరం... ఈ రెండు జీవాక్షరాలూ కలిసి రామ అయిందని పౌరాణికుల వ్యాఖ్య! అలా తారకమంత్రం ఉచ్చరించినంత మాత్రాన శివకేశవులు సంతుష్టులవుతారట.

శ్రీరామకృష్ణ పరమహంస తొలుత నరేంద్రుడికి తారక మంత్రమే ఉపదేశించాడు. ఆ తరవాతే నరేంద్రుడు వివేకానందుడయ్యాడు. కబీరు గురుబోధనతో తారక మంత్రం లభించిన కంచర్ల గోపన్న 'తారక మంత్రము కోరిన దొరికెను... ధన్యుడనైతిని' అంటూ (ధన్యాసి రాగం) ఆలపించాడు. 'రమించు వారెవరురా-రఘోత్తమా నిను వినా' (సుపోషిణి), 'మనవిని వినుమా-మరువ సమయమా' (జయనారాయణి) అంటూ ఆర్ద్రతతో రాముణ్ని స్మరిస్తూ త్యాగయ్య నాదయోగం సాధించాడు. తారక మంత్రంలోని మహత్తు అదే!

– అప్పరుసు రమాకాంతరావు

అప్పట్లో ఈ ప్రశ్నలడిగితే నవ్వేవాడినేమో!

- బిల్‌గేట్స్



2018లో నన్ను అమితంగా ఆకట్టుకున్న 5 పుస్తకాలు!

"నా చిన్నప్పుడు అమ్మానాన్నా ప్రతి క్రిస్మస్‌కూ ఆ ఏడాది మా కుటుంబం చేసిందేమిటో రాసి అందరికీ కార్డులు పంపేవాళ్లు. చాలామంది దాన్ని పాతచింతకాయ పచ్చడి అనుకునేవాళ్లుగానీ నాకు మాత్రం ఆ సంప్రదాయం ఇష్టం. అందుకే ప్రతి ఏడాది చివర్లోనూ.. నాకు బాగా సంతోషాన్నిచ్చిందేమిటి? నేనింకా దేన్నైనా బాగా చేసి ఉండాల్సిందా? అన్నది ఆలోచిస్తుంటాను.

చిత్రమేమంటే 20 ఏళ్ల వయసులో నేను వేసుకున్న ప్రశ్నలకూ.. ఈ 63 ఏళ్ల వయసులో వేసుకుంటున్న ప్రశ్నలకూ చాలా తేడా వచ్చేసింది. అప్పట్లో.. ఈ ఏడాది 'వ్యక్తిగత కంప్యూటర్' స్వప్నాన్ని సాకారం చెయ్యటంలో మా మైక్రోసాఫ్ట్ కంపెనీ ముందడుగు వేసిందా? లేదా? అది తప్పించి మరో ఆలోచన ఉండేది కాదు.

కానీ ఇప్పుడు.. ఈ ఏడాది కుటుంబానికి తగినంత సమయం ఇవ్వగలిగానా? కొన్నైనా కొత్త విషయాలు నేర్చుకున్నానా? కొత్త స్నేహాలు పెంచుకున్నానా? పాత స్నేహాలను బలోపేతం చేసుకున్నానా? ఇలా జీవితానికి సంబంధించిన చాలా ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కుంటున్నాను. బహుశా, ఇవే ప్రశ్నలు 25 ఏళ్ల వయసులో గనక నన్నెవరైనా అడిగి ఉంటే నవ్వుకునే వాడినేమో! వయసు పెరిగిన కొద్దీ ఆ ప్రశ్నలెంత అర్థవంతమైనవో తెలుస్తోంది. ఈ విషయంలో నా ఆలోచనలు విస్తృతం కావటానికి మెలిండా ఒక కారణం. దీనిలో వారెన్ బఫెట్ పాత్రా ఉంది. ఆయనెప్పుడూ "మీరు ఎవరి మీదైతే శ్రద్ధ పెడుతున్నారో వాళ్లంతా మిమ్మల్ని తిరిగి ప్రేమిస్తున్నారా?" అన్నది చూసుకోవాలంటుంటారు..

అంటూ తాజాగా బిల్‌గేట్స్ తన బ్లాగులో రాసుకున్న ఆసక్తికరమైన సమీక్షా వ్యాసం ప్రపంచ వ్యాప్తంగా పలువురిని ఆకట్టుకుంటోంది. వివరాలు ఆయన మాటల్లోనే...


వ్యాధులపై పోరు నుంచి జీవన ప్రమాణాల వైపు!

ఒకప్పుడు మన చరిత్ర అంతా కూడా వ్యాధులను ఎదుర్కొని, అందరికీ తిండి దొరికేలా చూడటం ఎలాగన్న దాని చుట్టూనే తిరిగేది. మందులు, టీకాలు, పారిశుద్ధ్యం వంటివి మెరుగుపడటంతో ఆయుర్దాయాలు పెరిగాయి. దీనిలో సాంకేతిక రంగం పెద్ద పాత్రే పోషించింది. ఇప్పటికీ ఊబకాయం, మలేరియా వంటి వాటికి పరిష్కారాలు కనుక్కోవాల్సిందేగానీ మొత్తమ్మీద వ్యాధులతో పోరాటం నుంచి మనం ఇప్పుడు జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా కదులుతున్నాం. ముమ్ముందు టెక్నాలజీ రంగం ఈ దిశగానే కొత్తకొత్త ఆవిష్కరణలను పట్టుకురాబోతోంది. ఉదాహరణకు మనకు బాలేదనుకోండి.. వెంటనే ఆ విషయం గుర్తించి, మనం ఏం తినాలి, ఏం చెయ్యాలన్న సూచలనివ్వటం, అవసరమైతే మన మిత్రులకు తెలియజేయటం వంటి పనులన్నీ చేసే పరిజ్ఞానం వచ్చేస్తోంది. సాంకేతిక ఆవిష్కరణల వల్ల ఇదంతా సాధ్యమని చెబితే చాలామంది నమ్మరుగానీ గత ఏడాది పరిశోధనలు చూస్తే అవి మనందరి జీవితాలనూ మెరుగుపరుస్తాయన్న నమ్మకం బలపడుతోంది. ఉదాహరణకు ప్రపంచానికి పెద్ద సమస్యగా మారబోతున్న ఆల్జిమర్స్ వ్యాధిని నిలువరించేందుకు, ముందే గుర్తించేందుకు చాలా కృషి జరుగుతోంది.

- సౌర, పవన ఇంధనం చౌక అవుతుండటం సంతోషకర పరిణామం. అణు ఇంధనం విషయంలోనూ కొత్త ఆవిష్కరణలు రాబోతున్నాయి.
- చాలామంది మానవాళికి ఉగ్రవాదం, పర్యావరణ మార్పుల వంటి వాటి నుంచే పెను ఉత్పాతాలు రాబోతున్నాయని నమ్ముతుంటారుగానీ, నిజానికి మనకు.. తక్కువ సమయంలో కోట్లాది మందిని కబళించే ఫ్లూ తరహా వ్యాధుల ముప్పే ఎక్కువగా ఉంది. మొత్తం ఫ్లూ వ్యాధులన్నింటికీ పనికొచ్చేలా ఒకే టీకా తయారు చెయ్యాలన్న లక్ష్యం కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.
- నవంబరులో చైనా శాస్త్రవేత్త పిండ దశలోనే జన్యు ఎడిటింగ్ చేసి ఇద్దరు బిడ్డలను పుట్టించినట్టు ప్రకటించారు. ఆయన కాస్త ఎక్కువ దూరం వెళ్లారన్న వాదనతో నేను ఏకీభవిస్తానుగానీ.. మొత్తమ్మీద జన్యు ఎడిటింగ్ గురించి మరింత మంది చర్చించేందుకు, కృషి చేసేందుకు ఆయన పని స్ఫూర్తినివ్వటం తథ్యం.


2019.. రెండు సాంకేతిక లక్ష్యాలు!

కొత్త సంవత్సర తీర్మానాలన్నది నాకు అలవాటు లేదుగానీ.. లక్ష్యాలు నిర్దేశించుకోవటం, వాటిని సాధించేందుకు ప్రణాళిక వేసుకోవటం నాకెప్పుడూ ఇష్టమే. ఈ 2019 కోసం ప్రత్యేకించి 2 లక్ష్యాలు పెట్టుకోవాలనుకుంటున్నాను. ఈ రెండూ కూడా మన జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించాలన్నవే. సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు వస్తున్న కొద్దీ ప్రజల వ్యక్తిగత గోప్యతను కాపాడుతూనే విద్య, వైద్యం వంటి రంగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుబాటులోకి తేవటం ఎలాగన్నది మొదటిది. ఉదాహరణకు పేద పిల్లలకు మంచిగా చదువు చెబుతున్న స్కూళ్లేవి? న్యాయంగా ఫీజులు తీసుకుని మంచి వైద్యం చేస్తున్న డాక్టర్లెవరు?.. గోప్యతకు భంగం లేకుండా ఇలాంటి సమాచారాన్ని సాధ్యం చేసేదెలా అన్నది చూడాలి. రెండోది- కొన్నేళ్లుగా సాఫ్ట్‌వేర్లు, టెక్నాలజీల వల్ల చదువులు గొప్పగా మారిపోతున్నాయని చాలా మంది చెప్పుకోవటం చూస్తున్నాం. నిజమేనా? అని దీన్ని అనుమానించే వాళ్లూ ఉన్నారు. మొత్తానికి టెక్నాలజీ అన్నది మన పిల్లల చదువులను ఎంత వరకూ మెరుగుపరుస్తుందన్నది కచ్చితంగా అంచనా వేసుకునే దశకైతే చేరుకున్నాం మనం. అందుకే ఈ సంవత్సరం దీని మీద కూడా దృష్టి పెట్టాలనుకుంటున్నాను.




1 ఎడ్యుకేటెడ్ — రచయిత: టారా వెస్టోవర్

ఆమె ఎన్నడూ స్కూలుకు వెళ్లింది లేదు. కనీసం డాక్టరు దగ్గరకు వెళ్లింది కూడా లేదు. కేవలం చదువుకోవాలన్న ఒకే ఒక్క బలమైన ఆశతో 17 ఏళ్ల వయసులో ఇంటి నుంచి పారిపోయింది. చివరికి కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించిన వైనం గురించి ఆమె అద్భుతంగా రాస్తుంటే.. నేనూ, మిలిండా ఎంతో చలించిపోయాం. ఆమె బాల్యాన్ని చదువుతూ మాకు తెలియకుండానే మా జీవితాలనూ ఎంతో తరచి చూసుకున్నాం.



2 ఆర్మీ ఆఫ్ నన్ — రచయిత: పాల్ షెరె

కృత్రిమ మేధతో నడిచే ఆయుధాలు, యుద్ధతంత్రాలు వస్తాయని మనం ఇప్పుడే ఊహించటం లేదుగానీ.. ఈ పుస్తకాన్ని చదవటం ఆరంభిస్తే కళ్లు తిరిగే కొత్తలోకం మన ముందు ఆవిష్కృతమవుతుంది. ఎంతో సంక్లిష్టమైన ఈ అంశం మీద కూడా షెరె మంచీ, చెడూ.. రెండు పార్శ్వాలనూ తడుముతూ ఆధునిక యుద్ధతంత్రాన్ని కళ్లకు కట్టారు.



3 బ్యాడ్ బ్లడ్ — రచయిత: జాన్ కారిరౌ

చుక్క రక్తంతోనే బోలెడన్ని వ్యాధుల సమాచారం చెప్పేస్తామంటూ సంచలనం సృష్టించి లక్షల కోట్లకు పడగలెత్తిన థెరనోస్ కంపెనీ. ఆ తర్వాత పెద్ద బూటకంగా ఎలా తేలిందీ.. ఆ నేపథ్యంలో చోటుచేసుకున్న భారీ కార్పొరేట్ కుంభకోణాలూ, వివాదాల గురించీ అద్భుతంగా చెప్పే పుస్తకం ఇది.



4 21 లెసన్స్ ఫర్ 21 సెంచరీ — రచయిత: యువల్ నోవా హరారి

సెపియన్స్ పుస్తకంతో ఇప్పటికే అంతర్జాతీయ పాఠకులను ఆకట్టుకున్న హరారి రాసే ప్రతి రచనకూ నేనో పెద్ద అభిమానిని. గతంలో మానవ పరిణామం గురించి రాసిన ఆయన ప్రస్తుతం మన సమాజం ఎదుర్కొంటున్న 21 సవాళ్ల గురించి వస్తున్న వార్తలనూ, సమాచారాన్నీ అమోఘంగా విశ్లేషించారు.



5 ద హెడ్‌స్పేస్ — రచయిత: ఆండీ పెడికోంబె

25 ఏళ్ల వయసులో ఈ పుస్తకం నా చేతిలో పెట్టి ఉంటే కచ్చితంగా నవ్వి ఉండే వాడినే! కానీ ఇప్పుడు నేనూ, మెలిండా ధ్యానం ప్రాశస్త్యాన్ని పూర్తిగా గుర్తించాం. యూనివర్సిటీ విద్యార్థి నుంచి బౌద్ధ సన్యాసిగా మారిన పెడికోంబె ప్రయాణం మాకో కొత్త లోకాన్ని పరిచయం చేసింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

'టెస్కోకు అండగా ప్రభుత్వం'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ చేనేత సహకార సంస్థ (టెస్కో)కు అన్నివిధాల ప్రభుత్వంఅండగా ఉంటుందని టీజీవోల ఛైర్మన్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం టీజీవో భవన్‌లో జరిగిన టెస్కో ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంఘం నేతలు విజయ్‌కుమార్, తిరుపతి, సుధాకర్‌రెడ్డి, శంకరయ్య, టీజీవో అధ్యక్షురాలు మమత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓఎస్డీగా ప్రియాంక కొనసాగింపు

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయంలో ప్రత్యేకాధికారిణిగా ప్రియాంక వర్గీస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె హరితహారం పథకాన్ని పర్యవేక్షిస్తున్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

- ఏప్రిల్ మాసానికి నమోదు అవకాశం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టిక్కెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. ఏప్రిల్ మాసంలో జరిగే స్వామివారి సేవల్లో పాల్గొనేందుకు వీలుగా.. 50 వేల టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తేనుంది. తితిదే వెబ్‌సైట్ www.tirumala.org ద్వారా ఉదయం 10 గంటల నుంచి నమోదు చేసుకోవచ్చు. సుప్రభాతం, తోమాల, అర్చన, విశేషపూజ, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం, కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవా టిక్కెట్లను విడుదల చేయనుంది. వీటిలో ప్రాతఃకాలంలో జరిగే విశేష సేవలను ఎలక్ట్రానిక్ లాటరీ విధానంలో, మిగతావి కరెంటు బుకింగ్ కింద బుక్ చేసుకోవచ్చు.

రేపు డయల్ తితిదే ఈవో

మరోవైపు డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు తిరుమల నుంచి నిర్వహించనున్నట్లు తితిదే బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులు 0877-2263261 నంబర్‌కు డయల్ చేసి ఈవోతో మాట్లాడవచ్చని పేర్కొంది.

16న శ్రీవారికి ఆర్జిత సేవలు రద్దు

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఈ నెల 16న అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. 16న కనుమ పండుగ సందర్భంగా ఏటా పార్వేట ఉత్సవం, గోదాదేవి పరిణయోత్సవం జరపడం ఆనవాయితీ. ఆ రోజున శ్రీమలయప్ప స్వామివారికి, శ్రీకృష్ణస్వామివారికి అంతరాలయంలో, పార్వేట మండపంలో పలు ప్రత్యేక పూజా క్రతువులు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో శ్రీవారికి కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను తితిదే రద్దు చేసింది.



హ్యాపీ న్యూఇయర్ డే బుజ్జాయిలు

- జనవరి ఒకటిన 3 లక్షల 95 వేల శిశువుల జననం
- భారత్‌లోనే దాదాపు 70వేల మంది

ఐరాస: గతేడాది(2018) పరిసమాప్తమై 2019లోకి అడుగిడిన శుభవేళ ప్రపంచవ్యాప్తంగా జన్మించిన 3 లక్షల 95 వేల మంది చిన్నారుల్లో ఒక్క భారత్‌లోనే దాదాపు 70వేల మందిదాకా ఉన్నట్లు 'యూనిసెఫ్' అంచనాలు పేర్కొంటున్నాయి. భారత్‌తో పాటూ చైనా, పాకిస్థాన్, అమెరికా, బంగ్లాదేశ్‌లలో కొత్తఏడాది తొలిరోజున అత్యధికంగా శిశుజననాలు జరిగాయి. 31వ తేదీ రాత్రి 12 గంటలు దాటిన మరుక్షణం సిడ్నీలో దాదాపు 168 మంది, టోక్యోలో 310 మంది, బీజింగ్‌లో 605, మాడ్రిడ్‌లో 166, న్యూయార్క్‌లో 317 మంది నవజాతశిశువులు 'కేర్... కేర్..' మంటూ కొత్తబంగారు లోకంలోకి వచ్చేశారు. సంపూర్ణ ఆరోగ్యదాయకమైన సుదీర్ఘజీవనం ప్రతి నవజాతశిశువు జన్మహక్కనీ...దానిని నూరుశాతం అందరికీ అందించేందుకు ఆయా ప్రభుత్వాలు పాటుపడాలని 'యూనిసెఫ్' పిలుపునిచ్చింది.

పనితీరు, ప్రవర్తనతోనే గుర్తింపు

- ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి
- సీఆర్ ఫౌండేషన్ మహిళా శిక్షణ కేంద్రం విద్యార్థినులకు మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ పిలుపు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: వృత్తి విద్య శిక్షణ పొందిన విద్యార్థినులు ధ్రువపత్రాలు అందుకోవడంతో ఆగిపోకుండా మరికొందరికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజా కిరణ్ ఆకాంక్షించారు. పనితీరు, ప్రవర్తనతోనే మనకు గుర్తింపు వస్తుందన్నారు. బుధవారం కొండాపూర్ ప్రాంతంలోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ మహిళా శిక్షణ కేంద్రంలో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ధ్రువపత్రాలు అందించే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణార్థులంతా కష్టపడి పని చేసి విజయం సాధించాలని కోరారు. సమాజం కోసం పాటుపడిన చంద్ర రాజేశ్వరరావు లాంటి వ్యక్తులు ఆదర్శప్రాయులన్నారు. పాతికేళ్లపాటు కమ్యూనిస్టు పార్టీ ఉన్నత పదవుల్లో కొనసాగడం ఆయన విశ్వసనీయత, శక్తి సామర్థ్యాలకు నిదర్శనమని కొనియాడారు. గతంలో మన దేశంలో వస్తువుల తయారీ ఉండేది కాదని, ఇప్పుడు మనం తయారుచేసిన దుస్తులు అమెరికా వాళ్లు వేసుకునే స్థాయికి ఎదిగామన్నారు. మనిషి వాడే ప్రతి వస్తువు మన దేశంలో తయారుచేసేలా కృషి జరగాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'స్కిల్ ఇండియా- 2022'లో నిధులు కేటాయించి వేలాది మందికి శిక్షణ అందిస్తున్నారని, దీంతో ఎంతోమంది స్వశక్తితో నిలబడుతున్నారని చెప్పారు. శైలజా కిరణ్ తొలుత చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు సేవలను కొనియాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ, కోశాధికారి చెన్నకేశవరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, మహిళా సంక్షేమ కేంద్రం కన్వీనర్ వనశ్రీ, కమిటీ సభ్యులు డాక్టర్ రజని, కోటివిటీ సంస్థ ప్రతినిధి విజయ్, రామస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్. వేదికపై సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ, పల్లా వెంకట్‌రెడ్డి

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన శైలజా కిరణ్

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని శైలజా కిరణ్ సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధాశ్రమం నిర్వహణ పట్ల అభినందనలు తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్ అభివృద్ధిలో రామోజీరావు అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఆయన ప్రోత్సాహం, సహకారంతోనే పలు అంతస్థుల భవనాలు నిర్మించగలిగామని చెప్పారు.

'తిరస్కరణ'ను చెప్పలేదేం?

ప్రభాస్ పిటిషన్‌పై రెవెన్యూకి హైకోర్టు ప్రశ్న

ఈనాడు, హైదరాబాద్: కొనుగోలు చేసిన భూమికి సినీ హీరో ప్రభాస్ చేసుకున్న క్రమబద్ధీకరణ దరఖాస్తును...ఎందుకు తిరస్కరించారో చెప్పలేదేమని రెవెన్యూ అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఆయనకు సమాచారం అందజేయకపోవడానికి కారణం వెల్లడించాలని బుధవారం ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ పన్మక్త గ్రామంలో తాను కొన్న 2087 గజాల స్థలంలో అధికారుల జోక్యాన్ని అడ్డుకోవాలంటూ ప్రభాస్ తరఫున డీవీవీ సత్యనారాయణరాజు పిటిషన్ వేయడం విదితమే. దీనిపై బుధవారం జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పి.కేశవరావులతోకూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభాస్ 'క్రమబద్ధీకరణ' దరఖాస్తును తిరస్కరించారని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. అదే విషయాన్ని పిటిషనర్‌కు లిఖితపూర్వకంగా ఎందుకు అందించలేదని రెవెన్యూశాఖను ప్రశ్నించిన ధర్మాసనం విచారణను గురువారానికి వాయిదావేసింది.

కాలులో కూడబెట్టాడు!

- మృతిచెందిన యాచకుడి కృత్రిమ కాలులో రూ.90 వేలు గుర్తింపు
- హైదరాబాద్‌లో సోదరుడికి సమాచారం ఇచ్చిన బెంగళూరు పోలీసులు

బెంగళూరు, న్యూస్‌టుడే: ఎవరైనా డబ్బులను సాధారణంగా బీరువాలు, పెట్టెలు, బ్యాంకుల్లో దాచుకుంటారు. ఆ బిచ్చగాడు మాత్రం తన కృత్రిమ కాలునే భద్రమైన లాకరుగా మార్చేసుకున్నాడు. ఏకంగా రూ.90 వేలను దాంట్లో దాచుకుని ఔరా అనిపించాడు. బెంగళూరులో ఈ ఘటన వెలుగుచూసింది. బెంగళూరు కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపంలోని పాదచారి మార్గం (ఫుట్‌పాత్)లో షరీఫ్ సాబ్(75) అనే వృద్ధుడు భిక్షాటన చేసుకుంటుండేవాడు. అతను మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాత్రి అతని మృతదేహాన్ని హైగ్రౌండ్స్ ఠాణా పోలీసులు స్వాధీనపరచుకున్నారు. ఈ సందర్భంగా అతని కృత్రిమ కాలును తొలగిస్తుండగా రూ.500, రూ.100, రూ.50, రూ.20 కొత్త కరెన్సీ నోట్లు, కొన్ని నాణేలు అందులో ఉండటాన్ని గుర్తించి అవాక్కయ్యారు. వీటి మొత్తం విలువ రూ.90 వేలని పోలీసులు తెలిపారు. యాచకుడైన షరీఫ్ సాబ్ హైదరాబాద్ నగరవాసి. రెండున్నర దశాబ్దాల కిందట బెంగళూరుకు వచ్చి భిక్షాటన చేసుకుంటున్నాడు. మధుమేహం కారణంగా గాంగ్రెయిన్ బారిన పడి రెండు కాళ్లు కోల్పోయాడు. దాతల సహాయంతో శస్త్రచికిత్స చేయించుకుని కృత్రిమ కాళ్లతో భిక్షాటన చేసేవాడు. మృతుని బంధువులు హైదరాబాద్‌లో ఉన్నట్లు షరీఫ్ సాబ్ వద్ద ఉన్న చీటీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆయన సోదరుడికి సమాచారం ఇచ్చారు.

హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంచండి

తెరాస లోక్‌సభాపక్ష ఉపనేత వినోద్ డిమాండ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంచాలని తెరాస లోక్‌సభాపక్ష ఉపనేత వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. వేలాది కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో ఎంపీ వినోద్‌కుమార్ అనుబంధ ప్రశ్న వేశారు. ఇన్ని కేసులు పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వేర్వేరు హైకోర్టులు ప్రారంభమయ్యాయని తెలిపారు. న్యాయమూర్తుల సంఖ్య పెంపుపై దృష్టి సారిస్తామన్నారు. ఏపీ, తెలంగాణ హైకోర్టులకు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా సబార్డినేట్ కోర్టుల్లో 5 వేల న్యాయాధికారులను భర్తీ చేయాల్సి ఉందని ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. కొన్ని రాష్ట్రాల్లో హైకోర్టుల సూచన మేరకు, మరికొన్ని రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల ద్వారా ఖాళీలు భర్తీ అవుతున్నాయని తెలిపారు. ఆయా ఖాళీలు భర్తీ చేసేలా చూడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కేంద్రం విజ్ఞప్తి చేస్తోందన్నారు. న్యాయాధికారుల ఖాళీల భర్తీకి కోర్టులతో కలిసి పని చేస్తున్నామన్నారు.

'ఆహారశుద్ధి'కి అధిక ప్రాధాన్యం

- ఊరూరా సూక్ష్మ, చిన్న పరిశ్రమలు
- మహిళా సంఘాలతో పాటు రైతు, యువజన సంఘాలకు అవకాశం
- భారీగా ప్రోత్సాహకాలు
- త్వరలో రాష్ట్ర ప్రభుత్వ కొత్త విధానం
- సీఎం ఆదేశాల మేరకు సన్నాహాలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో ఆహారశుద్ధి పరిశ్రమలను పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఈ మేరకు కార్యాచరణ సిద్ధమవుతోంది. భారీస్థాయిలో రాయితీలు ఇచ్చి ఊరూరా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించనున్నారు.

ప్రస్తుతం ఆహారశుద్ధి రంగం పరిశ్రమల శాఖ పరిధిలో ఉంది. రాష్ట్ర పారిశ్రామిక విధానంలో దీనికి చోటుకల్పించి.. పలు ప్రోత్సాహకాలు అమలు చేస్తున్నారు. అయినా, ఇప్పటి వరకు ఈ రంగంలో ఆశించిన ప్రగతి లేదు. పెద్దగా పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. తెరాస ఎన్నికల ప్రణాళిక రూపకల్పన సందర్భంగా సీఎం కేసీఆర్ ఈ రంగంపై అధ్యయనం చేశారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను ముమ్మరం చేసేందుకు ఆహారశుద్ధి పరిశ్రమలు అనువుగా ఉంటాయని ఆయన గుర్తించారు. పార్టీ ఎన్నికల ప్రణాళికలోనూ దీనిని చేర్చారు. ఇటీవల ఆయన ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఈఅంశంపై చర్చించారు. ఈ నేపథ్యంలో ఆహారశుద్ధి రంగాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు వీలుగా ప్రత్యేక విధానం రానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ప్రత్యేక విధాన రూపకల్పన ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. దీని కోసం కమిటీ ఇజ్రాయెల్, జర్మనీ, స్విట్జర్లాండ్ తదితర దేశాలతో పాటు మన దేశంలో ఆహారశుద్ధికి పేరొందిన పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరాఖండ్, గుజరాత్, తమిళనాడు, కేరళ, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలను సందర్శించి ప్రతిపాదనలను తయారు చేస్తుంది. దానికి తుదిరూపు ఇచ్చి సీఎం కేసీఆర్‌కు సమర్పిస్తారు. అనంతరం ఆయన నూతన విధానాన్ని ఖరారు చేస్తారు. ఏప్రిల్ నుంచి కొత్త విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

80 శాతం వరకు రాయితీలు

కొత్త విధానం కింద భారీఎత్తున రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు పరిశ్రమల శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఆహారశుద్ధి పరిశ్రమలను మొదటగా మహిళా సంఘాల ద్వారా స్థాపించాలని భావిస్తున్నారు. ఆ తర్వాత రైతు, యువజన సంఘాలకు కూడా చోటుకల్పించే వీలుంది. పరిశ్రమల స్థాపనకు 80 శాతం వరకు రాయితీ(సబ్సిడీ) ఇవ్వాలని ప్రతిపాదన కూడా చేయనున్నారు. పెట్టుబడిసాయంతోపాటు యంత్రాల కొనుగోలు వంటి వాటికి దీన్ని అందిస్తారు. రవాణా, ఎగుమతులకు సైతం భారీగా ప్రోత్సాహకాలు ఇవ్వాలనే ఆలోచన ఉంది. ప్రతిగ్రామంలో సూక్ష్మ ఆహారశుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు, మహిళలకు శిక్షణ కల్పించాలనే ప్రతిపాదన కూడా చేయనున్నారు.

దశలవారీగా మండలి అభ్యర్థుల ఖరారు

- తెరాస అధినేత కేసీఆర్ యోచన
- తొలుత పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎంపిక
- ఒకటి, రెండు రోజుల్లో వారిని ఖరారు చేయనున్న సీఎం

ఈనాడు - హైదరాబాద్

శాసనమండలి ఎన్నికల కోసం పార్టీ తరఫున అభ్యర్థులను తెరాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ దశలవారీగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. మార్చిలో మొత్తం 16 స్థానాలు ఖాళీ అయ్యే అవకాశముంది. వీటిలో తొలుత ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో వారి పేర్లను ప్రకటించే వీలుంది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గాల తరఫున ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్న శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి పదవీ కాలం వచ్చే మార్చితో ముగియనుంది. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు మార్చిలో ఎన్నికలు నిర్వహిస్తారు. వీటి కోసం ఓటర్ల ముసాయిదా జాబితా మంగళవారం విడుదలయింది. ఈ క్రమంలోనే ఈ మూడు స్థానాలకు వెంటనే అభ్యర్థులను ప్రకటించాలని పార్టీ నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ గురువారంగానీ, శుక్రవారంగానీ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలు తెరాస అధీనంలోనే ఉన్నాయి. స్వామిగౌడ్ తెరాస అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించగా, పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్‌లు వేర్వేరు సంఘాల నుంచి గెలిచి అనంతరం తెరాసలో చేరారు. ఇవి కాకుండా శాసనమండలిలో మార్చిలో ఖాళీ అయ్యే అవకాశమున్న మరో 13 మండలి స్థానాలకు వెంటనే ఎన్నికలు జరుగుతాయి. ఈ స్థానాలకు సంబంధించి అభ్యర్థులను మలి దశలో ఎంపిక చేసే వీలుంది.

స్వామిగౌడ్ కోరితే మళ్లీ అదే స్థానం నుంచి టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. ఆయన అభ్యర్థిత్వంపై వేర్వేరు ప్రతిపాదనలు వస్తున్నట్లు తెలిసింది. పట్టభద్రుల నియోజకవర్గం కాకుండా శాసనసభ అభ్యర్థుల కోటా కింద ఎంపిక చేస్తారనే ఆలోచన ఉంది. ఎమ్మెల్సీ వద్దనుకుంటే చేవెళ్ల లేదా మరో నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారమూ జరుగుతోంది. స్వామిగౌడ్ ఇక్కడి నుంచి పోటీ చేయని పక్షంలో ఈ స్థానం తమకు కావాలంటూ చాలా మంది ఆశావహులు కోరుతున్నారు. వారిలో మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, తెలంగాణ గ్రూపు-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్‌లతోపాటు బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్ ఉన్నారు. వీరిలో ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. పాతూరి సుధాకర్‌రెడ్డి మరోసారి పాత నియోజకవర్గం నుంచే పోటీ చేయాలనుకుంటున్నారు. ఇప్పటికే ఆయన పార్టీ అధిష్ఠానాన్ని కలిసి తన మనోభావాలను వెల్లడించారు. ఈ నియోజకవర్గం నుంచి పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర (పీఆర్‌టీయూటీఎస్) అభ్యర్థి పోటీలో ఉన్నారు. ఆయన కూడా తెరాస మద్దతు సమీకరించే యత్నాల్లో ఉన్నారు. దీంతో తెరాసకు ఇక్కడ అభ్యర్థి ఎంపిక కొంత క్లిష్టంగా మారింది. పాతూరి వైపే కేసీఆర్ మొగ్గు చూపే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా పూల రవీందర్ మళ్లీ పీఆర్‌టీయూటీఎస్ తరఫున బరిలోకి దిగారు. ఆయన తెరాసలోనే ఉన్నందున మళ్లీ పార్టీ అధిష్ఠానం మద్దతు తెలిపే అవకాశం ఉందని, పార్టీ అభ్యర్థిగా ఆయననే సీఎం ప్రకటించే వీలుందని తెలుస్తోంది.



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించండి

సీఎంకు టీఎస్‌టీయూ విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 75కు మించితే తరగతికి ఒకరు చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం (టీఎస్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కరీంనగర్‌లో బుధవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల విద్యుత్తు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని, మిషన్ భగీరథ నీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలకు నోటు పుస్తకాలు, బూట్లు, టై, బెల్టు సహా క్రీడా దుస్తులు అందించాలని, కేజీబీవీల్లో అమలు చేస్తున్న భోజన మెనూను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించాలని కోరారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందించాలి

రాష్ట్రవ్యాప్తంగా 4,800 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 2 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం చిరుతిళ్లు అందించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌ను తెలంగాణ తల్లిదండ్రుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగటి నారాయణ, కార్యదర్శి పగడాల లక్ష్మయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున ఆకలితో బాధపడుతున్నారని, చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారని తెలిపారు. పాఠశాలలకు నిధులు మంజూరు చేసి అల్పాహారం, చిరుతిళ్లను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నుంచి అశోక్ బహిష్కరణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ టీపీసీసీ కార్యదర్శి నల్లవెల్లి అశోక్‌ను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా ఆయన వ్యవహరించడంతో... ఈ చర్య తీసుకున్నామని బుధవారం క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు.

హడావుడిగా పంచాయతీ ఎన్నికల ప్రకటన: ఆర్.కృష్ణయ్య

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా ఆర్డినెన్స్ జారీ చేయడమే కాకుండా, హైకోర్టులో కేసు నడుస్తున్న సమయంలో హడావుడిగా ప్రకటన ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఇది మాయని మచ్చగా మిగిలి పోతుందన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన 12 బీసీ సంఘాలు, 2 బీసీ ఉద్యోగ సంఘాల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల వాటా కోసం ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని తీర్మానించారు. అనంతరం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్, బీసీ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు నీరడి భూపేశ్‌సాగర్, అనంతయ్య తదితరులతో కలిసి కృష్ణయ్య మాట్లాడారు. గతంలో రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం లేకుండా హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్డినెన్స్ జారీ చేసి ఎన్నికల ప్రక్రియకు పూనుకుంటే న్యాయస్థానాలు కొట్టి వేశాయనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించవద్దన్నారు. ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకుని, బీసీల రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా, న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

తెరాసలో చేరతాననడం అవాస్తవం: అజారుద్దీన్

ఈనాడు, హైదరాబాద్: తెరాసలో తాను చేరనున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజారుద్దీన్ ప్రకటించారు. పత్రికల కథనాల నేపథ్యంలో బుధవారం ఆయన ట్విటర్ ద్వారా స్పందిస్తూ 'అవన్నీ తప్పు' అని పేర్కొన్నారు.



మధ్య వేలుపై సిరా గుర్తు

- చూపుడు వేలుమీద కాదు...
- పంచాయతీ ఎన్నికల్లో మార్పు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో ఓటరుకు సిరా గుర్తును చూపుడు వేలుకు బదులు మధ్య వేలుపై వేస్తారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున చూపుడు వేలుపై ఉన్న గుర్తు ఇంకా చెరగకపోవడంతో, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. పోలింగ్ కేంద్రానికి ఓటరు వెళ్లినప్పుడు... ఎడమ చేతి చూపుడు వేలుపై 'త్వరగా చెరగని సిరా'తో నిలువుగా చిన్న గీతను గీయటం ఎప్పుడూ ఉండే ప్రక్రియ. అదే ఓటరు మరోసారి ఓటు హక్కును వినియోగించుకోకుండా చేయడమే దీని లక్ష్యం. డిసెంబరు 7వ తేదీన అసెంబ్లీ ఎన్నికల్లో వేసిన సిరా గుర్తులు ఇంకా చెరగలేదు. పంచాయతీ పోలింగ్‌ను జనవరి 21, 25, 30 తేదీల్లో చేపడుతుండటంతో ఆ గుర్తులు చెరుగుతాయో లేదో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. అందుకే ఎన్నికల సంఘం తాజా ఆదేశాలిచ్చింది. ఇంతకుముందు ఇచ్చిన మార్గదర్శకాల్లో ఆ మేరకు మార్పులు చేసింది. సిరా గుర్తులు వేసేందుకు 1,55,000 సిరా బుడ్డీలను సిద్ధం చేశారు. 1.13 లక్షల పోలింగ్ కేంద్రాల్లో వీటిని వినియోగిస్తారు.

దత్తత ఇచ్చినా.. పోటీకి అనర్హతే

- ముగ్గురు సంతానముంటే పోటీకి అనర్హులు
- 31 మే, 1995 వరకు ముగ్గురున్నా అర్హులే
- పంచాయతీ ఎన్నికల్లో పోటీ విషయంలో..

ఈనాడు - సంగారెడ్డి

పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. రిజర్వేషన్లు కేటాయించడం, వెనువెంటనే ప్రకటన వెలువడటంతో పల్లెల్లో ఎక్కడ చూసినా ఎవరు పోటీలో నిలవనున్నారనే చర్చలే వినిపిస్తున్నాయి. మిగతా అన్ని నిబంధనలతో పోల్చితే ముగ్గురు సంతానముంటే బరిలో నిలిచే అవకాశం ఉంటుందా? ఏ ఏడాది లోపు ముగ్గురు సంతానమున్నా పోటీ చేయవచ్చు? రెండు కాన్పుల్లో రెండుసార్లూ కవలలే పుడితే పరిస్థితి ఏమిటి? ఒకసారి ఒకరు, మరోసారి కవలలు పుడితే ఏం చేయాలి.... ఇలాంటి అంశాలను తెలుసుకునేందుకు ఆశావహులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి తొలివిడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్న క్రమంలో ఆ నిబంధనలను ఒకసారి తెలుసుకుందాం.

- ★ సర్పంచి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వారికి ముగ్గురు సంతానం ఉండి అందులో ఒకరిని దత్తతకు ఇచ్చినా వారు పోటీకి అనర్హులేనంటూ 2006లో హైకోర్టు స్పష్టం చేసింది. దత్తతకు ఇచ్చినప్పటికీ వారి పిల్లలుగానే పరిగణిస్తారు.
- ★ ఒక వ్యక్తికి మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలు ఉండి ఆమె చనిపోతే రెండో భార్య ద్వారా ఒక సంతానం కలిగితే... అతడు పోటీ చేయడానికి అనర్హుడు. రెండో భార్యగా వచ్చిన మహిళ మాత్రం పోటీకి అర్హురాలు.
- ★ ఒక వ్యక్తికి ముగ్గురు పిల్లలు ఉండి, వారిలో ఎవరైనా మృతి చెందితే... పోటీ చేయడానికి అర్హులే. నామినేషన్ల పరిశీలన రోజు ఎంత మంది పిల్లలు ఉన్నారనే విషయాన్నే పరిగణనలోకి తీసుకుంటారు.
- ★ ఒక మహిళకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండి నామినేషన్ల పరిశీలన సమయానికి గర్భవతి అయినా పోటీకి ఆమె అర్హురాలే.

ఇదీ లెక్క...

ఒక వ్యక్తికి ముగ్గురు సంతానం ఉన్నంత మాత్రాన వారు పోటీకి అనర్హులు కారు. ఇందు కోసం 31.05.1995, 1.06.1995 తేదీలు చాలా కీలకమైనవి. ఈ కింది పట్టికను పరిశీలిస్తే ఎవరు అర్హులో, ఎవరు అనర్హులో స్పష్టమవుతుంది.

పుట్టిన పిల్లల సంఖ్య		మొత్తము	అర్హులా/ అనర్హులా
31.05.1995 కంటే ముందు	01.06.1995 నుంచి		
3	నిల్	3	అర్హులు
3	1	4	అనర్హులు
2 (వేరు వేరు కాన్పులలో)	1	3	అనర్హులు
2(కవలలు)	1	3	అనర్హులు
1	2(కవలలు)	3	అర్హులు
1	2 (వేర్వేరు కాన్పులలో)	3	అనర్హులు
నిల్	2	2	అర్హులు
నిల్	1+2(కవలలు)	3	అర్హులు
నిల్	ముగ్గురు (ఒకే కాన్పులో)	3	అర్హులు
నిల్	ముగ్గురు (వేర్వేరు కాన్పులలో)	3	అనర్హులు

తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలి

- దీనికి ప్రత్యేక దరఖాస్తు ఉండాలి
- హైకోర్టులో పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా, అభ్యంతరాలు స్వీకరించకుండా, అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాల్సి ఉందని, దీనికి అవసరమైన దరఖాస్తును అందుబాటులో ఉంచేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ... హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తొలగింపునకు గురైన ఓటరు తిరిగి నమోదు చేసుకోవాలంటే, కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోందని,. అలాకాకుండా ప్రత్యేకంగా ఓ ఫారం రూపొందించాలని లేదా ఉన్నదాన్ని సవరించాలని కోరుతూ గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ప్రీతి అగర్వాల్, మరో 25మంది పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తమ పేర్లను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అభ్యంతరాలు వినకుండా తొలగించారన్నారు. ప్రభుత్వ గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చనే నమ్మకంతో వెళితే, జాబితాలో తమ పేరు కనిపించలేదన్నారు. పేర్లను తొలగించినట్లు ఈసీ కనీసం సమాచారమైనా ఇవ్వలేదని తెలిపారు. అందుకే గోషామహల్‌లో తిరిగి ఎన్నిక నిర్వహించేలా ఆదేశించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ఎన్నికల సంఘం చర్య వల్ల వినియోగించుకోలేకపోయామన్నారు. పరిహారం ఇప్పించాలని కోరారు. ఓటరు జాబితాలో తొలగించిన పేర్లను పునరుద్ధరించడానికి కొత్త దరఖాస్తు ప్రవేశపెట్టేలా ఆదేశాలు జారీచేయాలన్నారు. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ, విచారణను ధర్మాసనం 22వ తేదీకి వాయిదావేసింది.

కోరిన వారికి ఓటర్ల జాబితాలు

- నవంబరు 19 వరకు సవరణ
- మొత్తం గ్రామ పంచాయతీ ఓటర్లు సుమారు కోటి యాభై లక్షలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కోరిన వారికి గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలు అందనున్నాయి. రిజర్వుడు ఎన్నికల గుర్తు గల రాజకీయ పార్టీలకు వీటిని ఉచితంగాను, మిగతా వారికి ఆయా కాపీలకు అయ్యే ఖర్చును తీసుకొని జాబితాలను అధికారులు అందజేస్తారు. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలు అసెంబ్లీ ఓటర్ల జాబితాల ప్రకారమే తయారవుతాయి. ఇంతకు ముందు పంచాయతీ ఎన్నికలను 2018, జులై నెలలో నిర్వహించాలని భావించినప్పుడు.. 2018, మే17వ తేదీ నాటికి ఉన్న అసెంబ్లీ ఓటర్ల జాబితాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం పంచాయతీ ఓటర్ల జాబితాలను తయారు చేసింది. వాటిని రాజకీయ పార్టీలకు, ఇతరులకు అందజేసింది. అప్పట్లో ఎన్నికలు వాయిదా పడటంతో పంచాయతీ ఓటర్ల జాబితాలను మళ్లీ తయారు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ సారి 2018, నవంబరు19 నాటికి గల అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం అనుసరించింది. సవరణలతో కూడిన తాజా జాబితాలను ఇప్పుడు కోరినవారికి ఇవ్వనున్నట్లు ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. మే నెలలో తయారు చేసిన ఓటర్ల జాబితాలతో తాజా జాబితాలను పోల్చితే జరిగిన మార్పులు ఇలా ఉన్నాయి.

- ★ మే 17నాటికి మొత్తం గ్రామీణ ఓటర్లు **1,37,17,469**
- ★ ఆ తర్వాత చేరికలు **16,86,682**
- ★ డీపీవోలు తొలగించిన ఓటర్ల సంఖ్య **4,52,093**
- ★ ప్రస్తుత మొత్తం ఓటర్లు **1,49,52,058**

పంచాయతీల్లోనూ పట్టు సాధిద్దాం

- మన మద్దతుదారులే గెలవాలి
- ఎన్నికలపై తెరాస వ్యూహం

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పట్టు సాధించాలని తెలంగాణ రాష్ట్ర సమితి భావిస్తోంది. తెరాస మద్దతుదారులే గెలిచేలా వ్యూహరచన చేస్తోంది. పార్టీ శాసనసభ్యులు ఇతర నేతలకు ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే పంచాయతీ ఎన్నికలపై సన్నద్ధం కావాలని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేటీఆర్.. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి పంచాయతీ స్థాయి నుంచే సత్తా చాటాలని మార్గనిర్దేశం చేశారు. పంచాయతీ స్థాయి నుంచే పార్టీ బలోపేతం కావాలనేది అధిష్ఠానం వ్యూహంగా ఉంది. కేటీఆర్ ఇప్పటికే రెండు దఫాలు పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, కార్యాచరణను రూపొందించినట్లు తెలిసింది.

ఎమ్మెల్యేలకు...

పంచాయతీల్లో అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను పార్టీ అధిష్ఠానం శాసనసభ్యులకు అప్పగించింది. పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట నియోజకవర్గ ఇన్‌ఛార్జులు చొరవ తీసుకోవాలని పేర్కొంది. తమ నియోజకవర్గంలోని గ్రామాల్లో గెలిచే సత్తా గల పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని నిర్దేశించినట్లు సమాచారం. పార్టీలో ఒక్కరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉండే అవకాశం ఉన్నందున వారితో సమన్వయం చేసుకుంటూ అందరికీ ఆమోదయోగ్యంగా ఎంపిక జరపాలని సూచించింది. తమకు అనుకూలమా? ప్రతికూలమా అంటూ వర్గాలు చూడకుండా, సమర్థులనే ఎంపిక చేయాలని స్పష్టంచేసినట్లు తెలిసింది. ఎంపికలో బూత్‌కమిటీల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

ఏకగ్రీవాలకు ప్రోత్సాహం

పంచాయతీల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలని అధిష్ఠానం పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు చిన్న పంచాయతీలు, తండాలలో సైతం పార్టీ మద్దతుదారుల విజయానికి పట్టుదలగా పనిచేయాలని నిర్దేశించింది. విభేదాలు, ఇతర సమస్యలతో ఎక్కడా స్థానాలను కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసినట్లు సమాచారం. పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో వ్యవహరించేలా చూడాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దని పేర్కొన్నట్లు సమాచారం.

అధిష్ఠానం పర్యవేక్షణ

పంచాయతీ ఎన్నికలను పార్టీ అధిష్ఠానం పర్యవేక్షించనుంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో దీనిపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి జిల్లాల వారిగా పరిస్థితులను రోజూ సమీక్షిస్తారు.



హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాసగౌడ్. చిత్రంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, యువ విభాగం రాష్ట్ర నాయకులు శివగౌడ్ వరకాల, వరికుప్పల మధు, రంజిత్‌కుమార్, బి.రాజు, విష్ణుకాంత్‌గౌడ్, గణేష్, సాకేత్

సీఎం బీసీల గొంతు కోశారు

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

నారాయణగూడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ రిజర్వేషన్లను తగ్గించి బీసీల గొంతు కోశారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బీసీ రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. బీసీలను రాజకీయంగా అణచివేసిన సీఎంగా కేసీఆర్ చరిత్రలో నిలిచి పోతారని విమర్శించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉండి ఉంటే సెలవు రోజున (జనవరి 1న) పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపించడం మానేసి న్యాయ పోరాటం చేయాల్సిన ప్రభుత్వం బాధ్యతల్ని మరిచిందన్నారు. హైకోర్టులో రిజర్వేషన్లపై విచారణ జరుగుతుండగా నోటిఫికేషన్ ఇచ్చి బీసీలను దగా చేశారని విమర్శించారు. 34శాతం రిజర్వేషన్లు యథాతథంగా అమలు జరిగేవరకు వీధి, న్యాయ పోరాటం ఆగదని చెప్పారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, యువ విభాగం రాష్ట్ర నాయకులు శివగౌడ్ వరకాల, వరికుప్పల మధు, రంజిత్‌కుమార్, బి.రాజు, విష్ణుకాంత్ గౌడ్, గణేష్, సాకేత్‌లు ఉన్నారు.

నాలుగు వేళ్లూ మీ వైఫల్యాలవైపే


ప్రధానిని నిలదీసిన మాజీ ప్రధాని దేవేగౌడ

ఈనాడు డిజిటల్, బెంగళూరు: రైతుల రుణమాఫీపై మీ (ప్రధాని) చూపుడు వేలుతో మమ్మల్ని చూపితే, మిగిలిన నాలుగు వేళ్లు మీ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నాయని మాజీ ప్రధాని దేవేగౌడ అన్నారు. కర్ణాటకలో రుణమాఫీ అంశం 'క్రూరమైన జోక్', కాంగ్రెస్ రైతుల కోసం ఓ లాలీ పాప్ కర్మాగారాన్నే స్థాపించిందని ప్రధాని రెండు రోజుల క్రితం ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై దేవేగౌడ బుధవారం ట్విటర్ ద్వారా ప్రధానమంత్రిని తూర్పారబట్టారు. సమస్యలు పరిష్కరించాలంటూ దిల్లీకి వచ్చిన రైతులను తరిమేశారని గుర్తు చేశారు. తాము ఇచ్చిన మాట ప్రకారం 60 వేల రైతుల ఖాతాలకు రుణ మాఫీ మొత్తాన్ని బదిలీ చేశామన్నారు. అందరి రుణాలు మాఫీ చేయాలన్న దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. 'నల్లధనం, పెద్దనోట్ల రద్దు, గంగానది ప్రక్షాళన, నదుల అనుసంధానం, రామమందిర నిర్మాణం వంటి అంశాల్లో మీ వైఫల్యాలను మిగిలిన నాలుగు వేళ్లు చూపుతున్నాయంటూ' చురక అంటించారు.

ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలి

కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్‌కు ఏపీ, టీఎమ్మార్పీఎస్ వినతి

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ నేతలు దండు వీరయ్య మాదిగ, ఇటుకరాజు మాదిగ, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు బుధవారమిక్కడ వినతి పత్రం అందజేశారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మార్పీఎస్ నేతలు మీడియాకు తెలిపారు.



ఈ పుస్తకం ఎలా ఉందంటే చెప్పగలం...
కంప్యూటర్ ఎలా ఉంటుందంటే చూపగలం...
ఆ భవనం ఇలా ఉంటుందనీ వివరించగలం..
మరి రేపు... ఎలా ఉంటుంది?
గత ఏడాది ఏమై పోయింది?
ఈ రోజు ఎక్కడ కలిసి పోతుంది?

ఈ ప్రశ్నలకు సమాధానం ఎవరూ చెప్పలేదు. ఎక్కడా వివరించలేదు. ఎందుకంటే అదొక్కటే అనంత శక్తి సంపన్నం కాబట్టి ఆ కాలానికంటే ముందు పరుగెత్తుకెళ్లి అదెక్కడికెళుతుందో తెలుసుకోవడం మాత్రం సాధ్యంకావడం లేదు. అదో అనంత వాహిని. ఎక్కడ పుట్టిందో, ఎప్పుడు పుట్టిందో అంతుచిక్కని ఓ మహాప్రవాహమది. కాలం ఎటెళ్లిపోతుంది, మళ్లీ తిరిగి రాదెందుకు? అని ప్రశ్న వేసుకుంటే దానికి సమాధానంగా అది స్వయంభువు (స్వయంగా ఉద్భవించిన) అయిన పరమాత్మ అని మాత్రం వేదాల్లో కనిపిస్తుంది. స్వయంభువు కాబట్టి దాని పుట్టుకను ఎవరూ చూడలేదు.

మరో కొత్త సంవత్సరంలోకి మనం పాదం మోపాం. అసలీ కాల స్వరూపాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే ప్రతి క్షణమూ మనకో బహుమానమే...

> కాలం ఒక నిండుకుండ. అదెప్పుడూ తొణకదు. నీళ్లు నిండా ఉన్న కుండలోకి ఏదైనా పాత్రను ముంచితే లోపలి నీళ్లు బయట పడుతుంటాయి. అలాంటి సందర్భాల్లో కుండ లోపల, బయట ఎలాగైతే నీళ్లుంటాయో, కాలం కూడా సర్వత్రా వ్యాపించి ఉంటుందని అంటోంది అథర్వణ వేదం.

తెలుసుకున్నారా... కాల గమనం!


విశ్వంలో మహత్తరమైంది ఏదంటే అది కాలమే. సంస్కృత సంప్రదాయాన్ని అనుసరించి చూస్తే కాలం అనే పదం పురుషుణ్ణి, కాలి అనే పదం స్త్రీని సూచిస్తుంది. వీరు ఎవరై ఉంటారనే ప్రశ్నకూ వేదమే సమాధానమిచ్చింది. జగత్తుకంతటికీ తల్లిదండ్రులుగా ఉన్న పార్వతీపరమేశ్వరులే కాలి, కాలాలు. కాలం భోళా శంకరుడి స్వరూపం. ఏది కోరుకుంటే అదిస్తుంది. అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏం కావాలంటే అది మనం పొందొచ్చని అర్థం.

కానీ దాని విలువ తెలుసుకోకుండా బద్ధకంగా కూర్చుంటే అది మనకోసం ఆగదు. సృష్టిలో మనలాంటి వాళ్లు కోకొల్లలు. వాళ్లందరినీ అనుగ్రహించాలి కాబట్టి మనకోసం ఆగకుండా ముందుకెళ్లిపోతుంది. ఈ ఒక్క విషయాన్ని తెలుసుకొని ఇప్పటి ఈ కాలాన్ని, ఈ క్షణాన్ని మనదే అనుకుని సద్వినియోగం చేసుకుంటేనే జీవితం తరిస్తుంది.

కాలం విలువను గురించిన విషయాలను కాల స్వరూప తత్త్వాలను అథర్వణ, యజుర్వేదాలు స్పష్టంగా వివరిస్తున్నాయి.

కాలం ఓ నదిలాంటిది. నది ముందుకు ప్రవహిస్తుందేగాని, ఆగి వెనక్కు రమ్మంటే అది రానేరాదు. ఇది నిత్య సత్యం. ఈ విషయాన్ని యజుర్వేద, అరుణ మంత్రాల్లోని 'నదీవప్రభవాత్కాచిత్ అక్షయ్యాత్స్యందతే యథా... ' మంత్రం ఇలా వివరిస్తుంది. 'ప్రవహించే ఓ నదిలో అంతకు ముందు ఎన్ని సెలయేళ్లు, చిన్న వాగులు, వంకలు కలిసి ఉంటాయి. అదే తీరులో కాలానికి సంబంధించిన కల, కాష్ఠ, తృటి, క్షణ, ముహూర్త లాంటివి దిన, పక్ష, మాస, అయనాల్లాంటివి ఎన్నెన్నో మిళితమై ఉంటాయి. ఆ సమ్మిళిత కాలాన్నే ఒక సంవత్సర కాలంగా చెబుతామంటారు.

కాలం అత్యంత చైతన్యవంతమైంది. పంచభూతాల చేతనత్వమంతా దాని అదుపులోనే ఉంటుంది. పంచ భూతాలు ఒక్కటి మాత్రమే కాదు, సర్వసృష్టి, దేవతలు, యజ్ఞయాగాదుల్లాంటి శుభకార్యాలు... ఒకటేమిటి.. ఎన్నో ఎన్నెన్నో అన్నీ ఆ పరమేశ్వర రూపమైన కాలం చెప్పినట్లు, అది చేసినట్లు ప్రవర్తిస్తూ ఉంటాయి.



పోపు తగలగానే వంటకు రుచి పెరిగినట్లు మార్పు కారణంగా బతుక్కి రుచి పెరుగుతుంది. ఆశలొక్కటే కాదు మనిషికి ఆశయాలూ ముఖ్యమే. ఆశలు, ఆశయాలుగా మారితే మనిషి విజేత అవుతాడు. దానికి కావాల్సింది ఒక అద్భుతమైన ఆలోచన. ఒక చక్కటి నిర్ణయం... దేనికైనా ఇదే మంచి సందర్భం. లేవండి... సంకల్పించుకోండి.

నాకు సమయం సరిపోదు, సమయం చాలదు, ఆ సమయానికి నేను అందుకోలేను... ఇలాంటి మాటలు మనం తరచూ వింటుంటాం. ఇలాంటి మాటలు అనడం వెనక కాస్తంత సోమరితనం, బద్ధకం అనే వాటితో పాటు సమయం లేదా కాలంపై అవగాహన లేకపోవడం కూడా కారణంగా కనిపిస్తుంది. అందుబాటులో ఉన్న సమయంలో బద్ధకాన్ని విడిచి లోభమోహాలను పక్కనబెట్టి చేయాల్సింది చేస్తే జీవితం తరిస్తుంది. మన పురాణాలు, ఇతిహాసాల్లో ఇలా చేసి జీవితాన్ని తక్కువ సమయంలో తరింపజేసుకున్న మహాత్ములెందరో ఉన్నారు.

పూర్వం ఖట్వాంగుడనే మహారాజు ఉండేవాడు. ఆ రోజుల్లో దేవతలకు రాక్షసుల వల్ల ఇబ్బంది కలుగుతుండేది. యుద్ధం అనివార్యమైంది. అప్పుడు ఖట్వాంగుడు దేవతల పక్షాన నిలిచి పోరాడాడు. దేవతలకు విజయాన్ని చేకూర్చిపెట్టాడు. అప్పుడు దేవతలు ఆ రాజు దగ్గరకొచ్చి ఏ వరం కావాలో కోరుకోమన్నారు కృతజ్ఞతగా...అప్పుడు రాజు నా జీవితకాలం ఇంకా ఎంతుందో చెప్పండి అని అడిగాడు. చూస్తే ఒకే ఒక్క ముహూర్త కాలం ఉంది. ఆ విషయం విన్న ఆ రాజు ఏ మాత్రం బాధకు, దిగులుకు లోను కాలేదు. ఇంకా ఇంకా ఆయుష్షు కావాలని అడగనూ లేదు. క్షణం కూడా వృథా చేయకుండా ఓ ప్రశాంత ప్రదేశానికి వెళ్లి శ్రీమహావిష్ణువును గురించి తపస్సు చేసి మోక్షాన్ని పొందాడు. ఇలాంటి విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని అందరికీ తెలిసిన మరో రాజు కూడా తనకున్న తక్కువ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఈ రాజు పేరే పరీక్షిత్తు. తన జీవితం ముగియడానికి కేవలం వారం రోజులు మాత్రమే ఉందని తెలుసుకున్న పరీక్షిత్తు శోకించడం, మోహభ్రాంతులకు గురికావడం ఏమీ చేయలేదు. తనకు పునరావృత్తిరహితమైన మోక్ష స్థితి కలగడానికి ఒకే ఒక్క సాధనం మహాభాగవత శ్రవణం అని తెలుసుకున్నాడు. ఆ వారం రోజుల్లో శుక మహర్షి చేత మహాభాగవతం చెప్పించుకుని విని జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు.

ఇంతటి మహత్తరం, మహిమాన్వితం అయింది కాబట్టే కాలాన్ని మనం భక్తితో సద్వినియోగం చేసుకోవాలి.

- యల్లాప్రగడ మల్లికార్జునరావు

> **కాలగతిలో మరో చిత్రమైన విషయం ఏంటంటే కొత్త విషయాలపై మోజు బలపడుతుంది. పాతవాటితో అనుబంధం పూర్తిగా తెగిపోదు. ఈ పాత కొత్తల మేలు కలయికే జీవితం. మనం పాత, కొత్తల మధ్య పరిమళభరితమైన ఓ వంతెనను నిర్మించుకోవాలి. పాత అనుభవాల పునాదులపై కొత్త ఆశలు, ఆశయాల సౌధాలను నిర్మించుకోవాలి.**

బోధివృక్షం

ఏది పవిత్రత?

పండిట్ హర్‌దయాళ్ ఆధ్వర్యంలో ఉపనయన కార్యక్రమానికి అంతా సిద్ధమైంది.

పదమూడేళ్ల నానక్‌ని వచ్చి పీట మీద కూర్చోమన్నారు. జరుగుతున్న తతంగం అంతా చూస్తున్న నానక్ మనసులో

అనేక ప్రశ్నలు మెదులుతున్నాయి. ఏవిషయాన్నైనా సంకోచం లేకుండా అడగడం నానక్ స్వభావం.

'పండిట్ జీ! ఈ ఏర్పాట్లన్నీ దేనికోసం చేస్తున్నారు?'

పండిట్ హరదయాళ్ మందహాసం చేస్తూ ' ఈరోజు నీకు ఉపనయనం జరుగుతోంది. దీన్నే రెండో జన్మ అంటారు. అన్నారు

'ఒక జన్మలో ఉండగానే రెండో జన్మ ఎలా సాధ్యం?'

ఈ జన్మ శరీరానికి సంబంధించింది కాదు. సంస్కారానికి సంబంధించింది. నువ్వు క్షత్రియుడివి. కాబట్టి ఉపనయనం చేసుకోవాలి' చెప్పాడు పండిట్ జీ.

నానక్ ఈ సమాధానంతో తృప్తి చెందలేదు.

'ఈ దారపు పోగు ఏంటి?'

'దీనిని యజ్ఞోపవీతం లేదా జంధ్యం అంటారు. మంత్రపూరితంగా దీనిని నీకు ధరింపజేస్తాను. ఆ క్షణం నుంచి నువ్వు పవిత్రుడివవుతావు...'

'కేవలం జంధ్యం ధరించినంత మాత్రాన ఎవరైనా పవిత్రులవుతారా?'



ఇంకా నానక్ అంటున్నాడు - **పండిట్ జీ! మనల్ని పవిత్రుల్ని చేసేది మన చర్యలు కావా?ఈ జంధ్యం వేసుకున్నంత మాత్రాన ఎవరూ పవిత్రులు కారని నావిశ్వాసం. కాబట్టి నేను జంధ్యాన్ని ధరించను'**

ఉపనయనానికి వచ్చిన బంధువర్గమంతా ఆశ్చర్యపోయారు. నానక్ తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు.

పండిట్ జీకి నిలువెల్లా కోపం వచ్చేసింది.

'కాలూజీ! నేను వెళ్తున్నాను' అంటూ పాదుకలు ధరించి వెళ్లిపోయారు. అవమానంతో, కోపంతో నానక్‌ని దండించబోతున్న తండ్రి మెహతా కాలూని మిత్రుడు రాయ్ బులార్ శాంతింపజేశాడు.

'మిత్రమా! నానక్ జాతకం గురించి దైవజ్ఞులు ఏం చెప్పారో గుర్తుచేసుకో. నానక్ భవిష్యత్తులో చాలా గొప్పవాడవుతాడన్నారు కదా?'

'అవును' అన్నాడు మెహతా కాలూ గుర్తు చేసుకుంటూ.

'గొప్పవాళ్ల మాటలు, చర్యలు ఇలాగే ఉంటాయి. అబ్బాయిని తన మార్గాన్ని వెదుక్కోనీ. స్వేచ్ఛలోనే జ్ఞానం వికసిస్తుంది. నానక్ చెప్పిన మాటలు నిజమే. పవిత్రత జంధ్యంలో లేదు. మన నడవడిలో ఉంది. జంధ్యం ధరించని వాళ్లు అపవిత్రులు కారు కదా! వాళ్లలో ఎందరో మహాత్ములు ఉన్నారు. నానక్‌ను ఇబ్బంది పెట్టకు'

పదమూడేళ్ల చిన్న వయస్సులోనే నానక్ ఆధ్యాత్మిక జీవితం ఆరంభమైంది. తరువాత కాలంలో ఆయన శిఖ్ఖు మత స్థాపకుడిగా విశ్వవిఖ్యాతి పొందారు.

-కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ఇస్లాం సందేశం

అదే పూలబాట!


ధార్మిక విద్యలో ఎంతో పేరుగడించిన ఇమామ్ అబూ హనీఫా పగలంతా విద్యాబోధనలో లీనమైనప్పటికీ రాత్రుళ్లు ఖురాన్ పారాయణం, దైవారాధనలో గడిపేవారు. ఆయన పొరుగింట్లో ఉన్న వ్యక్తి రోజూ మద్యం తాగి రాత్రంతా మిత్రులతో కలిసి నానాయాగీ చేసేవాడు. ఇమామ్‌ని తూలనాడేవాడు. తీవ్రంగా దూషించేవాడు. అతడి కారణంగా దైవారాధనలో ఉన్న ఇమామ్ అబూ ఏకాగ్రత దెబ్బతినేది. అయినా అవేవీ పట్టించుకోకుండా ఖురాన్ పారాయణం కొనసాగించేవారాయన.



మూడు రోజులుగా ఎలాంటి అల్లరీ లేదు. ఆ వ్యక్తికి ఏమైందోనని ఇమామ్ వెళ్లి వాకబు చేశారు. అతడిని రక్షక భటులు నిర్బంధించారని తెలిసింది. ఇమామ్ వెంటనే ఉన్నతాధికారి దగ్గరికి వెళ్లారు. ఇమామ్‌ని చూడగానే ఆ అధికారి ఎంతో మర్యాదగా దర్బారులోకి ఆహ్వానించారు. 'మీరు ఇంత దూరం ఎందుకు వచ్చారు గురువుగారూ? ఆజ్ఞాపిస్తే నేనే వచ్చేవాడిని కదా!' అన్నాడు అధికారి. 'మా పొరుగింట్లో ఉన్న వ్యక్తిని మీ రక్షకభటులు నిర్బంధించారు. అతడ్ని విడిపించుకోవడానికి వచ్చాను' అన్నారు ఇమామ్. వెంటనే ఆ వ్యక్తిని విడుదల చేయాలని ఆదేశించాడు అధికారి. చెరశాల నుంచి బయటకు వచ్చిన వ్యక్తితో.. 'మా వల్ల ఏమైనా తప్పు జరిగిందా' అని అడిగారు ఇమామ్ అబూ. ఆ మాటలు వినగానే తాగుబోతు సిగ్గుతో తల దించుకున్నాడు. ఇంతకాలం ఎంతగా దుర్భాషలాడినా తనను క్షమించిన ఇమామ్ గొప్పమనసు అతనిలో పరివర్తన తెచ్చింది. వ్యసనాలకు స్వస్తి చెప్పాడు. ఇమామ్ అబూ ప్రియ శిష్యుడిగా మారిపోయాడు. గొప్ప ధార్మిక పండితుడిగా పేరుగడించాడు.

చెడును చెడుతోనే తొలగించాలన్న మాట తప్పని రుజువు చేసిన ఘటన ఇది. ఎలాగైతే దుర్గంధాన్ని.. దుర్గంధంతో శుద్ధి చేయలేమో.. అలాగే చెడును చెడుతో గెలవలేము. "ప్రవక్తా! మంచీ, చెడూ ఒకటి కావు. చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నువ్వంటే శత్రుభావం కలవాడు నీకు ప్రాణస్నేహితుడిగా మారడాన్ని గమనిస్తావు" (41:35) అన్న ఖురాన్ వాక్యం నిత్యసత్యం.

- ఖైరున్నీసాబేగం



సమర్పించుకుందాం... రండి!

"చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్ దృఢం
తస్యాహం నిగ్రహం మన్యే వయోరివ సుదుష్కరం"
(భగవద్గీత 6-34)

మనసు చంచలమైనది. ఒక్కచోట ఉండదు. ఎక్కడికి వెళ్తుందో తెలియదు. బలమైనది.. పట్టుకుందామంటే కుదరదు. దృఢమైనది.. అది చేయాలనుకున్నది చేసి తీరుతుంది. గాలిని ఎలాగైతే నియంత్రించలేమో.. మనసునూ కట్టడి చేయలేకున్నాను" అర్జునుడు కృష్ణుడితో మొరపెట్టుకున్నాడు అంటే మనసును అదుపులో ఉంచడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. అలాంటి మనసును ఏకోన్ముఖం చేసేదెలా..?

దీనికి ఏకైక మార్గం భగవంతుడికి శరణాగతి చెందడమే...

భగవంతుడిని ఆశ్రయించడం ద్వారా మనసును దారిలోకి తీసుకురావొచ్చు. అందులోని పాత కర్మలను తొలగిస్తే సరిపోదు.. దానిని ప్రక్షాళన చేయాలి. పూర్వ జన్మ పుణ్యాలు, పాపాలు, రుచులు, వాసనలు, కర్మలు అన్నీ జ్ఞాన స్వరూపంతో మనసులో ఉంటాయి. ఆ జ్ఞానాన్ని కడగాలంటే జ్ఞానంతోనే సాధ్యమవుతుంది. భగవత్ జ్ఞానం, మహనీయుల ఉపదేశంతో అందిన జ్ఞానంతో ప్రక్షాళన చేయాలి.

యథైధాంసి సమిద్ధోఽగ్నిః భస్మసాత్కురుతే అర్జున।
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా॥
(భగవద్గీత 4-37)

"మండుతున్న అగ్నిహోత్రం ఎలాగైతే సమిధలను భస్మంగా చేస్తోందో.. జ్ఞానాగ్ని సమస్త కర్మలనూ భస్మం చేస్తుంది" అని గీతాచార్యుడు శ్రీకృష్ణుడు చెప్పిన మాట. అటువంటి జ్ఞానం భగవానుడి ఆశ్రయంతో లభిస్తుంది. భాగవతుల ఉపదేశాలతో కలుగుతుంది. వేదాలు, పురాణాలు ఇవన్నీ జ్ఞానరూపాలే. వాటిని అనుష్ఠానం చేయడం ద్వారా జ్ఞానం వస్తుంది. ఆగమ గ్రంథాలు నిర్దేశించిన సూత్రాలు పాటిస్తూ ఆధ్యాత్మికంగా శక్తిని పోగు చేసుకునేకొద్దీ జ్ఞానం వికసిస్తుంది. జన్మాంతరాలుగా పేరుకుపోయిన కర్మలను తొలగించే అవకాశమూ కలుగుతుంది. భగవానుడి అనుగ్రహం పొందడానికి మనిషి జన్మకు మించిన అవకాశం మరొకటి లేదు. మనలోని జీవుడు జన్మజన్మాంతరాల కర్మలను వెంట తెచ్చుకొంటాడు. ఆ కర్మలు పూర్తయ్యే వరకు జననమరణ చక్రం నుంచి విముక్తి లభించదు. మనుష్య ఉపాధిలో తప్ప మరే జీవిగా జన్మించినా కర్మను పూర్తిగా తొలగించుకోలేం. మనుష్య జన్మ లభించడం దుర్లభం. ఆ ఉపాధిలో ఉండగానే కర్మను నిశ్శేషం చేసుకోవాలి.

> దైవానుగ్రహం పొందడం కోసం జపతపాలు చేయడం సహజం. అయితే, గురువు ఉపదేశం చేసిన మంత్రాన్ని వందలు, వేలసార్లు చేస్తుంటారు. మంత్రార్థం తెలియకుండా అలా.. జపం చేయడం ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదు. యాంత్రికంగా జపం చేయడం కన్నా.. మంత్రం తాత్పర్యాన్ని గ్రహించి ఒక్కసారి చేసినా ఉత్తమమైన ఫలితం పొందవచ్చు. జపం చేస్తున్నప్పుడు అర్థానుసంధానం ప్రధానం.

మనస్సు... నమస్సు...

చంచలచిత్తమైన మనసును అదుపులో ఉంచడానికి మనపెద్దలు అద్భుతమైన మార్గాన్ని సూచించారు. పూర్వ కర్మలు, వాసనలతో నిండి ఉన్న మనసును మొదట బోర్లించాలి. 'మనః..' తిరిగేస్తే 'నమః' అవుతుంది. అంటే.. ఒంగడం (నమస్కరించడం) అని అర్థం. భగవంతుడి ఎదుట ఒంగగలిగితే.. దేవుడు మనకు లొంగిపోతాడు. అదే శరణాగతి. రామాయణంలో విభీషణుడు అదే చేశాడు. రాముడి శరణుజొచ్చాడు. ఆయన అనుగ్రహించాడు. వారధి కట్టకముందే, లంకకు చేరకముందే, యుద్ధం చేయకముందే, రావణుడిని జయించకముందే.. విభీషణుడిని లంకకు రాజుగా పట్టాభిషిక్తుడిని చేశాడు. 'నమః'తో కలిగే ప్రయోజనం ఇది.

- జూపల్లి రామేశ్వరరావు గృహంలో ధనుర్మాస ఉత్సవంలో శ్రీ త్రిదండి చిన్నజీయరు స్వామి వారి అనుగ్రహ భాషణంలో భాగం

ధర్మసందేహం

దృష్టి దోషం తగలకూడదని...

ఆలయాల్లో దేవుడికి జరిగే అన్ని సేవలూ భక్తులు చూస్తుంటారు. అయితే నివేదన సమయంలో పరదా వేస్తుంటారు. నైవేద్య సమర్పణ ఎందుకు చూడకూడదు?

సుప్రదీప్త, హైదరాబాద్

ఆలయాలలో అర్చనలలో జరిగే షోడశ ఉపచారాలలో నివేదన ఒకటి. మిగిలిన అన్ని సేవలూ మనం చూసి తరించటానికి. కానీ, నివేదన చేసే వేళ దృష్టి దోషం రాకుండా ఉండాలని ఆగమ సంప్రదాయం. పెద్దలు, పసిపిల్లలు భోజనం చేసే సమయాలలో మన ఇళ్లలో కూడా ఇలాంటి విధానం పాటించటం మనం గమనించవచ్చు. దేవునికి నివేదన చేసిన పదార్థం ప్రసాదం అవుతుంది. అందుకు నివేదన సమయంలో దృష్టి దోష పరిహారార్థం తెరకట్టడం ఆగమ సంప్రదాయం.

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి

ఈనాడు సినిమా

కలయా.. నిజమా...

కలలు కన్నాం సాకారం చేసుకొన్నామని చెప్పే వాళ్లని చాలామందినే చూస్తుంటాం. అనుపమ పరమేశ్వరన్ మాత్రం తాను కన్న కలలకంటే అందమైన విషయాలు నా జీవితంలో చాలా జరిగాయని చెబుతోంది. పరిశ్రమలోకి అడుగు పెట్టిన తొలి నాళ్లలో ఇదంతా కలా.. నిజమా? అనిపించిన సందర్భాలు చాలానే ఉన్నాయి అంటోంది.

"సినిమాలు చూస్తున్నప్పుడు, తారల క్రేజ్ గురించి తెలుసుకొంటున్నప్పుడు ఎంతో ఆసక్తిగా అనిపించేది. మనం కూడా అలా తెరపై కనిపిస్తే ఎంత బాగుంటుందో అని అప్పుడప్పుడు అనుకొనేదాన్ని. కానీ అదే పనిగా కలలు కన్నది మాత్రం లేదు. కానీ నా జీవితంలో పెద్దగా ప్రయత్నించకుండానే విలువైన అవకాశాలు చేతికందాయి. వాటిని అంతే జాగ్రత్తగా సద్వినియోగం చేసుకొన్నా" అని చెప్పింది అనుపమ. కొత్త ఏడాది కదా, కొత్త నిర్ణయాలు ఏమైనా ఉన్నాయా అంటే.. "అలాంటి వాటిని నేను నమ్మను. ఇది మంచి నిర్ణయం అని ఎప్పుడు అనిపిస్తే అప్పుడే శ్రీకారం చుడతా. అంతే కానీ.. ప్రత్యేకంగా ఒక రోజు, ఒక సందర్భం కోసం ఎదురు చూడను?" అని చెప్పింది. అనుపమ.



అనుపమ పరమేశ్వరన్

ట్రైలర్ కనిపించడం లేదు



అనుపమ్ ఖేర్

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత కథ 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'గా తెరకెక్కుతోంది. అనుపమ్ ఖేర్ టైటిల్ పాత్ర పోషించిన ఈ సినిమా ట్రైలర్ విడుదలై ఆకట్టుకుంటోంది. అయితే ఈ వీడియో యూ ట్యూబ్‌లో కనిపించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అనుపమ్ ఖేర్. 'డియర్ యూ ట్యూబ్...'యూ ట్యూబ్‌లో..'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అని టైప్ చేస్తే వీడియో కనిపించడం లేదు. అభిమానుల నుంచి సందేశాలు, ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మొన్నటివరకూ 'మా సినిమా ట్రైలర్ యూ ట్యూబ్ ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో ఉండేది. ఇప్పుడు 50వ స్థానంలో కూడా కనిపించడం లేదు. సాయం చేయండి' అని ట్వీటారు.

పాతికేళ్ల కిందటి రజనీని చూస్తారు



అశోక్ వల్లభనేని

"ప్రేక్షకులు రజనీకాంత్ సినిమాల నుంచి కోరుకొనే స్టైల్, యాక్షన్, మాస్ అంశాలతోనే 'పేట' తెరకెక్కింది. 'నరసింహ', 'బాషా', 'ముత్తు' చిత్రాల తర్వాత మళ్లీ ఆ తరహాలో ప్రేక్షకుల్ని అలరించే చిత్రమవుతుంద"ని చెప్పారు నిర్మాత అశోక్ వల్లభనేని. ఆయనే రజనీకాంత్ 'పేట' చిత్రాన్ని ఈ నెల 10న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో అశోక్ వల్లభనేని విలేకర్లతో మాట్లాడారు. ఆ విషయాలివీ...

- "రజనీకాంత్‌కి కార్తీక్ సుబ్బరాజ్ వీరాభిమాని. రజనీకాంత్ స్టైల్‌ని, ఆయన అభిమానుల్ని దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాతికేళ్ల కిందటి రజనీకాంత్ గ్లామర్, స్టైల్ ఈ చిత్రంలో కనిపిస్తాయి. త్రిష, సిమ్రన్‌లతో పాటు, మరో ఇద్దరు కథానాయికలు కూడా తెరపై కనిపిస్తారు. రజనీకాంత్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలనుంది. ఈ నెల 6న హైదరాబాద్‌లో సినిమా విడుదల ముందస్తు వేడుకను నిర్వహిస్తున్నాం. ఆ వేడుకలో రజనీతో కలిసి సేవా కార్యక్రమాల కోసం ఆర్థిక సహాయం అందించబోతున్నాం".
- "సంక్రాంతికి పలు చిత్రాలు విడుదలవుతున్నా, కథ బాగున్న చిత్రాలకి ఆదరణ దక్కుతోంది. గతంలో 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రం తక్కువ థియేటర్లలోనే విడుదలైనా మంచి విజయాన్ని అందుకొంది. ఆ నమ్మకంతోనే మా చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ ఏడాది నేరుగా ఓ చిత్రం చేయాలనే ఆలోచనలో ఉన్నా. కథాచర్చలు జరుగుతున్నాయి."

'ఉన్మాది' పాటలు



శిరీష

ఎన్.ఆర్. రెడ్డి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఉన్మాది'. శిరీష నాయిక. ఎన్. రామారావు నిర్మాత. డేవిడ్.జి స్వరకర్త. హైదరాబాద్‌లో పాటల సీడీలను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. నటుడు కృష్ణుడు తొలి సీడీని స్వీకరించారు. దర్శకుడు మాట్లాడుతూ "నేనే కథానాయకుడిగా నటిస్తూ రాఘవ సహకారంతో దర్శకత్వం వహించి తీశా. నేను హరికృష్ణకి వీరాభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పోలీసాఫీసర్‌గా నటించా"అన్నారు. "ఇందులోని నాలుగు పాటలు ఆకట్టుకుంటాయ"ని స్వరకర్త డేవిడ్ చెప్పారు. "మా స్వగ్రామమైన నకిరేకల్ గ్రామస్తుల సహకారంతో సినిమాని అక్కడే చిత్రీకరించామ"ని క్రియేటివ్ డైరెక్టర్ రాఘవ అన్నారు. శిరీష, ప్రమీల, రాజేశ్వరి, అల్లురమేష్, వెంకటాంజనేయులు, జోజో, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కె.ఎస్.100 వెనక?



శైలజ, సమీర్‌ఖాన్

సమీర్‌ఖాన్, శైలజ నాయకానాయికలుగా పరిచయమవుతున్న చిత్రం 'కె.ఎస్.100'. షేర్ దర్శకుడు. వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. హైదరాబాద్‌లో టైటిల్ లోగోని ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "హారర్, థ్రిల్లర్, రొమాంటిక్ అంశాల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యువతరాన్ని, మహిళల్ని మెప్పించే అంశాలున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చాలామంది మోడల్స్‌ని ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నాం. 'కె.ఎస్.100' వెనక కథేమిటన్నది తెరపైనే చూడాల"న్నారు.

ఏవీఎస్ తనయుడి దర్శకత్వంలో



మహేష్, ప్రణతి

హాస్యనటుడు ఏవీఎస్ తనయుడు ఎ.రాఘవేంద్ర ప్రదీప్ దర్శకత్వం వహించిన చిత్రం 'వైదేహి'. మహేష్, ప్రణతి నాయకానాయికలు. ఎ.జనని ప్రదీప్ నిర్మాత. ఎ.జి.ఆర్.కౌశిక్ సమర్పిస్తున్నారు. బుధవారం ఏవీఎస్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్‌ను దర్శకుడు ఎన్.శంకర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఏవీఎస్ గారిదీ, నాదీ ప్రత్యేకమైన అనుబంధం. ఆయన లేని లోటు ప్రస్తుతం పరిశ్రమలో స్పష్టంగా తెలుస్తోంది. ట్రైలర్ బాగుంద"న్నారు. రాఘవేంద్ర ప్రదీప్ మాట్లాడుతూ "నాన్నకి సన్నిహితులైన ఎన్.శంకర్ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంద"న్నారు. కార్యక్రమంలో పసుపులేటి రామారావు, అఖిల, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అమీ జాక్సన్ నిశ్చితార్థం



అమీ జాక్సన్



అమీ జాక్సన్, జార్జ్ పనాయెటో


'2.ఓ'లో రోబోగా నటించి ఆకట్టుకున్న అమీ జాక్సన్ కొత్త జీవితంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతోంది. ఆమె కొన్ని రోజులుగా బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త జార్జ్ పనాయెటోతో డేటింగ్‌లో ఉన్నారు. కొత్త ఏడాదిలో శుభవార్త చెప్పేశారు. జనవరి 1న వీళ్ల నిశ్చితార్థం జాంబియాలో జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకొన్నారు. "జనవరి 1 నుంచి మన కొత్త ప్రయాణం మొదలైంది. ఐ లవ్యూ. ప్రపంచంలోనే సంతోషంగా ఉండే అమ్మాయిగా నన్ను చేసినందుకు ధన్యవాదాలు" అని రాసిందామె. పెళ్లి ఎప్పుడో మాత్రం ప్రకటించలేదు. తెలుగులో 'ఎవడు', 'అభినేత్రి' చిత్రాల్లో నటించింది అమీ.

రియల్ బయోపిక్స్



దీపికా పదుకొణె

చిత్రసీమలో ఇప్పుడు బయోపిక్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. జీవిత కథలతో సినిమా అనగానే సినిమా తారలు, క్రీడాకారుల జీవితాలే అనుకొనేలా ఇప్పటివరకూ బయోపిక్‌లు తెరకెక్కాయి. కానీ విజయం ఎవరు సాధించినా విజయమే. ఎక్కువ ప్రజాదరణ ఉండే సినీ నటులు, క్రీడాకారుల జీవితాలైతేనే ప్రేక్షకులు చూస్తారు. మిగిలిన వారి జీవిత కథలకు అంతగా డిమాండ్ ఉండదనే ధోరణిలో ఉండేది చిత్ర పరిశ్రమ. కానీ ఆ పరిస్థితి నెమ్మదిగా మారుతోంది. ఈ రెండు రంగాల్లోనే కాకుండా అందరిలోనూ స్ఫూర్తి నింపేలా విజయాలు సాధించిన సామాన్యులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి కథల్ని ఇప్పుడు బయోపిక్‌లుగా మలిచే పనిలో పడ్డారు దర్శకనిర్మాతలు. స్ఫూర్తిదాయక విజేతల జీవితాల్ని వెండితెరకు తీసుకొచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి.



అమితాబ్ బచ్చన్

- స్ఫూర్తిదాయక విజేతల జీవితాలు వెండితెరకు
- అగ్రతారల ఆసక్తి



షారుఖ్ ఖాన్

'పాన్ సింగ్ తోమర్', 'భాగ్ మిల్కా భాగ్', 'ధోనీ'.. ఇలా క్రీడాకారుల జీవిత కథలతో తెరకెక్కిన ఈ చిత్రాలన్నీ మంచి విజయం సాధించాయి. సిల్క్‌స్మిత జీవిత కథతో 'డర్టీ పిక్చర్' తెరకెక్కి భారీ విజయం అందుకొంది. దక్షిణాదిలో సావిత్రి జీవితంపై వచ్చిన 'మహానటి' ఓ సంచలనం. ఇలా ఇప్పటివరకూ బయోపిక్‌ల కోసం క్రీడాకారులు, సినిమాతారలే జీవితాలే ఎక్కువగా కనిపించాయి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. నిజజీవితంలో విజయం సాధించి ఎంతోమందికి మార్గదర్శకంగా నిలుస్తున్న సామాన్య వ్యక్తుల వీరగాథలు తెరకెక్కుతున్నాయి. ఈ కథల్లో నటించడానికి బాలీవుడ్ అగ్రతారలు ముందుకు రావడం శుభ పరిణామం.

యాసిడ్ దాడికి గురైనా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్న దిల్లీకి చెందిన లక్ష్మీఅగర్వాల్ జీవితం ఎంతోమంది యాసిడ్ దాడి భాదితుల్లో ఆత్మవిశ్వాసం నింపింది. ఆమె జీవితాన్ని సినిమాగా మలిస్తే మరింతమందిలో స్ఫూర్తి నింపొచ్చని భావించారు దర్శకురాలు మేఘనా గుల్జార్. లక్ష్మి జీవితాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో లక్ష్మి పాత్రలో బాలీవుడ్ అగ్ర తార దీపికా పదుకొణె నటిస్తోంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో కీలక సేవలు అందించిన మహిళా పైలట్ గుంజన్ సక్సేనా. కార్గిల్ యుద్ధ సమయంలో ఆమె చూపించిన ధైర్య సాహసాలకు పతకాలు, ప్రశంసలు దక్కాయి. ఎయిర్ ఫోర్స్‌లో మహిళలు పైలట్‌గా ఏం చేయగలరు? అనేవారికి చెంపపెట్టులా ఆమె తెగువ చూపించారు. ఇప్పుడు ఆమె విజయ గాథ తెరకు రాబోతుంది. గుంజన్ పాత్రలో జాన్వీకపూర్ నటిస్తోంది. 'ధడక్'తో ఆకట్టుకున్న జాన్వీ ఇప్పుడు 'తఖ్త్'తో పాటు ఈ బయోపిక్ కోసమూ సిద్ధమవుతోంది. ఇందులో దుల్కర్ సల్మాన్ కీలక పాత్రలో నటించనున్నాడట.. భారతీయ ఖగోళ శాస్త్రవేత్త రాకేష్ శర్మ జీవితాన్ని వెండితెరపై చూడబోతున్నారు ప్రేక్షకులు. షారుఖ్ ఖాన్ ప్రధాన పాత్రలో 'సారే జహాసే అచ్ఛా'గా ఈ చిత్రం తెరకెక్కుతోంది.



జాన్వీ కపూర్

బాలీవుడ్ కథానాయకుడు అజయ్‌దేవగణ్ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్‌గా కనిపించనున్నారు. 1950- 63 మధ్యలో ఇండియన్ ఫుట్‌బాల్ బృందానికి కోచ్‌గా పని చేశారాయన. నిరుపేద పిల్లలకు ఫుట్‌బాల్ శిక్షణ ఇవ్వడం కోసం ఏర్పాటైన స్వచ్ఛంద సంస్థ 'స్లమ్ సాకర్'. దీని స్థాపకుడు విజయ్ బార్సే జీవిత కథను 'ఝుండ్'గా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు నాగరాజ్ ముంజాలే. ఆయన 'సైరత్'తో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ కథలో విజయ్ బార్సేగా బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ నటిస్తున్నారు. "నా జీవిత కథలో అమితాబ్ నటిస్తుండటం ఆనందాన్ని కలిగించింది. దీనివల్ల నా 'స్లమ్ సాకర్' సంస్థ మరింతమందికి చేరే అవకాశం కలుగుతోంద"న్నారు విజయ్ బార్సే. సిక్కు యోధుడు ఫతే సింగ్ కథను సినిమాగా మలిచే ప్రయత్నాలో ఉన్నారు రాజ్‌కుమార్ సంతోషి.

వివేకానంద వెబ్ సిరీస్: స్వామి వివేకానంద జీవిత కథతో ఓ వెబ్‌సిరీస్ మొదలు కానుంది. ఇందులో స్వామి వివేకానందగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించనున్నారు.




అజయ్ దేవగణ్

బుడిబుడి అడుగులు

రియల్ హీరోల కథలు తెరకెక్కించడంలో హాలీవుడ్ ముందుంటుంది. ఇక్కడ మనకు కూడా ఇప్పుడిప్పుడే బుడిబుడి అడుగులు పడుతున్నాయి. వివిధ రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన వారి బయోపిక్‌లు రావడం చక్కటి పరిణామం. మన దర్శక నిర్మాతలు కూడా వైవిధ్యమైన కథల కోసం తీవ్ర అన్వేషణ సాగిస్తున్నారు. అందుకే ఇలాంటి స్ఫూర్తిదాయక కథలవైపు మళ్లుతున్నారు"అని చెప్పారు సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్. "అందరికీ ఆదర్శంగా నిలిచేలా విజయాలు సాధించిన వారు దేశంలో ఎంతోమంది ఉన్నారు. వాళ్లందరి జీవితాల్లోనూ చీకటి వెలుగులు, ఎత్తుపల్లాలు ఉన్నాయి. వాటిని సినిమా కథగా మలిచే సత్తా ఉంటే మనకు కథలకు కొదవే ఉండదు" అంటున్నారు మరో సినీ విశ్లేషకుడు.

సీతారాముల కథ



సుకృత వాగ్లే, ఇంద్ర

ఇంద్ర, సుకృత వాగ్లే జంటగా నటిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. శ్రీహర్ష మండ దర్శకత్వం వహిస్తున్నారు. విశాలక్ష్మి మండ, జి.ఎల్.ఫణికాంత్ నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే చిత్రమిది. అన్నివర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుంది. రామాయణానికీ, మా చిత్రంలోని సీతారాముల కథకీ సంబంధమేంటన్నది తెరపైనే చూడాలి. ఇప్పటికే 70 శాతం చిత్రీకరణ పూర్తయింది" అన్నారు.

నఖాలకు నయారంగులు






గోళ్ల రంగు... అందంగా కత్తిరించుకున్న గోళ్ల అందాన్ని రెట్టింపు చేస్తుంది. మారుతోన్న కాలంతో పాటు ఆ రంగుల్ని ఎంచుకోవడం, వేసుకోవడంలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. మొన్నటి వరకూ నెయిల్ ఆర్ట్ పేరుతో చమ్కీలు, పూసలు, రాళ్లు, ఎరుపు, పోల్కాడాట్‌లు, పూల హంగులు... గోళ్లపై వర్ణరంజితంగా వెలిగిపోయాయి. ఇప్పుడా ట్రెండ్ మారింది. అచ్చంగా నెయిల్‌పాలిష్ వేసుకోవడమే ప్రత్యేకత అంటున్నారు. అలాని ఎరుపు, గులాబీ, వెండి వంటి రంగులు కాదండోయ్! మెటాలిక్ మెరుపులు, మ్యాటీ ఫినిషింగ్‌లు, పేస్టల్ కలర్స్, నలుపు, నీలం వంటివి ఇప్పుడు గోళ్లపై కనికట్టు చేస్తున్నాయి. అవేంటో మనమూ చూసేద్దామా...

సగ్గుబియ్యం కిచిడీ

పిల్లలకు రోజుకో కొత్త టిఫిన్ ఉండాలి. తల్లులేమో వాళ్లకు పోషకాలు అందేలా చూడాలనుకుంటారు. ఈ రెండింటినీ మేళవిస్తూ తక్కువ సమయంలో పూర్తయ్యే విధంగా, పోషకాలు అందించేలా రకరకాల టిఫిన్లను వసుంధర మీకు పరిచయం చేయబోతుంది. చూడండి పిల్లలకు చేసిపెట్టండి.

◆ అమ్మచేత కమ్మగా



కావల్సినవి: సగ్గుబియ్యం - కప్పు (ముందురోజు నానబెట్టుకోవాలి), ఉడికించిన ఆలూ - ఒకటి, తాలింపు దినుసులు - అన్నీ కలిపి చెంచా, కరివేపాకు రెబ్బలు - రెండు, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, అల్లం - చిన్నముక్క, పసుపు - కొద్దిగా, వేయించిన పల్లీల పొడి - అరకప్పు, పల్లీలు - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, నెయ్యి - రెండు పెద్ద చెంచాలు.

తయారీ: పొయ్యిమీద బాణలి పెట్టి నెయ్యి వేయాలి. అది కరిగాక తాలింపు దినుసులు, పల్లీలు వేయాలి. అన్నీ వేగాక పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, ఆలూ ముక్కలు, ఉల్లిపాయ, అల్లం తరుగు వేయాలి. నిమిషం అయ్యాక నానబెట్టిన సగ్గుబియ్యం, పసుపు వేసి మంట తగ్గించి మూత పెట్టేయాలి. కాసేపటికి సగ్గుబియ్యం మగ్గి మెత్తగా అవుతుంది. అప్పుడు పల్లీలపొడి, తగినంత ఉప్పు వేసి కలపాలి. ఐదు నిమిషాల తరువాత దింపేస్తే చాలు.

రంగవల్లిక


16 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చేవరకూ.






- ఆశాలత, హైదరాబాద్

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. మూడువైపులా వేసి... ఒక వైపు చుక్కల్ని వదిలేయాల్సి ఉంటుంది. ఒకవేళ ముగ్గుల్లో రంగులు నింపితే చుక్కలు కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.



- పాపినేని భార్గవి, కన్నెవీడు, కృష్ణాజిల్లా



16 చుక్కలు, 6 వరుసలు, 6 వచ్చేవరకూ.

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ తెలంగాణ — జనవరి 1, 2019 విజేతలు

1. శైలజ, తొర్రూరు
2. డి.స్వర్ణలత, రామకృష్ణాపూర్
3. ఎం.సంతోష, మలక్‌పేట
4. జి.చంద్రకళ, బుట్టాపూర్,
5. ఎం.మానస, దస్తూరాబాద్, నిర్మల్
6. కె.స్వరూప, సెంటినరీ కాలనీ
7. బి.సువర్ణ, సికింద్రాబాద్
8. జి.సరితారెడ్డి, కాజీపేట
9. కె.రుచిత, బడంగ్‌పేట, రంగారెడ్డి
10. ఎ.బాలమణి, గజ్వేల్

స్వశక్తి

యాభైవేల రూపాయల పెట్టుబడి... సృజనాత్మకత దిశగా అడుగులు... కొన్ని అవరోధాలు, మరికొన్ని సవాళ్లు... అన్నింటినీ తట్టుకుంటూ మెలకువలు నేర్చుకుంటూ ఒక్కో మెట్టూ ఎక్కారు. ఆ కృషి వృథా పోలేదు. భిన్నమైన జ్యూట్ బ్యాగుల్ని తయారు చేస్తూ... పెద్ద పెద్ద సంస్థల్ని తమ వినియోగదారుల జాబితాలో చేర్చుకున్నారు. వాళ్లే హైదరాబాద్‌కి చెందిన మాధురి, సమత. ఆ వివరాలు మాధురి మాటల్లోనే...



ఆ ఆవు వల్లే...వ్యాపారంలోకి!

కాస్త సృజనాత్మకంగా ఆలోచిస్తే... ఏ వ్యాపారంలో అయినా రాణించొచ్చు అని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాం. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కష్టపడ్డాం. మాకు ఎదురైన మోసాలు, అవమానాల నుంచి మమ్మల్ని మేం దృఢంగా మార్చుకున్నాం. ఇప్పుడు దాదాపు డెబ్బైఐదురకాల జ్యూట్ ఉత్పత్తుల్ని రీటైల్‌గానే కాకుండా కార్పొరేట్ సంస్థలకు, యూనివర్సిటీలకు అందించే స్థాయికి చేరుకున్నాం. ఈ వ్యాపారంలోకి రావడానికి మాకు ఎదురైన పరిస్థితులే కారణం. ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల జంతువులు ఆ కవర్లను తింటున్నాయి. అలా ఓ ఆవు చనిపోవడం నాకు తెలుసు. ప్లాస్టిక్ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా జనపనారతో ఎలాంటి బ్యాగులు తయారుచేయొచ్చు అని కొన్నాళ్లు ఆలోచించా. ఇప్పటికే చాలామంది మహిళలు రకరకాల వస్తువులు తయారుచేస్తున్నారు కాబట్టి వాళ్లకన్నా భిన్నంగా చేయాలనుకున్నాం. అక్కడే సమస్య మొదలైంది.

అమెరికా ఆర్డరు కోసం...

ఎలాంటి సంచుల్ని తయారు చేయాలీ.... వాటిని ఎక్కడ నేర్పుతారో తెలుసుకునేందుకు అంతర్జాలంలో చాలానే వెతికా. చివరకు ఎంఎస్‌ఎంఈ నేర్పుతుందని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. ఆ శిక్షణలోనే నాకు సమత పరిచయం అయ్యింది. తనది కూడా వ్యాపారం చేయాలనే ఆలోచనే. మా శిక్షణ పూర్తయ్యాక ఇద్దరం వేర్వేరుగా వ్యాపారం చేయాలనుకున్నాం. అది ఓ కొలిక్కి రాక ముందే అమెరికాలో ఉన్న మా బంధువులు కొన్ని జ్యూట్‌బ్యాగ్‌లు కావాలంటూ ఆర్డర్ ఇచ్చారు. ఆ విషయాన్ని సమతతో చెప్పడంతో తను సాయం చేస్తానంది. అప్పటికి మా దగ్గర ఓ మెషీన్ కూడా లేదు. కానీ అది మొదటి అవకాశం కావడంతో వదులుకో కూడదని ఇద్దరం కలిసి మా ఇంట్లోనే రెండు పాత మిషన్ల సాయంతో బ్యాగుల్ని కుట్టి ఇవ్వాలనుకున్నాం. ఉత్సాహంగా మొదలుపెట్టినా... ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. అవి పాత మెషీన్లు కావడంతో తరచూ మొరాయించేవి. చివరి నిమిషం వరకూ పని చేశాం. ఇద్దరం కటింగ్ చేసుకుంటూ, ప్రింట్లు వేస్తూ కుట్టేవాళ్లం. మా కష్టంచూసి మా అమ్మ 'చదువుకున్న నీకూ నాకు ఏ తేడా లేదు. నాలానే నువ్వూ కష్టపడుతున్నావు. ఇదంతా ఎందుకు హాయిగా ఉద్యోగం చేసుకో...' అని తిట్టేది. కానీ మేం వినకుండానే వాటిని పూర్తిచేసి ఇచ్చాం. అదయ్యాక మరో ఆర్డరు. దాన్ని కూడా తిప్పలు పడే పూర్తిచేశాం.



కోల్‌కతా వెళ్లొచ్చాం...

రెండు ఆర్డర్లనయితే పూర్తిచేశాం కానీ మాకు వాటి ధర ఎలా నిర్ణయించాలో తెలియదు. అందుకే ఇద్దరం కలిసి ఏలూరులోని శ్రీకృష్ణ జ్యూట్ మిల్లుకి వెళ్లి నాణ్యమైన జనపనార ఎలా ఎంపికచేసుకోవాలో తెలుసుకున్నాం. అలానే కోల్‌కతాకు కూడా వెళ్లి అక్కడ మార్కెట్, ధరల్ని పరిశీలించడంతో కొంత అవగాహన వచ్చింది. మొదట్లో కొన్ని థర్డ్ పార్టీ ఆర్డర్లు వచ్చేవి. వాటినీ తీసుకున్నాం. క్రమంగా ఆర్డర్లు పెరగడంతో సిబ్బందిని నియమించుకున్నాం. ఇప్పుడు వారి సంఖ్య ఏడుకి చేరింది. అయితే కొన్ని సమస్యలు తప్పలేదు. వివిధ రకాల సంచుల్ని కుట్టాలంటే నైపుణ్యం ఉండాలి. అలాగని ఆ నిపుణులు మా దగ్గర పనిచేయకపోవచ్చు. అందుకే స్థానికంగా ఉండే మహిళలకు పని నేర్పి వాళ్లతోనే కుట్టించాలనుకున్నాం. బస్తీల్లో తిరిగి వాళ్లను ఒప్పించి శిక్షణ అందించేవాళ్లం. తీరా పని చేయడం మొదలుపెట్టాక మానేసేవారు. ఇలా చాలా సార్లే జరిగింది.

వద్దనేశారు...

ఆర్డర్లు పెంచుకునే క్రమంలో కొన్ని ప్రయోగాలు చేయడం మొదలుపెట్టాం. జనపనారతో పాటు జ్యూట్, నాన్ వోవెన్ మేళవింపుతో బ్యాగులను తయారు చేశాం. ఓ వినియోగదారుడు ఆర్డరు కోసం ఫోన్‌లో ఓ డిజైన్ పంపించారు. దాన్ని చూసి ఒకటి తయారు చేసి చూపించాం. సరేనడంతో చెప్పినట్లుగా పెద్దఎత్తున చేసి ఇచ్చాం. వాటిని తీసుకుని 'నేను చూపించిన డిజైన్ అదికాదు' అంటూ డబ్బుల్ని తగ్గించారు. స్టార్టప్ కావడంతో మొదట అడ్వాన్స్ కూడా తీసుకోలేదు. అలాగే ఒకావిడ నుంచి మరో ఆర్డరు వచ్చింది. పెద్ద ఆర్డర్ కాబట్టి ఉత్సాహంగా చేయడం మొదలుపెట్టాం. అనుకున్న సమయానికంటే ముందు ఇవ్వమంటూ ఒత్తిడి తెచ్చింది. అయినా సరే కష్టపడి కుట్టిచ్చాం. కానీ ఆమె ఉత్పత్తులు తీసుకుని డబ్బు ఇవ్వలేదు. అంతేనా మా ఉత్పత్తుల్ని తాను తయారుచేసినట్లుగా వీడియోలు తీసి తన ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి, మా ధరకు రెండింతలు అమ్ముకోవడం మొదలుపెట్టింది. మా ఫోన్‌లూ బ్లాక్ చేసింది. ఇలా మాకు తగిలిన ప్రతి దెబ్బ నుంచి ఓ గుణపాఠాన్ని నేర్చుకోగలిగాం. వీటిని చేస్తున్నప్పుడే జ్యూట్ బోర్డ్ వాళ్లు మాకో స్టాల్ కూడా కేటాయించారు. ఆ తరువాత వినియోగదారుల సంఖ్య పెరిగింది. ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేసుకుంటూ వస్తున్నాం. సింథటిక్, లెదర్ బ్యాగుల్లానే జూట్‌లోనూ ట్రాలీబ్యాగులూ, ఫోల్డర్‌లు, గిఫ్ట్‌కవర్లు, కార్పొరేట్ బ్యాగులు ఇలా ఒకటేమిటి సుమారు డెబ్బై ఐదు రకాలు తయారుచేస్తున్నాం.

సంస్థలే కాదు...


వీళ్ల వినియోగదారుల జాబితాలో కార్పొరేట్ సంస్థలే కాదు ఉస్మానియా, విజ్ఞాన్, కేఎల్ వంటి యూనివర్శిటీలు ఉన్నాయి. ఓఎన్‌జీసీ, ఈఎస్ఈఐ, రీసెర్చ్ బ్యూరో వంటి ప్రముఖ సంస్థలకు అందించారు. అలాగే చాగంటి కోటేశ్వరరావుకు కూడా తయారుచేసి ఇచ్చారు. యాభైవేల రూపాయలతో దీన్ని మొదలుపెట్టిన వీళ్లు ఇప్పుడు నెలకు తగినంత ఆదాయం అందుకుంటున్నారు.

> మాధురిది మహబూబ్ నగర్ జిల్లాలోని కొల్హాపూర్‌కి దగ్గర్లోని ఓ ఊరు. తండ్రి టీచర్. అమ్మ ఇంట్లోనే దుస్తులు కుట్టేది. వెనకబడిన ప్రాంతం కావడంతో ఆ ఊళ్లో పదో తరగతి వరకే చదువుకుంది. తల్లి నుంచి దుస్తులు కుట్టడం నేర్చుకుంది. పెళ్లయ్యాక బీఈడీ, ఎంఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేసింది. ఓసారి ఇంటికి వెళ్లినప్పుడు ఆరోగ్యంగా ఉన్న ఆవు చనిపోవడం వింది. దానికి కారణం ప్లాస్టిక్ కవర్లను మింగేయడం అని తండ్రి నుంచి తెలుసుకుని పరిష్కారం ఆలోచించాలనుకుంది. అలా ఇటువైపు వచ్చింది.
>
> సమతది కృష్ణాజిల్లా నందిగామ. బీటెక్ పూర్తిచేసి ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేసేది. పెళ్లై, బాబు పుట్టడంతో కొంత విరామం తీసుకుంది. కొన్నాళ్లయ్యాక ఓ కన్సల్టెన్సీ లోనూ చేరింది. ఇంటిని, ఆఫీసునీ సమన్వయం చేసుకోలేకపోవడంతో ఏదైనా వ్యాపారం చేయాలనుకుంది. అలా సమత కూడా ఎంఎస్‌ఎంఈలో చేరింది. అదే ఇద్దరికీ పరిచయం అయ్యేందుకు కారణమైంది. ఇద్దరూ నలభైరోజులు శిక్షణ తీసుకున్నారు. ఆ పరిచయమే కలిసి వ్యాపారం చేసేలా చేసింది.

– స్వాతి కొరపాటి

బంగారం వెండి

02న ముగింపు-క్రితం



తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,039	3,021
వెండి (గ్రా)	41.80	41.50

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	32,650	32,600	32,500	32,550	32,450	-----	32,880	32,630	32,670	32,480
ఆర్నమెంట్	30,510	30,480	30,150	30,200	30,500	-----	30,390	30,210	30,390	30,210
వెండి(కిలో)	39,300	39,500	39,600	39,600	30,300	-----	39,600	39,600	39,500	39,500

బడి కోసం సర్పంచిగా...



ఆమె లక్ష్యం కలెక్టర్ కావడం. కానీ ఊరి పరిస్థితులు చూసి లక్ష్యానికి కాస్త విరామం ఇచ్చి సర్పంచిగా బాధ్యతలు తీసుకుంది. ఇప్పుడు ఆమె ఆ జిల్లాలో తొలి యువ సర్పంచి. ఆమే పంజాబ్ బటిండా, మనఖన్నాకు చెందిన శాషందీప్‌కౌర్ సిద్ధు. ఇప్పటికే ఆమె బీఎస్సీ పూర్తిచేసి సివిల్స్ లక్ష్యంగా ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకుంటోంది. తన ఊళ్లో ఉన్నది ఒకే ఒక్క ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల. దాన్ని మూసేస్తున్నట్లు ఆ నోటా ఈ నోటా వింది. కేవలం విద్యార్థుల సంఖ్య తగ్గడమే దానికి కారణమని తెలుసుకుంది. గ్రామాల్లో పేద కుటుంబాలే ఎక్కువ. దాంతో ఆ పిల్లలు చదువుకోవడమే కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో బడిని మూసేయడం సబబు కాదని భావించింది. దానికి తాళం వేస్తే ఆ ఊరి పిల్లలంతా రాయ్‌ఖన్నాకి వెళ్లాలి. పైగా అది దూరం కూడా. దీంతో కొందరు పిల్లలు చదవడం కూడా మానేసే అవకాశాలు ఎక్కువ. అలా జరగకుండా చూడాలంటే తనే ఏదయినా చేయాలనుకుంది. ఆ సమయంలోనే ఎన్నికలు జరగడంతో తాను పోటీ చేయాలనుకుంది. గెలిస్తే తనవంతుగా ఊరికి మేలుచేయొచ్చనేది ఆమె ఆలోచన. అలా ప్రయత్నించింది.

'ఈ మధ్య జరిగిన స్థానిక ఎన్నికల్లో పోటీచేశా. ఇప్పుడు ఆ బడి మూయకుండా చూడటం నా ప్రధాన బాధ్యత. ఆ తరువాత విద్యార్థుల సంఖ్యను పెంచాలి. ఈ రెండూ అయ్యాక మురుగు నీటి వ్యవస్థను బాగుచేయడం, మంచి నీటిని శుద్ధిచేసే కేంద్రం ఏర్పాటు వంటివాటి గురించి ఆలోచిస్తా. ఇప్పుడు నా వయసు 22 ఏళ్లే కాబట్టి సివిల్స్‌కి ఇంకా సమయం ఉంది. అంతలోగా నా ఊరికి సేవ చేస్తా...' అని చెబుతుంది శాషందీప్.

నజరానా

చొక్కాలు, ఇతర దుస్తుల కాలర్ దగ్గర మరకలు పడి వదలనప్పుడు... ఆ భాగంలో కాస్త షాంపూ రాసి కాసేపయ్యాక ఉతికి చూడండి.

తీర్మానాలు తప్పకూడదంటే?

నేను ప్రతి సంవత్సరం ఇలా చేయాలి... అలా చేయాలి... అని తీర్మానించుకుంటా కానీ ఎప్పుడూ పాటించట్లేదు. కనీసం నెల కూడా అమలు చేయలేకపోతున్నా. అదొక్కటే కాదు.. ఏదీ అనుకున్నది అనుకున్నట్లుగా చేయను. దానివల్ల నేను చాలా యాంత్రికంగా జీవిస్తున్నట్టు అనిపిస్తోంది. నా మీద నాకు నియంత్రణ ఉండట్లేదు. అది రావాలంటే ఏం చేయాలి?

– ఓ సోదరి

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

ఆకాంక్షలకి, ఆచరణకీ మధ్య సమన్వయం ఎలా అనేది మీ ప్రశ్న. అయితే మీరు స్వీయ సమీక్ష చేసుకోవడం బాగుంది. మొదట మీరు మీ ఆలోచనలు ఏ స్థాయిలో ఉన్నాయన్నది పరిశీలించుకోవడం అవసరం. ప్రతి ఒక్కరికీ ఆలోచనలతోపాటు లక్ష్యాలుంటాయి. వాటిని ప్రాధాన్యతా క్రమంలో విశ్లేషించుకోవాలి. త్వరగా సాధించేదేంటీ... పెద్ద లక్ష్యం పెట్టుకుని, విడతలవారీగా చేరుకునేది ఏంటనేది చూసుకోవాలి. లక్ష్యాలను ఏర్పరచుకుంటే వాటి స్థాయిని బట్టి సాధించొచ్చు. ఈ విధంగా ప్రణాళిక వేసుకుంటూ... తదనుగుణంగా తీర్మానాలు పెట్టుకుంటే గనుక కోరుకున్నట్లుగా ఉండటం అసంభవం కాదు. ఏర్పరచుకునే లక్ష్యాలు కూడా ఎంత వాస్తవింగా ఉన్నాయన్నదీ విశ్లేషించుకోవాలి. ప్రతి మనిషికీ జీవితంలో ఏదో ఒకటి సాధించాలని ఉంటుంది. ఏవేవో చేసేయాలని అనుకుంటారు. అలా కలలు...ఆలోచనలు ఉండటం తప్పు కాదు. కానీ అవి వాస్తవికంగా ఉన్నాయా లేదా అనే స్పష్టత ముఖ్యం.

కొందరు చిన్న చిన్నవి అంటే త్వరగా లేవాలి, రోజూ నడవాలి, ఫోన్ తక్కువగా వాడాలి.. ఇలాంటి లక్ష్యాలు పెట్టుకుంటారు. ఇవి ఆచరణ సాధ్యమయ్యేవే. మన చేతుల్లో పనులే. కానీ కొందరు పెద్ద పెద్ద లక్ష్యాలను పెట్టుకుంటారు. ఆకాశానికి నిచ్చెన వేస్తుంటారు. వాటిని ఆచరించడం కష్టం కావచ్చు. కొన్నాళ్లకి ఆసక్తి పోతుంది. మీరేమన్నా ఇలాంటి పొరబాటు చేస్తున్నారేమో గమనించుకోండి. స్పష్టతతో లక్ష్యాలు పెట్టుకోండి. ఎప్పుడైనా సరే... శక్తి, ఆసక్తి, సామర్థ్యం... చుట్టూ ఉన్న పరిస్థితులు, ఆచరణ సాధ్యమయ్యే వాతావరణం... ఇలా అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ తీర్మానాలు చేసుకోవాలి. చిన్నచిన్నవయితే పట్టుదల, ప్రేరణ ఉంటే చాలు. ఆ రెండూ ఉంటే సాధించడం అసాధ్యమేమీ కాదు.

కొందరు తక్కువ స్థాయి నిర్ణయాలు తీసుకుంటారు. అంటే చాలా చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకుంటారు. అలా చేయడం వల్ల అతివిశ్వాసం పెరుగుతుంది. మనమేదో సుపీరియర్ అనే భావన కలుగుతుంది. స్థాయికి మించిన లక్ష్యాలను పెట్టుకుంటే ఆత్మన్యూనత, ఆత్మవిశ్వాసలేమి ఇబ్బంది పెడతాయి. ఇలా కాకుండా లక్ష్యం ఏదయినా సరే మధ్యస్థంగా ఉండేలా చూసుకోవాలి. వ్యక్తిగత క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి. మనల్ని మనం నిత్యం సమీక్షించుకోవాలి. అప్పుడే అనుకున్నది సాధించడం సాధ్యమవుతుంది.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.

చదువు



పైసా ఖర్చవకుండా పైలట్!

నవ యువతకు వాయుసేన అండ

యువతలో క్రేజ్ ఉన్న రక్షణ రంగ ఉద్యోగాలకు చిరునామాగా నిలుస్తోంది... ఎయిర్‌ఫోర్స్! సంఘంలో గుర్తింపు, మంచి వేతనాలు, సౌకర్యాలు.. ఇవన్నీ ఆకర్షణీయమే. ఉచితంగా పైలట్ కావడానికైనా, పదో తరగతితోనే ఎయిర్‌మెన్ ఉద్యోగం పొందటానికైనా ఇదే వేదిక. ఇంటర్ ఉంటే చాలు ఫ్లయింగ్ ఆఫీసర్ కోసం ప్రయత్నించవచ్చు. డిగ్రీ, డిప్లొమా...విద్యార్హత ఏదైనప్పటికీ అందుకు తగ్గ ఉద్యోగాలెన్నో వాయుసేనలో ఉన్నాయి. వాటిలో ప్రవేశానికి ఆరు నెలలకు ఒకసారి ప్రకటనలూ వెలువడుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం..!.

చిన్నప్పుడు విమానాన్ని ఆశ్చర్యంగా కన్నార్పకుండా చూస్తూ పెరిగినవాళ్లమే. అప్పట్లో విమానాశ్రయానికి వెళ్లడం ఒక విశేషం. తొలిసారి విమానంలో ప్రయాణించడం ఎప్పటికీ మధుర జ్ఞాపకమే. అదే విమానం నడిపే అవకాశమే వస్తే...ఎంతో సంతోషమే కదా. మరి పైలట్ శిక్షణ ఎంతో ఖర్చుతో కూడింది కదా అని ఆలోచిస్తున్నారా? మరేం ఫర్వా లేదు. ఆసక్తి, ఉత్సాహం మీ సొంతమైతే పైసా చెల్లించకుండా పైలట్ శిక్షణ పొందవచ్చు. వెంటనే ఉద్యోగంలోనూ చేరిపోవచ్చు. మామూలు విమానాలే కాదు యుద్ధ విమానాలతో ఆకాశంలో విన్యాసాలూ చేయొచ్చు. ఈ అవకాశాన్ని ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది. విమానాలు, హెలికాప్టర్లు నడపడానికి పైలట్లు, వాటి నిర్వహణ, మరమ్మతులకు టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ సిబ్బంది, ఎయిర్‌మెన్లు...ఎన్నో ఉద్యోగాలున్నాయి.

ఆకాశ మార్గంలో..

ఆఫీసర్ హోదాతో ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) విభాగాల్లో విధులు ఉంటాయి. ఫ్లయింగ్ బ్రాంచీలో ఎంపికైనవారు పైలట్‌గా సేవలు అందిస్తారు. ఇందులో ఫైటర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, హెలికాప్టర్ పైలట్లు ఉంటారు. యుద్ధ విమానాలు నడిపే వాళ్లు ఫైటర్స్. సరకు, మనుషులను తీసుకెళ్లేవారు ట్రాన్స్‌పోర్టర్లు. హెలికాప్టర్లను నడిపేవాళ్లు హెలికాప్టర్ పైలట్లు. గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ ద్వారా మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్‌లో అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, లాజిస్టిక్స్, ఎడ్యుకేషన్, మెటీరియాలజీ విభాగాలుంటాయి.

ఫ్లయింగ్ బ్రాంచ్: ఫ్లయింగ్ బ్రాంచ్(పైలట్) ఉద్యోగాలను యూపీఎస్సీ నిర్వహించే ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈలతోపాటు ఏఎఫ్ క్యాట్-ఎస్ఎస్సీ స్పెషల్ ఎంట్రీ (మెన్ అండ్ విమెన్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (మెన్) ద్వారా దక్కించుకోవచ్చు.

ఎన్డీఏ: మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసినవారు, ఆఖరి సంవత్సరం కోర్సు చదువుతున్నవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 16 1/2 - 19 1/2 ఏళ్లలోపు ఉండాలి. ఎత్తు 162.5 సెం.మీ. ఉండాలి. ఏడాదికి రెండుసార్లు జనవరి, ఆగస్టుల్లో ప్రకటన వెలువడుతుంది. ఎంపికైనవాళ్లు నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్డీఏ) పుణెలో శిక్షణతోపాటు బీటెక్ విద్య అభ్యసిస్తారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారికి జేఎన్‌యూ, న్యూదిల్లీ ఇంజినీరింగ్ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. శిక్షణ అనంతరం ఫ్లయింగ్ ఆఫీసర్ హోదా పొందుతారు.

సీడీఎస్‌ఈ: కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్‌ఈ) పేరుతో యూపీఎస్సీ ఏడాదికి రెండు సార్లు జూన్, అక్టోబరుల్లో ప్రకటన వెలువరిస్తుంది. ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ బ్రాంచ్ ఉద్యోగాలకు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదువుకున్న గ్రాడ్యుయేట్లు అర్హులు. వయసు 20 - 24 ఏళ్లలోపు ఉండాలి.

ఏఎఫ్ క్యాట్: ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్టు (ఏఎఫ్‌క్యాట్) ద్వారా ఫ్లయింగ్ బ్రాంచ్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఇందులో రెండు విభాగాల్లో పైలట్ కావచ్చు. అవి ఎస్సెస్సీ ఎంట్రీ, ఎన్సీసీ స్పెషల్ ఎంట్రీ. ఈ పరీక్షకు సంబంధించి ప్రకటనలు ఏడాదికి రెండుసార్లు వెలువడతాయి.

ఎస్సెస్సీ ఎంట్రీ: షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్సీ) విధానంలో నియామకాలు చేపడతారు. మహిళలూ ఈ విభాగానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. దీంతోపాటు ఇంటర్లో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లోనూ 60 శాతం మార్కులు తప్పనిసరి.

ఎన్సీసీ స్పెషల్ ఎంట్రీ: ఎన్సీసీ సీ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రత్యేకంగా ఎన్సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా ఫ్లయింగ్ బ్రాంచ్‌లో అవకాశం కల్పిస్తున్నారు. పురుషులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులు. కనీసం 60 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి.



ఎయిర్‌మెన్

ఇందులో గ్రూప్ ఎక్స్, గ్రూప్ వై అనే రెండు ట్రేడ్లు ఉంటాయి. వీటిలో గ్రూప్ వైలో మ్యుజీషియన్, మెడికల్ అసిస్టెంట్, ఇతర ట్రేడ్లు ఉంటాయి. గ్రూప్ ఎక్స్‌లో ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్, ఇతర ట్రేడ్లు ఉన్నాయి. పరీక్షలో ప్రతిభ, ఫిజికల్, మెడికల్ టెస్టుల ద్వారా నియామకాలు చేపడతారు.

గ్రూప్ వై

మ్యుజీషియన్: ఈ ట్రేడ్ ఉద్యోగాలకు పదో తరగతి విద్యార్హతతో పోటీ పడవచ్చు. అయితే ఏదైనా సంగీత/ వాద్య పరికరంలో ప్రావీణ్యం ఉండాలి.

మెడికల్ అసిస్టెంట్: 10+2 / ఇంటర్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు ఈ పోస్టులకు అర్హులు. ఇంగ్లిష్‌లో విడిగా 50 శాతం మార్కులు ఉండాలి. వయసు 17-21

ఇతర ట్రేడ్లు: 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులు వీటికి అర్హులు. ఆంగ్లంలో 50 శాతం మార్కులు తప్పనిసరి. వయసు 17-21 లోపు ఉండాలి.

గ్రూప్ ఎక్స్

టెక్నికల్: ఈ విభాగంలో పోస్టులకు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి. అలాగే విడిగా ఆంగ్లంలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. లేదా 50 శాతం మార్కులతో నిర్దేశిత ట్రేడుల్లో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులతో డిప్లొమా/ఇంటర్/పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్: బీఎడ్‌తోపాటు డిగ్రీ/ పీజీ అర్హతలతో ఈ పోస్టులకు పోటీ పడవచ్చు. ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా బీఏ లేదా ఫిజిక్స్ /సైకాలజీ/ కెమిస్ట్రీ /మ్యాథ్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ / కంప్యూటర్ సైన్స్/ స్టాటిస్టిక్స్ వీటిలో ఏదైనా ఒక సబ్జెక్టుతో బీఎస్సీ లేదా బీసీఏ చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత కోర్సులో 50 శాతం మార్కులు తప్పనిసరి. వీటితోపాటు 50 శాతం మార్కులతో బీఎడ్ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 20-25 ఏళ్లలోపు ఉండాలి. ఎంఏ-ఇంగ్లిష్ /సైకాలజీ లేదా ఎమ్మెస్సీ-మ్యాథ్స్ / ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా ఎంసీఏ వీటిలో ఏదైనా కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 50 శాతం మార్కులతో బీఎడ్ తప్పనిసరి. వయసు 20 - 28 ఏళ్లలోపు ఉండాలి.

గ్రౌండ్ డ్యూటీ

టెక్నికల్ బ్రాంచ్: ఈ ఉద్యోగాలన్నీ ఏఎఫ్ క్యాట్‌తోనే భర్తీ చేస్తున్నారు. ఇందులో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్ విభాగాలు ఉన్నాయి.

నాన్ టెక్నికల్ బ్రాంచ్: ఈ ఉద్యోగాలన్నీ ఏఎఫ్ క్యాట్ ద్వారా భర్తీ చేస్తారు. ఇందులో అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్, అకౌంట్స్, ఎడ్యుకేషన్, మెటీరియాలజీ విభాగాలు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు మహిళలూ అర్హులే. అయితే వీరిని షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో తీసుకుంటారు. అందువల్ల 14 ఏళ్ల తర్వాత వైదొలగాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్లు: www.careerairforce.nic.in

పూర్తి కథనం www.eenadupratibha.net లో.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ట్రైనీ సైంటిఫిక్ ఆఫీసర్లు

భారత అణుశక్తి విభాగం 2019-20 విద్యా సంవత్సరానికిగానూ బాబా అణుపరిశోధన కేంద్రం ట్రైనింగ్ స్కూల్స్ ద్వారా కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** సైంటిఫిక్ ఆఫీసర్లు **ఖాళీలున్న విభాగాలు:** ఇంజినీరింగ్, సైన్స్.
అర్హత: బీఈ/ బీటెక్/ బీఎస్సీ(ఇంజినీరింగ్)/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఎంఎస్సీ, అయిదేళ్ల ఎంటెక్, బీఎస్సీ (టెక్) ఉత్తీర్ణత. **వయసు:** 26 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** గేట్-2018/ గేట్-2019 స్కోరు (లేదా) ఆన్‌లైన్ టెస్ట్, సెలక్షన్ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేది:** 2019 మే-జూన్‌లో ముంబయి, హైదరాబాద్‌లో జరుగుతాయి. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
చివరితేది: జనవరి 31 **గేట్-2019 స్కోరు అప్‌లోడ్ చేయడానికి చివరితేది:** ఏప్రిల్ 1
వెబ్‌సైట్: http://www.barconlineexam.in/

ప్రవేశాలు

రూరల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ ప్రోగ్రాములు

ఆనంద్ (గుజరాత్)లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్ఎంఏ) కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. 1) పీజీ ప్రోగ్రామ్ ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ (2019-21)(40వ బ్యాచ్) **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** ఐఆర్ఎంఏఎస్ఏటీ, గ్రూప్ యాక్టివిటీ, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. క్యాట్-2018, గ్జాట్-2019 స్కోరు ఆధారంగా అభ్యర్థులను ఐఆర్ఎంఏఎస్ఏటీకి షార్ట్ లిస్ట్ చేస్తారు.
2) ఫెలో ప్రోగ్రామ్ ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ (18వ బ్యాచ్)
అర్హత: ఏదైనా విభాగంలో పీజీ లేదా తత్సమాన డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత సాధించి ఉండాలి. **ఎంపిక:** ప్రెజెంటేషన్ ఆఫ్ రిసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
చివరితేది: పీజీ ప్రోగ్రాముకు జనవరి 21, ఫెలో ప్రోగ్రాముకు ఫిబ్రవరి 20 **వెబ్‌సైట్:** https://www.irma.ac.in/

సీడ్యాక్, హైదరాబాద్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) కింది కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. **కోర్సు:** డిప్లొమా ఇన్ మాడర్న్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఎసెన్షియల్స్
కాలవ్యవధి: 5 నెలలు. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
చివరితేది: జనవరి 13
వెబ్‌సైట్: http://www.meghsikshak.in/cdac/dmsde

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

సీఐటీడీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టులు:** టీచింగ్ ఫ్యాకల్టీ, ఆఫీస్ అసిస్టెంట్లు **విభాగాలు:** క్యాడ్, వీఎల్ఎస్ఐ, ఎలక్ట్రికల్, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్ తదితరాలు. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, బీకాం/ బీఎస్సీ, ఎంఈ/ ఎంటెక్, ఎంఏ/ ఎంఎస్సీ, అనుభవం. **వాక్‌ఇన్ తేది:** జనవరి 5 **వేదిక:** సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, బాలానగర్, హైదరాబాద్-500037. **వెబ్‌సైట్:** https://www.citdindia.org/

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో

దరఖాస్తు చేశారా?

- సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో 25 టెక్నికల్ అసిస్టెంట్లు అర్హత: బీఎస్సీ, ఇంజినీరింగ్ డిప్లొమా, అనుభవం; చివరితేది: జనవరి 3
- ఆర్‌బీఐలో 61 ఆఫీసర్ పోస్టులు అర్హత: బీఈ/ బీటెక్/ మాస్టర్స్ డిగ్రీ, అనుభవం; చివరితేది: జనవరి 8



- ఐసీఎస్ఐఎల్, న్యూదిల్లీలో 212 కాంట్రాక్టు పోస్టులు అర్హత: పదోతరగతి, అనుభవం; చివరితేది: జనవరి 8
- ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 2100 కాంట్రాక్టు పోస్టులు అర్హత: ఐటీఐ, డిప్లొమా, బీఈ/ బీటెక్; చివరితేది: జనవరి 5
- వెస్టర్న్ రైల్వేలో 3553 అప్రెంటిస్ ఖాళీలు అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ; చివరితేది: జనవరి 9

గ్రాఫిక్ డిజైన్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: JALA Technologies
ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ. 6000-రూ. 12,000
లింకు: internshala.com/i/17090
గడువు: జనవరి 9, 2019 **అర్హులు:** జావా, పైథాన్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: Mobigesture software
ప్రదేశం: హైదరాబాద్ **స్టైపెండ్:** నెలకు రూ. 12,000 **లింకు:** internshala.com/i/17091
గడువు: జనవరి 9, 2019 **అర్హులు:** జావా, పీహెచ్‌పీ, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, సీ ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు ఉన్నవారు.

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: Adieued **ప్రదేశం:** హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 7,500
లింకు: internshala.com/i/17092
గడువు: జనవరి 10, 2019
అర్హులు: అడొబ్ ఫొటోషాప్, అడొబ్ క్రియేటివ్ సూట్, అడొబ్ ఇన్‌డిజైన్, అడొబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, అడొబ్ ఫొటోషాప్ లైట్ రూమ్ సీసీ నైపుణ్యాలు ఉన్నవారు.

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: Msoft Web Technologies
ప్రదేశం: హైదరాబాద్ **స్టైపెండ్:** నెలకు రూ. 4000 **లింకు:** internshala.com/i/17093
గడువు: జనవరి 10, 2019
అర్హులు: హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్ నైపుణ్యాలు ఉన్నవారు.

ఆపరేషన్స్

సంస్థ: Maple integration **ప్రదేశం:** హైదరాబాద్ **స్టైపెండ్:** నెలకు రూ. 4000
లింకు: internshala.com/i/17094
గడువు: జనవరి 8, 2019
అర్హులు: ఎంఎస్ ఆఫీస్, ఈమెయిల్ మార్కెటింగ్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు ఉన్నవారు.

మొబైల్ ఆప్ డెవలప్‌మెంట్

సంస్థ: Cuetin **ప్రదేశం:** హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 6000-రూ. 7000
లింకు: internshala.com/i/17095
గడువు: జనవరి 9, 2019
అర్హులు: జావా, పీహెచ్‌పీ, ఎక్స్‌ఎంఎల్, జేఎస్ఓఎన్, ఆండ్రాయిడ్ నైపుణ్యాలు ఉన్నవారు.

కస్టమర్ సర్వీస్

సంస్థ: Storytech **ప్రదేశం:** హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 12,000
లింకు: internshala.com/i/17096 **గడువు:** జనవరి 10, 2019 **అర్హులు:** ఎంఎస్ ఆఫీస్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

టెలికాలింగ్

సంస్థ: Effusion **ప్రదేశం:** హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 12,000
లింకు: internshala.com/i/17097
గడువు: జనవరి 10, 2019 **అర్హులు:** తెలుగు, హిందీ, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు **www.eenadupratibha.net** చూడవచ్చు.

ఇంగ్లిష్ మీడియం తప్పనిసరా?

ఇంటర్మీడియట్ (ఎంపీసీ) మొదటి సంవత్సరం తెలుగు మీడియంలో చదువుతున్నాను. ఐఐటీ జేఈఈ రాయాలంటే ఇంగ్లిష్ మీడియంలో చదివుండటం తప్పనిసరా? ఒకవేళ అయితే రెండో ఏడాది ఇంగ్లిష్ మీడియంలో చేస్తే నాకు అవకాశం ఉంటుందా? - ఎం. రోహిత్ పట్నాయక్



మీరు ఊహిస్తున్నట్లుగా ఏం లేదు. నేను తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియంలో చదవలేదు కాబట్టి జేఈఈ రాయలేనేమో అన్న భయాన్ని వీడండి. ఎందరో విద్యార్థులు మన తెలుగు రాష్ట్రాల నుంచి తెలుగు మాధ్యమంలో +2 చదివి, ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధించారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉన్నప్పటికీ, పరీక్ష ఉద్దేశం విద్యార్థికి సబ్జెక్టుపై ఎంత పట్టు ఉందో పరీక్షించడమే! అయితే పరీక్షకు సన్నద్ధమయ్యేటపుడు మాత్రం ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేలా తెలుగు, ఇంగ్లిష్ రెండు భాషల పుస్తకాలనూ పక్కన పెట్టుకోండి. దీనికన్నా రెండో ఏడాది ఆంగ్ల మాధ్యమంలో చదవడం మేలని మీరు భావించినా ఆ వీలు లేదు. సబ్జెక్టుపై పట్టు సాధిస్తేనే ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానంతో విజయాన్ని సాధించవచ్చు. కాబట్టి, ఆ దిశగా దృష్టిసారించండి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

TG

త్రీడీ ముద్రితం.. ఎముకకు రూపం!

- సిరామిక్, పాలిమర్స్ కలిపి 'స్మార్ట్ మెటీరియల్' రూపకల్పన
- ఐఐటీ హైదరాబాద్ వేదికగా సరికొత్త ఆవిష్కరణ

ఈనాడు - సంగారెడ్డి

రహదారి ప్రమాదాల్లో ముఖానికి తీవ్ర గాయాలై ఎముకలు విరిగినప్పుడు బాధితులు ఇబ్బందులు పడుతుంటారు. దెబ్బతిన్న ముఖాకృతిని సరిదిద్దడానికి ఎన్నో శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుంది. పైగా ఫలితం ఆశాజనకంగా ఉండదు. ముఖాకృతి మునుపటిలాగా ఉండకపోవడంతోపాటు ఇన్ఫెక్షన్లూ బాధిస్తాయి. కొన్నిసార్లు క్యాన్సర్ కారణంగా దవడ ఎముకలోని కొంత భాగం తీసేయాల్సి వస్తుంది. అప్పుడూ ముఖాకృతి దెబ్బతింటుంది. ఇలాంటి వారికి ప్రయోజనం చేకూర్చేలా హైదరాబాద్ ఐఐటీ వేదికగా పరిశోధకులు నూతన ఆవిష్కరణకు రూపమిచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటికంటే మెరుగైన పదార్థం(మెటీరియల్)ను కనిపెట్టారు. సిరామిక్, పాలిమర్స్‌ను కలిపి తాము రూపొందించిన 'స్మార్ట్ మెటీరియల్' బాధితులకు వరంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఏవైనా అనూహ్య ఘటనల కారణంగా శరీరం నుంచి ఎముకలను తీసేయడం, సరిచేయాల్సి వస్తే...ప్రస్తుతం అదే వ్యక్తి శరీరంలో ఇతర చోట నుంచి ఎముకను సేకరిస్తున్నారు. దాన్ని దెబ్బతిన్న భాగంలో అమర్చుతున్నారు. ఇంతచేసినా అక్కడ సరిగ్గా సరిపోదు. మునుపటి ఆకృతిని తీసుకురావడమూ కష్టమవుతోంది. కృత్రిమంగా బోన్ గ్రాఫ్టింగ్ విధానంలో ప్రస్తుతం సిరామిక్ పదార్థాన్ని ఉపయోగించి పాడైపోయిన ఎముకల స్థానంలో అమర్చుతున్నారు. ఈ క్రమంలో ఎక్కువసార్లు శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తోంది. పైగా చాలా సందర్భాల్లో విరిగిన రెండు ఎముకలను అనుసంధానించడానికి లోహాలను వాడుతుంటారు. వీటికంటే మెరుగైన విధానాన్ని కనిపెట్టి బాధితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలనే లక్ష్యంతో పరిశోధకులు ఈ బయో ఆక్టివ్ ఫిలమెంట్(స్మార్ట్ మెటీరియల్)ను అభివృద్ధి చేశారు. సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ వైద్య కళాశాలలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.విజయ్‌కుమార్ ఈ ఆవిష్కరణలో కీలక భూమిక పోషించారు. ఇదే అంశమై ఐఐటీలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయనకు ఐఐటీకి చెందిన డాక్టర్ సుబా నారాయణ్ రథ్, డాక్టర్ ఫాల్గుణిపతితో పాటు పరిశోధక విద్యార్థి(రీసెర్చ్ స్కాలర్) శిబు, ఎంటెక్ విద్యార్థి రాఘవ్ సహకారం అందిస్తున్నారు.

త్రీడీ ప్రింటర్‌తో ముద్రించేస్తారు

సిరామిక్, పాలిమర్స్‌తో పాటు శరీరానికి హానికరం కాని కొన్ని రసాయనాలను కలిపి వీరు ఈ మెటీరియల్‌ను తయారు చేశారు. తొలగించిన, దెబ్బతిన్న ఎముక ఆకృతిని ముందే తీసుకొని దాని ప్రకారమే త్రీడీ ప్రింటర్ సాయంతో కృత్రిమ ఎముకను రూపొందిస్తారు. దీనిని సరిగ్గా తొలగించిన ఎముక స్థానంలో అమర్చుతారు. నూటికి నూరుశాతం ముఖ ఆకృతి మునుపటితో సరిపోలడంతోపాటు అసలు కృత్రిమ ఎముకను తన శరీరంలో ఉంచారనే విషయమూ బాధితుడు కనిపెట్టలేని విధంగా ఫలితాలు ఉంటాయంటున్నారు ఆవిష్కర్తలు. పాలిమర్స్ క్రమంగా కరిగిపోతూ సిరామిక్ ఎముక మాదిరిగా మారిపోవడమే ఇందుకు కారణమంటున్నారు. ఈ ఆవిష్కరణకు సంబంధించి పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో 'త్రీడీ స్కెలిటన్ ప్రైవేటు లిమిటెడ్' పేరుతో మూడు నెలల క్రితం అంకుర సంస్థనూ ప్రారంభించారు. ఈ పరిశోధన చేయడానికి గాను విజయ్‌కుమార్‌కు ప్రధానమంత్రి ఫెలోషిప్ లభించింది.


తాము రూపొందించిన 'స్మార్ట్ మెటీరియల్' పనితీరును వివరిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

అతి త్వరలో విపణిలోకి

మేం ఏడాదిన్నరగా ఈ అంశమై పరిశోధనలు సాగిస్తున్నాం. సిరామిక్, పాలిమర్లను విడివిడిగా చికిత్సల సమయాల్లో కొన్నేళ్లుగా వాడుతున్నారు. మేం ఈ రెండింటినీ ఉపయోగించి ఈ స్మార్ట్ మెటీరియల్‌ను అభివృద్ధి చేశాం. వీలైనంత త్వరగా మార్కెట్లోకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. జంతువులపై ప్రయోగాలు పూర్తికావస్తున్నాయి. ఇప్పటి వరకు మంచి ఫలితాలు వచ్చాయి. వెన్నెముక గాయాలు, డెంటల్ బోన్ గ్రాఫ్టింగ్, ఫేషియల్ సర్జరీలు ఇలా అన్నింటిలోనూ ఈ మెటీరియల్‌ను వాడుకోవచ్చు. దీనిని చవకగా అందుబాటులోకి తెచ్చే అంశంపైనా మేం దృష్టిసారించాం.

- డాక్టర్ ఎన్.విజయ్‌కుమార్


బుధవారం హైదరాబాద్‌లో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసిన సినీనటుడు ప్రకాశ్‌రాజ్

ప్రకాశ్‌రాజ్‌కు కేటీఆర్ మద్దతు

- రాజకీయ ప్రవేశం మంచి నిర్ణయమని అభినందన
- శాసనసభ ఎన్నికల్లో తెరాసకు మద్దతుపై ధన్యవాదాలు
- కృతజ్ఞతలు తెలిపిన ప్రకాశ్‌రాజ్
- సమాజ హితానికే రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాజకీయాల్లోకి ప్రవేశించి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ తీసుకున్న నిర్ణయానికి తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. చక్కటి నిర్ణయం తీసుకున్నారంటూ అభినందించారు. ఆయనకు అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కర్ణాటక నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన ప్రకాశ్‌రాజ్ బుధవారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతోపాటు తన నిర్ణయాన్ని వెల్లడించారు. కేటీఆర్ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ధైర్యంగా ముందుకొచ్చి తమకు మద్దతు ఇచ్చినందుకు ప్రకాశ్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణాత్మకంగా, నిక్కచ్చిగా వ్యవహరించే ప్రకాశ్‌రాజ్ లాంటి వ్యక్తులు ప్రస్తుతం రాజకీయాలకు అవసరమని, వారితోనే ప్రక్షాళన సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. కేటీఆర్ మద్దతు తన రాజకీయ ప్రవేశానికి స్ఫూర్తినిచ్చిందంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ ద్వారా కొత్త ఆరంభానికి తాను సిద్ధమవుతున్నానని చెప్పారు. సమాజ హితం కోసమే తాను రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నానని, ఎవరికో వ్యతిరేకంగా కాదని ఆయన తెలిపారు.

సిరిసిల్లలో నేడు కేటీఆర్ పర్యటన

తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం తన సొంత నియోజకవర్గమైన సిరిసిల్లలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30కి ఆయన ఎల్లారెడ్డిపేట మండలంలో, 1.30కి గంభీరావుపేటలో, 2.30కి ముస్తాబాద్‌లో, 3.30కి సిరిసిల్లలో పర్యటిస్తారు. అనంతరం పార్టీ నియోజకవర్గ నేతల సమావేశంలో పాల్గొంటారు.

యూజీసీ వేతనాల నివేదిక నేడు ఖరారు

ఈనాడు, హైదరాబాద్: వేతనాల అమలుపై ఏడో కేంద్ర వేతన సంఘం (సీపీసీ) రాష్ట్ర కమిటీ రూపొందించిన నివేదికను గురువారం ఖరారు చేయనున్నారు. యూజీసీ వేతనాలు అందుకునే ఆచార్యులు, అధ్యాపకులకు ఈ వేతన సంఘం సిఫార్సులను వర్తింపచేస్తారు. వేతనాలు పెంచడంతోపాటు ఆచార్యుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలని అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ముసాయిదా నివేదికలో కమిటీ సిఫార్సు చేసింది. దానిపై కొన్ని మార్పులను సూచించిన నేపథ్యంలో గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాస్ కన్వీనర్‌గా ఉన్న కమిటీ సమావేశమై నివేదికను ఖరారు చేయనుంది. అనంతరం తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారికి 15శాతం వేతనాలు, పింఛనుదార్లకు 10-12శాతం పింఛను పెరుగుతుందని అంచనా వేశారు. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో కలిపి దాదాపు 3 వేల మంది బోధనా సిబ్బంది ఉన్నారు. అంతే సంఖ్యలో పింఛనుదారులు ఉన్నారు. వారికీ వేతనాల పెంపు వర్తిస్తుంది. మార్చి లోపు సీపీసీని అమలు చేయకుంటే పెరిగిన వేతనాల భారంలో కేంద్ర ప్రభుత్వం మూడేళ్లపాటు ఇచ్చే నిధులు 50 శాతం దక్కవు. ఈ క్రమంలో త్వరితగతిన ముఖ్యమంత్రి ఆమోదం తీసుకొని జీవో జారీ చేయాలని భావిస్తున్నారు.

ఫిబ్రవరిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్

- కసరత్తు ప్రారంభించిన రాష్ట్ర ఆర్థికశాఖ
- శాఖల నుంచి ప్రతిపాదనల స్వీకరణ
- కేంద్ర బడ్జెట్ తర్వాతే పూర్తి స్థాయిలో..

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తరహా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఫిబ్రవరి ఆఖరి వారం లేదా మార్చి మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు విడుదల కానున్న నేపథ్యంలో అంతకుముందే శాసనసభ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించనుంది. దీంతో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఒకటి నుంచి మూడు రోజుల్లోనే ముగిసే అవకాశం ఉంది.

2018-19వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను గత ఏడాది మార్చిలో ఆమోదించింది. ఈ ఏడాది మార్చి 31 వరకూ ఇది అమల్లో ఉంటుంది. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త బడ్జెట్ అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆమోదించనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కూడా 2019-20వ సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కొత్త శాసనసభ ఏర్పాటవడంతో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రాష్ట్రానికి అవకాశం ఉంది. అయితే కేంద్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకపోతే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు ఎంతనేది స్పష్టత ఉండదు. దీంతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో దీనిపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది.

మొదలైన కసరత్తు

రాష్ట్రంలో 2019-20వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైంది. గతేడాది కేటాయింపుల ప్రాతిపదికగా శాఖలన్నీ ఈ ఏడాది బడ్జెట్ పద్దులను సిద్ధం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలకు కొరత లేకుండా బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించాలని ఉన్నతాధికారులు శాఖాధిపతులకు స్పష్టం చేశారు. ఈ మేరకు శాఖలు ఆర్థిక శాఖకు ఆన్‌లైన్‌లో బడ్జెట్ ప్రతిపాదనలు పంపుతున్నాయి. ఈ నెల రెండో వారంలోపు వీటికి తుదిరూపు ఇవ్వడానికి ఆర్థిక శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

కేంద్ర సాయంలో వచ్చింది 18 శాతమే

కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్‌ఎయిడ్‌ల ద్వారా రావాల్సిన నిధుల్లో నవంబరు నెలాఖరు వరకు 18 శాతమే వచ్చాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి లక్ష్యంలో నవంబరు నాటికే 75 శాతం చేరుకోవడం విశేషం.

నవంబరు వరకూ రాబడుల తీరిదీ..

రాబడులు	బడ్జెట్ అంచనాలు (రూ.కోట్లలో)	వచ్చిన రాబడి (రూ.కోట్లలో)	శాతం
జీఎస్టీ	34,232	18,964	55
స్టాంపులు, రిజిస్ట్రేషన్ రాబడి	4,700	3,557	75
అమ్మకం పన్ను	25,942	12,264	47
ఎక్సైజ్ డ్యూటీ	10,600	6,643	62
కేంద్ర పన్నుల వాటా	12,514	8,510	68
పన్నేతర రాబడి	8,973	2,993	33
గ్రాంట్ ఇన్ ఎయిడ్	29,041	5,376	18

మహాకూటమికి ఏపీలోనూ భంగపాటే

- రాష్ట్ర పాలనలో కుంభకోణాలు
- కేంద్రంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- భాజపాతోనే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు తీరతాయి
- బూత్ స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ



ఈనాడు, అమరావతి, విశాఖ, విజయనగరం: ఆంధ్రప్రదేశ్ మార్పును కోరుకుంటోందని, తెలంగాణలో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ మహాకూటమిని ప్రజలు తిరస్కరించబోతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. పాలనలో కుంభకోణాలున్నాయని ఆరోపించారు. నాడు కాంగ్రెస్‌ను తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ దుష్ట కాంగ్రెస్ అని అభివర్ణించగా...ఇప్పుడు తెదేపా నేతలు దోస్త్ కాంగ్రెస్ అంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తున్న కేంద్రంపై వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టాలని భాజపా కార్యకర్తలకు సూచించారు. దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సాయంత్రం మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్ బూత్ కార్యకర్తల (మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్)ను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

"రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌తో తెదేపా చేతులు కలపడంవల్ల తెలంగాణలో ఏమీ జరిగిందో మీ అందరికీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే మాదిరిగా జరగబోతుంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా కృషి చేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా పది జాతీయ సంస్థలను ఏపీలో కేంద్రం ఏర్పాటు చేసింది. గతంలో ఇలా ఏ కేంద్ర ప్రభుత్వం చేయలేదు. తెదేపా ప్రభుత్వం మాత్రం అసత్యాలు ప్రచారం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతుందో నాకు తెలుసు. భాజపా ప్రభుత్వం తప్పు చేయదు. ఎప్పుడూ సత్యమే చెబుతుంది. రాష్ట్రానికి తగిన సాయం అందిస్తున్నా చేయడం లేదని చెబుతుండడం తగదు. ఈ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టేలా బూత్ స్థాయి నుంచి ప్రజలకు వివరించాలి. రెవెన్యూ లోటు, వనరుల కొరతను అధిగమించేందుకు రూ.20వేల కోట్ల వరకు కేంద్రం విడుదల చేసింది. కానీ..రాష్ట్ర ప్రభుత్వం అందలేదని చెబుతోంది. ఈ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్లింది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లు కేంద్రం ఇచ్చింది. వీటికి తగినట్లు వినియోగ ధ్రువపత్రాలు(యూసీ)లు ఎందుకు ఇవ్వలేదు? రాష్ట్ర పాలనలో కుంభకోణాలు జరుగుతున్నాయి.

పోలవరం ప్రాజెక్టుపై

పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన ప్రతి పైసాను కేంద్రమే భరిస్తోంది. ఇప్పటి వరకు రూ.7వేల కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఈ ప్రాజెక్టును రాష్ట్రం సక్రమంగా నిర్వహించలేకపోతున్నట్లు కాగ్ పేర్కొంది. నిధులు దుర్వినియోగమవుతున్నాయని భావించే లెక్కలు అడుగుతున్నాం.

భద్రతకు ప్రాధాన్యం

సరిహద్దుల వెంబడి మెరుపుదాడులతో(సర్జికల్ స్ట్రైక్స్) తీవ్రవాదాన్ని నియంత్రించాం. సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 12 సంవత్సరాలలోపు బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డ వారికి ఉరిశిక్ష విధించాలని తీసుకున్న నిర్ణయం మహిళల భద్రతకు మేం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం'' అని మోదీ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై పగబట్టారు

- బ్రిటిష్ పాలకుల్లా మోదీ విభజించి పాలిస్తున్నారు
- నంద్యాల నమూనానే తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ అనుసరించారు
- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తెదేపాపైనా, రాష్ట్రంపైనా దుష్టశక్తులు కక్షగట్టాయని, పార్టీ నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "కేసుల మాఫీకి జగన్‌కు అధికారం కావాలి. అందుకే మోదీ, కేసీఆర్‌లతో జట్టు కట్టారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిపై మనం పోరాడుతుంటే, జగన్ వెళ్లి వాళ్లతోనే కలిశారు. మోదీ, జగన్, కేసీఆర్ ముగ్గురూ ఆంధ్రప్రదేశ్‌పై పగబట్టారు. కుట్రలు చేస్తున్నారు. ముగ్గురు మోదీలతో మనం పోరాటం చేస్తున్నాం..'' అని వెల్లడించారు. బ్రిటిష్ పాలకుల్లా...



ప్రధాని మోదీ విభజించి పాలించు సూత్రాన్ని పాటిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను ఆయనే రెచ్చగొట్టి ఆంధ్రప్రదేశ్‌లోని పత్రికల్లో ప్రకటనలు ఇప్పించారన్నారు. బుధవారం తెదేపా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర నాయకులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల ఉపఎన్నికలకు ముందే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ ప్రజలకు చేరేలా చేయడం వల్ల తెదేపా ఘనవిజయం సాధించిందని చెబుతూ... తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ నంద్యాల నమూనానే అనుసరించి గెలిచారన్నారు. దేశం మొత్తం అనేక విషయాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అనుసరిస్తోందన్నారు. జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే నాయకులంటూ తనతో సహా ఐదుగురి ఫొటోలతో రాజస్థాన్ పత్రికలో ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు.

పవన్ మాతో కలిసి పోరాడాలి

'ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశవ్యాప్తంగా ఎవరు కలిసివస్తారో వారిని కలుపుతూ ముందుకు వెళతాం. పవన్‌కల్యాణ్ కూడా మోదీ రాష్ట్రానికి అన్యాయం చేశారని చెప్పారు. ఆయన వేసిన నిజనిర్ధారణ కమిటీలో రాష్ట్రానికి రూ.70వేల కోట్లు రావాలని తేల్చారు. ఆయన కూడా మాతో కలిసి కేంద్రంపై పోరాటానికి రావాలి...' అని కుప్పం నియోజకవర్గంలో 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించిన సందర్భంగా చంద్రబాబు పిలుపునిచ్చారు.

తలాక్‌లో ఒకలా... శబరిమలలో ఒకలా!

మత వ్యవహారాల్లో భాజపా జోక్యం మితిమీరుతోందని చంద్రబాబు ధ్వజమెత్తారు. ముమ్మారు తలాక్ విషయంలో ఒకలా... శబరిమలలో మరోలా కుట్రలు చేస్తోందన్నారు. ముస్లిం కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, భాజపా కుట్రల్ని తిప్పికొట్టాలని సూచించారు.

సింగరేణి ఈడీగా అల్విన్ బాధ్యతలు

ఈనాడు, హైదరాబాద్: సింగరేణి సంస్థలో కార్యనిర్వాహక సంచాలకుడి(ఈడీ)గా డాక్టర్ జె.అల్విన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకాలం రైల్వేశాఖలో సీనియర్ డివిజనల్ మేనేజర్‌గా పనిచేశారు. ఎంబీబీఎస్ చదివిన ఆయన రైల్వేశాఖ ఉద్యోగంలో చేరారు. డిప్యుటేషన్‌పై సింగరేణికి వచ్చారు.

- సింగరేణి సంస్థ ప్రజా సంబంధాల విభాగం నిర్వహిస్తున్న సామాజిక మాధ్యమాలన్నీ సంస్థ వెబ్‌సైట్‌లో ఒకే చోట కనపడేలా ఏర్పాటుచేసినట్లు తెలిపింది. సంస్థ కార్యక్రమాలన్నీ అక్కడ చూడవచ్చని సూచించింది.

పీఆర్‌సీపై నేడు టీజీవోలతో చర్చలు

ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలతో పీఆర్‌సీ ఛైర్మన్ బిస్వాల్, సభ్యులు రఫత్‌అలీ, ఉమామహేశ్వర్‌రావులు గురువారం చర్చలు జరపనున్నారు. పీఆర్‌సీపై వివిధ సంఘాలతో చర్చలు ప్రారంభించిన కమిషన్ టీజీవోలను చర్చలకు ఆహ్వానించింది. ఇప్పటికే టీజీవోల ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పీఆర్‌సీకి ఈ సంఘం నివేదిక ఇచ్చింది. చర్చల్లో సంఘం అధ్యక్షురాలు మమత, సత్యనారాయణ పాల్గొంటారు.

రహదారి విస్తరణకు భూములివ్వం

- ఖమ్మంలో రైతుల ధర్నా
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

ఖమ్మం మయూరిసెంటర్, న్యూస్‌టుడే: ఖమ్మం- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఖమ్మం నగరంలోని ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఆ భూములు తమకు వంశపారంపర్యంగా వచ్చాయని, మూడు పంటలు పండే వాటిని రోడ్డు కోసం ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ కాదని, కొత్తగా అలైన్‌మెంట్ ఇవ్వడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, ఆలిండియా కిసాన్ కాంగ్రెస్ సమన్వయకర్త ఏకే రామారావులు హాజరయ్యారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పొంగులేటి మాట్లాడుతూ ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందించి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. ధర్నా చేస్తుండగానే మరోవైపు తమ భూముల్లో అధికారులు సర్వే చేస్తున్నారని రైతులకు సమాచారం అందడంతో వారు జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్‌తో మాట్లాడిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అన్నదాతలు ఆందోళన విరమించారు.


ఖమ్మంలో కలెక్టరేట్ ఎదుట రహదారిపై బైఠాయించిన రైతులు

గురుకుల పోస్టులకు 1:2 నిష్పత్తి జాబితా

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో పీజీటీ, టీజీటీ పోస్టుల రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థుల 1:2 నిష్పత్తి జాబితా సిద్ధమైంది. రెండు మూడు రోజుల్లో జాబితాను వెల్లడించాలని గురుకుల బోర్డు భావిస్తోంది. జాబితా వెల్లడైన వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించనుంది. ఈ మేరకు అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలంటూ సూచిస్తోంది.

వీఆర్వో అభ్యర్థులు ఏడోతేదీ లోగా ఐచ్ఛికాలు ఇవ్వాలి

గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 7వ తేదీలోగా జిల్లా వారీగా ప్రాధాన్యత క్రమం ఐచ్ఛికాలు(ఆప్షన్లు) ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ కోరింది. ఈ మేరకు వెబ్‌సైట్లో ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు కొల్లగొట్టారు

- తప్పుడు లేఖలతో నిధుల మళ్లింపు
- ఎస్‌బీహెచ్ విశ్రాంత అధికారిపై సీబీఐ కేసు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వివిధ ప్రభుత్వశాఖల నిధులను ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించి తప్పుడు లేఖల ద్వారా వాటిని కొల్లగొట్టిన కేసులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్) మెహిదీపట్నం బ్రాంచి విశ్రాంత ఛీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ కామరాజు తదితరులపై హైదరాబాద్ సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. మంత్రిప్రగడ బలరాం అనే వ్యక్తి 2015 మే నెలలో మెహిదీపట్నం ఎస్‌బీహెచ్ శాఖకు వచ్చి ఖాతా తెరిచేందుకు అవసరమైన వివరాలు అడిగాడు. కామరాజుతో పరిచయం పెంచుకున్నాడు. తనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చాలా పలుకుబడి ఉందని, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ)చేయిస్తానని నమ్మించాడు. అలాగే వివిధ ప్రభుత్వ సంస్థల ద్వారా చక్రం తిప్పాడు. తిమ్మినిబమ్మిని చేశాడు. సింగపూర్ టౌన్‌షిప్‌లోని ఎస్‌బీహెచ్‌లో ఉన్న ఎఫ్‌డీ డబ్బులు తమ అనుమతి లేకుండా మూడో వ్యక్తికి (థర్డ్‌పార్టీ) చెల్లించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి (ఏపీఎస్‌హెచ్‌సీఎల్) అధికారులు గుర్తించారు. మెహిదీపట్నంలోని ఎస్‌బీహెచ్ ప్రధాన బ్రాంచిని సంప్రదించారు. దాంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల వ్యవహారంలో ఏదో జరిగిందని గుర్తించిన బ్యాంకు అధికారులు అన్నింటినీ పరిశీలించారు. దాంతో బండారం బయటపడింది. ఉన్నతాధికారుల పరిశీలనలో ఇలా మొత్తం రూ.7.92 కోట్లు కొల్లగొట్టినట్లు వెల్లడైంది. బలరాం తదితరులు తప్పుడు లేఖలు సృష్టించి డబ్బు తమ ఖాతాల్లోకి జమ చేయించుకున్నారని, ఇందుకు కామరాజు వంతపాడాడని, ఆ లేఖలు అసలువేనా లేక నకిలీవా అన్న విషయం పరిశీలించలేదని అంతర్గత దర్యాప్తులో వెల్లడైంది.

వర్సిటీల పరిశీలనకు కమిటీ నియామకం

గవర్నర్ నరసింహన్ ఆరు నెలలకు ఒకసారి సమీక్షించి తీర్మానిస్తున్న అంశాలపై విశ్వవిద్యాలయాలను సందర్శించి పురోగతిని పరిశీలించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఓ కమిటీని నియమించింది. కమిటీలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఆర్.లింబాద్రి, వెంకటరమణ, మరో ముగ్గురు విద్యామండలి పాలకవర్గం సభ్యులు ఉన్నారు. వారు సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఉన్న 11 విశ్వవిద్యాలయాలను స్వయంగా పరిశీలిస్తారు.

ప్రవేశ పరీక్షల తేదీలు రేపు ఖరారు

ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఏడు రకాల ప్రవేశ పరీక్షల తేదీలను ఈ నెల 4న ఖరారు చేయనున్నారు. ఏ ప్రవేశ పరీక్షను ఏ విశ్వవిద్యాలయానికి ఇవ్వాలన్నది కూడా ఆరోజే నిర్ణయిస్తామని ఛైర్మన్ పాపిరెడ్డి తెలిపారు.

సెన్సెక్స్ ▼ 363 **35892**

నిఫ్టీ ▼ 118 **10793**

డోజోన్స్ 23363 ▲ 35

నాస్‌డాక్ 6674 ▲ 39

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 70.18 ▼ 75 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 55.90 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)


నిఫ్టీ	2న	మార్పు%
SUN PHARMA	440.05	1.50
TCS	1923.30	1.08
ASIAN PAINTS	1383.30	0.86
BHARTI INFRATEL	264.25	0.76
INFOSYS	669.05	0.60
TITAN COMPANY	932.15	0.45
UPL	756.50	0.40

గ్రహణం (-)


నిఫ్టీ	2న	మార్పు%
EICHER MOTORS	21162.30	-8.76
JSW STEEL	288.70	-5.02
VEDANTA	193.15	-4.43
TATA STEEL	493.65	-4.29
M & M	741.70	-4.09
HINDALCO	214.55	-3.68
GAIL (INDIA)	350.30	-3.27

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.35	73.46	బహ్రెయిన్ దీనార్	171.47	196.19
పౌండ్ స్టెర్లింగ్	80.64	93.51	కువైట్ దీనార్	189.74	236.27
యూరో	72.52	84.11	ఒమన్ రియాల్	167.79	192.21
జపనీస్ యెన్/100	57.91	67.17	సౌదీ రియాల్	16.85	19.96
ఆస్ట్రేలియా డాలరు	44.42	51.40	యూఏఈ దిర్హమ్	17.24	20.15
సింగపూర్ డాలరు	46.39	54.94	మలేషియా రింగిట్	14.99	18.43
థాయ్ బాత్/100	195.48	233.71	చైనీస్ యువాన్	7.18	11.67



లోహ, వాహన షేర్లు పడేశాయ్

- అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- సెన్సెక్స్‌కు 363 పాయింట్ల నష్టం



సమీక్ష

లోహ, వాహన, బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు ప్రభావం చూపాయి. చైనా మందగమన ఆందోళనలతో ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దేశీయంగా చూస్తే డిసెంబరు వాహన విక్రయాలు నిరాశపరచడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణత, జీఎస్‌టీ వసూళ్లు తగ్గడం సైతం ఇందుకు తోడయ్యాయి. డాలరుతో పోలిస్తే 75 పైసలు తగ్గి 70.18 వద్ద రూపాయి ముగిసింది. ఐరోపా మార్కెట్లు నీరసంగానే కదలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 36,198.13 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఒకానొకదశలో 35,734.01 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివర్లో స్వల్పంగా కోలుకుని 363.05 పాయింట్ల నష్టంతో 35,891.52 పాయింట్ల దగ్గర ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 117.60 పాయింట్లు కోల్పోయి 10,792.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,735.05- 10,895.35 పాయింట్ల మధ్య కదలాడింది.

జెట్ ఎయిర్‌వేస్ ధమాల్: ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియంకు రుణాల వాయిదా చెల్లించడంలో విఫలం కావడంతో జెట్ ఎయిర్‌వేస్ షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 7.13 శాతం కోల్పోయిన షేరు రూ.261 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 6.16 శాతం నష్టంతో రూ.263.75 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.195.87 కోట్లు తగ్గి రూ.2,996.13 కోట్లకు చేరింది.

- డిసెంబరులో అమ్మకాలు క్షీణించడంతో ఐషర్ మోటార్స్ షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 9.42 శాతం పడ్డ షేర్లు.. చివరకు 8.71 శాతం తగ్గి రూ.21,164.05 దగ్గర స్థిరపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి. వేదాంతా 4.48%, టాటా స్టీల్ 4.21%, ఎం అండ్ ఎం 4.15%, టాటా మోటార్స్ 2.91%, మారుతీ సుజుకీ 2.74%, హీరో మోటోకార్ప్ 2.64%, పవర్‌గ్రిడ్ 2.25%, భారతీ ఎయిర్‌టెల్ 2.11%, ఎస్‌బీఐ 1.84%, కోల్ ఇండియా 1.70%, హెచ్‌సీఎల్ టెక్ 1.68% చొప్పున డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 1.66%, టీసీఎస్ 1.09%, ఏషియన్ పెయింట్స్ 0.71%లు రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో లోహ, వాహన షేర్లు 3 శాతం వరకు పడ్డాయి. బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, మన్నికైన వినిమయ వస్తువులు, పీఎస్‌యూ షేర్లు అదే బాటలో నడిచాయి. బీఎస్‌ఈలో 1637 షేర్లు ప్రతికూలంగా, 923 స్క్రిప్‌లు సానుకూలంగాను ముగిశాయి. 157 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

నేటి మార్కెట్

సూచీల నష్టాలు కొనసాగొచ్చు. డిసెంబరులో చైనా తయారీ కార్యకలాపాలు క్షీణించడంతో అంతర్జాతీయ వృద్ధి భయాలు పెరగడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అమెరికాతో నడుస్తున్న వాణిజ్య ఉద్రిక్తతల వల్ల డిమాండ్ తగ్గి, మందగమనం ఏర్పడిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశీయంగా చూస్తే.. బలహీన వాహన విక్రయ గణాంకాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఎన్‌బీఎఫ్‌సీల నగదు లభ్యత సమస్య, రాజకీయ అనిశ్చితి వంటివి ప్రైవేట్ రంగ పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ 200 రోజుల కదలికల సగటు అయిన 10,775 పాయింట్లను నిలబెట్టుకున్నప్పటికీ.. అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో నిఫ్టీ దిద్దుబాటుకు గురై.. 10,534 పాయింట్ల స్థాయిని పరీక్షించొచ్చని అంటున్నారు. నేడు నిఫ్టీ 10717-10924 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించనుండటంతో జీఎం బ్రూవరీస్ షేర్లు వెలుగులోకి రావొచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనానికి ఆమోదం లభించడంతో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ షేర్లపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు.

ఎన్‌సీసీకి భారీ కాంట్రాక్టులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన మౌలిక సదుపాయాల కంపెనీ ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.2,890.7 కోట్ల విలువైన నిర్మాణ కాంట్రాక్టులు దక్కాయి. ఇందులో నీటి సరఫరా కాంట్రాక్టుల విలువ రూ.680.3 కోట్లు కాగా, రహదార్ల విభాగంలో రూ.2,126.8 కోట్ల విలువైన మరో రెండు కాంట్రాక్టులున్నాయి. బిల్డింగ్స్ విభాగానికి సంబంధించిన రూ.83.7 కోట్ల విలువైన మరొక కాంట్రాక్టు ఉంది. ఈ కాంట్రాక్టు పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభించినట్లు ఎన్‌సీసీ లిమిటెడ్ వెల్లడించింది. ఈ కాంట్రాక్టు పనులను ఏడాదిన్నర నుంచి మూడేళ్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉన్నట్లు వివరించింది.

పెన్నార్ గ్రూపు సంస్థలకు రూ.309 కోట్ల ఆర్డర్లు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ విభాగాల్లో సేవలు అందిస్తున్న పెన్నార్ గ్రూపు రూ.309 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది. రైల్వేస్‌కు చెందిన ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, మోడరన్ కోచ్ ఫ్యాక్టరీ, పారిశ్రామిక విడిభాగాలు తయారు చేసే సంస్థలైన ఎమర్సన్, ఎండ్యూరెన్స్, ఫైర్‌స్టోన్‌తో పాటు ఎల్అండ్‌టీ, పీఎస్ ఇంజనీర్స్, ఐఎఫ్‌బీ, ఎల్‌జీ బాలకృష్ణన్... తదితర సంస్థల నుంచి పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు రూ.124 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి. పెన్నార్ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెబ్స్ పెన్నార్) కు మరో రూ.125 కోట్ల ఆర్డర్లు లభించాయి. నీటి శుద్ధి కేంద్రాల డిజైన్, తయారీకి సంబంధించి పెన్నార్ ఎన్విరోకు రూ.60 కోట్ల ఆర్డర్లు దక్కాయి.

'హెటిరో' చేతికి తర్బీస్ ఫార్మా

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన హెటిరో గ్రూపు ఐరోపాలోని తన అనుబంధ సంస్థ అయిన అమరాక్స్ లిమిటెడ్ ద్వారా స్పెయిన్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న తర్బీస్ ఫార్మా, ఎస్ఎల్‌యూ., అనే కంపెనీని కొనుగోలు చేసింది. స్పెయిన్‌లో ఔషధ తయారీ, విక్రయ కార్యకలాపాల్లో తర్బీస్ ఫార్మా క్రియాశీలక సంస్థ. దీని వార్షిక ఆదాయాలు 11 మిలియన్ యూరోల (దాదాపు రూ.88 కోట్లు) మేరకు ఉన్నాయి. ఈ సంస్థను కొనుగోలు చేయటం వల్ల తనకు స్పెయిన్‌లో వేగంగా విస్తరించే అవకాశం లభిస్తుందని హెటిరో ల్యాబ్స్ అంచనా వేస్తోంది. ఐరోపా దేశాల్లో విస్తరించాలనే తమ లక్ష్యానికి ఇది దోహదపడుతుందని హెటిరో ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏవీ నరసా రెడ్డి పేర్కొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఔషధ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న హెటిరో గ్రూపు యాంటీ-రిట్రోవైరల్ ఔషధాల తయారీలో అగ్రగామిగా ఉంది. ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్), జనరిక్ ఔషధాలు, బయోసిమిలర్స్, కస్టమ్ ఫార్మాసూటికల్ సర్వీసెస్, బ్రాండెడ్ జనరిక్స్ తయారీ, విక్రయ విభాగాల్లో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోంది.

మార్కెట్ కబుర్లు

- ఆక్లే ఏవియేషన్‌లో (ఏఏఎల్) మరో 27.25 శాతం వాటా కొనుగోలు చేసినట్లు హిందుజా గ్రూపు సంస్థ **అశోక్ లేలాండ్** తెలిపింది.
- **రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్**పై హెచ్ఎస్‌బీసీ డైసీ ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్)తోపాటు మైనారిటీ వాటాదార్లు వేసిన ధిక్కార పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) సాంకేతిక కారణాలతో తిరస్కరించింది.
- ఎన్‌టీపీసీ నుంచి 140 మెగావాట్ యూనిట్ ప్రాజెక్టు ఆర్డరు తమకు లభించినట్లు **విక్రమ్ సోలార్** వెల్లడించింది.
- అహ్మదాబాద్ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఏసీఈ) తమ కార్యకలాపాలను నిలిపివేయడానికి **సెబీ** అనుమతినిచ్చింది.
- **పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్** విదేశీ వాణిజ్య రుణాల (ఈసీబీ) ద్వారా 265 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,853 కోట్లు) నిధుల్ని గత డిసెంబరు చివరి వారంలో సమీకరించినట్లు తెలిపింది.
- ఉద్యోగులకు షేర్లు కేటాయించడం (ఇసాప్) ద్వారా రూ.500 కోట్ల నిధుల్ని సమీకరించబోతున్నట్లు ప్రభుత్వ రంగ **సిండికేట్ బ్యాంక్** వెల్లడించింది.

నిరాశపరచిన హీరో

- 4 శాతం తగ్గిన అమ్మకాలు

దిల్లీ: డిసెంబరులో హీరో మోటోకార్ప్ మొత్తం విక్రయాలు 4,53,985 వాహనాలుగా నమోదయ్యాయి. 2017 ఇదే నెలలో కంపెనీ అమ్మిన 4,72,731 వాహనాలతో పోలిస్తే ఇవి 3.9 శాతం తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలో హీరో విక్రయాలు తక్కువగా నమోదు కావడం ఇదే తొలిసారి. ద్విచక్ర వాహనాల బీమా రేట్లు పెరగడం, మార్కెట్‌లో నగదు కొరత వంటివి అమ్మకాలపై ప్రభావం చూపాయని హీరో ఛైర్మన్ పవన్ ముంజాల్ వెల్లడించారు. బీఎస్- 6 ఉద్గార నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత అమ్మకాలు మళ్లీ జోరందుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) ఏప్రిల్- డిసెంబరు మధ్య కంపెనీ మొత్తంగా 60,37,901 వాహనాలను విక్రయించింది. ఒక్క 2018లో చూస్తే.. 80,39,472 మోటార్‌సైకిళ్లు, స్కూటర్లు అమ్మింది. మరోవైపు బజాజ్ ఆటో అమ్మకాలు మాత్రం 2,92,547 వాహనాల నుంచి 18 శాతం వృద్ధితో 3,46,199కు చేరాయి. మోటార్‌సైకిళ్ల విక్రయాల్లు 31 శాతం, వాణిజ్య వాహనాలు 26 శాతం, ఎగుమతులు 16 శాతం పెరిగాయి. ఇదే సమయంలో టీవీఎస్, సుజుకీ మోటార్‌సైకిల్‌లు మాత్రం అమ్మకాల్లో రాణించాయి. వాణిజ్య వాహన సంస్థల్లో అశోక్ లేలాండ్ డీలాపడగా, సొనాలికా ఇంటర్నేషనల్ మెప్పించింది. ఫోర్డ్ ఇండియా అమ్మకాలు తగ్గాయి.



డిసెంబరులో వాహన విక్రయాలు

కంపెనీ	2018	2017	వృద్ధి/ (క్షీణత)%లో
హీరో మోటోకార్ప్	4,53,985	4,72,731	(3.9)
బజాజ్ ఆటో	3,46,199	2,92,547	18
టీవీఎస్	2,71,395	2,56,870	6
సుజుకీ మోటార్	43,874	32,786	33.82
ఫోర్డ్ ఇండియా	24,420	29,795	(18)
అశోక్ లేలాండ్	15,493	19,251	(20)
సొనాలికా ఇంటర్నేషనల్	6,066	5,321	14

ఎంఎస్ఎమ్ఈల కోసం యు.కె.సిన్హా నేతృత్వంలో కమిటీ

ఆర్థిక సుస్థిరతకు చేపట్టే చర్యలపై సూచనలు

ముంబయి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎమ్ఈ) ఆర్థిక సుస్థిరత నిమిత్తం చేపట్టాల్సిన దీర్ఘకాలిక చర్యలపై సూచనలు చేసేందుకు ఓ నిపుణుల కమిటీని ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది సభ్యులుండే ఈ కమిటీకి సెబీ మాజీ ఛైర్మన్ యు.కె.సిన్హా నేతృత్వం వహించనున్నారు. ఎంఎస్ఎమ్ఈలకు రూ.25 కోట్ల వరకు రుణ పునర్వ్యవస్థీకరణకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న మరునాడే ఈ కమిటీని కూడా ఆర్‌బీఐ ఏర్పాటు చేయడం గమనార్హం. ఎంఎస్ఎమ్ఈ రంగానికి అనుకున్న సమయానికి రుణాలు లభించే విషయంలో ఎదురవుతున్న అంశాలను కమిటీ అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను నివేదిక రూపంలో 2019 జూన్ కల్లా అందజేస్తుంది. ఇటీవల చేపట్టిన ఆర్థిక సంస్కరణల ప్రభావం ఎంఎస్ఎమ్ఈ రంగంపై ఎలా ఉందో కూడా కమిటీ పరిశీలిస్తుంది. ఎంఎస్ఎమ్ఈలకు సంబంధించి అంతర్జాతీయ అత్యుత్తమ ప్రమాణాలను అధ్యయనం చేసి నివేదికలో పొందుపర్చాల్సిందిగా కమిటీకి సూచించారు.

ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో వచ్చేవారం ఆర్‌బీఐ గవర్నరు భేటీ: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎమ్ఈలు) ప్రతినిధులతో వచ్చేవారం భేటీ కానున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గవర్నరు) శక్తికాంత దాస్ వెల్లడించారు. ఇప్పటికే రెండు సార్లు ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉన్నతాధికారులు, ఒకసారి ప్రైవేట్ రంగ బ్యాంకుల అధికారులతో దాస్ సమావేశమైన సంగతి తెలిసిందే.

నిర్మాణంలోని ఫ్లాట్లకు 5 శాతమే జీఎస్‌టీ!

- 10న జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో నిర్ణయం
- ఎంఎస్ఎమ్ఈలకు జీఎస్‌టీ టర్నోవర్ పరిమితి పెంపు?

దిల్లీ: నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లు, గృహాలపై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 10న జరిగే జీఎస్‌టీ మండలి తదుపరి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని ఓ అధికారి వెల్లడించారు. చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎమ్ఈలు) జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ టర్నోవరు పరిమితిని పెంచే విషయం కూడా చర్చకు రావొచ్చని పేర్కొన్నారు. డిసెంబరు 22న జరిగిన జీఎస్‌టీ మండలి 31వ సమావేశంలో 23 వస్తువులు, సేవల పన్ను రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. ఆ సమావేశానంతరం ఆర్థిక మంత్రి జైట్లీ మాట్లాడుతూ నివాస సముదాయాలపై పన్ను రేట్లను హేతుబద్ధీకరించడంతో పాటు ఎంఎస్ఎమ్ఈలకు టర్నోవరు పరిమితి పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. అందువల్ల ఈసారి జరిగే సమావేశంలో ఈ అంశాలే చర్చకు వచ్చే అవకాశం ఉందని ఆ అధికారి పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న, నిర్మాణం పూర్తయి ఇంకా కంప్లీషన్ సర్టిఫికేట్ రాని స్థిరాస్తులకు ప్రస్తుతం 12 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. విక్రయ నాటికి కంప్లీషన్ సర్టిఫికేట్ వచ్చి ఉంటే, జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. 'వాస్తవానికి నిర్మాణదార్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో లభిస్తున్న ప్రయోజనాన్ని కొనుగోలుదార్లకు బదిలీ చేస్తే ఈ 12 శాతం పన్ను రేటు భారం 5-6 శాతానికి తగ్గుతుంది. అయితే చాలా మంది నిర్మాణదార్లు పన్ను ప్రయోజనాన్ని కొనుగోలుదార్లకు బదిలీ చేయడం లేద'ని ఆ అధికారి పేర్కొన్నారు. మరోవైపు జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన డీలర్ల నుంచి 80 శాతం నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేస్తే నిర్మాణదార్లకు జీఎస్‌టీ రేటును 5 శాతానికి తగ్గించాలనే ప్రతిపాదన కూడా జీఎస్‌టీ మండలి పరిశీలనలో ఉందని తెలిపారు.

రూ.75 లక్షలకు పెంపు: జీఎస్‌టీ విధానంపై ఎంఎస్ఎమ్ఈలు వ్యక్తం చేస్తున్న పలు ఆందోళనలపై మంత్రుల బృందం దృష్టి సారించింది. ప్రస్తుతం ఎంఎస్ఎమ్ఈలకు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ టర్నోవరు పరిమితి రూ.20 లక్షలు ఉండగా.. దీనిని రూ.75 లక్షలకు పెంచే అంశాన్ని జీఎస్‌టీ మండలి పరిశీలిస్తోంది. చిన్న తరహా సరఫరాదార్లందరికీ కాంపోజిషన్ పథకాన్ని వర్తింపచేసే విషయాన్ని కూడా వచ్చే సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. లాటరీలపై ప్రస్తుతం విధిస్తున్న 28 శాతం పన్ను రేటును కొనసాగించే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. జీఎస్‌టీ కింద ప్రకృతి వైపరీత్య సెస్సును విధించడంపై కూడా జీఎస్‌టీ మండలి చర్చించనుంది.

ద్విచక్ర వాహనాలకు 18% మేలు: పవన్ ముంజాల్

ద్విచక్ర వాహనాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను 18 శాతానికి తగ్గిస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని హీరో మోటోకార్ప్ అభిప్రాయపడింది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ విధిస్తున్న సంగతి తెలిసిందే. 'చాలా మంది ప్రజలకు ద్విచక్ర వాహనం ప్రాథమిక అవసరంగా మారింది. వీటిపై పన్నును 18 శాతానికి తగ్గిస్తే అత్యధికులకు ఉపయోగకరంగా ఉంటుంద'ని హీరో మోటోకార్ప్ ఛైర్మన్ పవన్ ముంజాల్ పేర్కొన్నారు. ద్విచక్రవాహనాల తయారీదార్లు, విక్రయదార్లు, సరఫరాదార్లు.. ఇలా అందరికీ ఊరట లభిస్తుందని అన్నారు. మరోవైపు బీఎస్-6 ఉద్గార నిబంధనలు అమల్లోకి వస్తే ద్విచక్రవాహనాల ఖర్చు మరింత పెరుగుతుందని చెప్పారు.



2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) కోడిగుడ్లు

(100కు రూపాయలలో)

హైదరాబాద్	439	వరంగల్	441
చిల్లరగా(ఒక గుడ్డు)	5.00	విశాఖపట్నం	458
బెంగళూరు	445	చెన్నై	445
3వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	430

ఎన్‌ఎస్‌ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 381.30 (389.00) 1506543
ASIAN PAINTS 1383.30 (1371.55) 1233780
AXIS BANK LT 620.05 (627.30) 12386281
BAJAJ AUTO L 2692.00 (2726.65) 599274
BAJAJ FINANC 2614.05 (2656.85) 1304915
BAJAJ FINSER 6384.00 (6521.95) 221274
BHARTI AIRTE 312.65 (319.50) 5604911
BHARTI INFRA 264.25 (262.25) 1115095
BPCL 357.95 (367.20) 9862795
CIPLA 514.55 (523.05) 1243067
COAL INDIA L 236.70 (241.50) 3897893
DR. REDDYS 2601.05 (2607.05) 417551
EICHER MOTOR 21162.30 (23195.10) 481497
GAIL 350.30 (362.15) 3528488
GRASIM IND 815.50 (833.50) 821812
HCL TECH 946.35 (959.85) 1135048
HDFC 1980.65 (2009.00) 2001170
HDFC BANK 2128.50 (2148.10) 2033558
HERO MOTOCOR 3046.55 (3127.60) 597712
HINDALCO IND 214.55 (222.75) 10991026
HINDUSTAN UN 1784.60 (1801.10) 1598707
HPCL 256.55 (256.70) 10666940
ICICI BANK 364.60 (363.75) 18243156
INDIABULLS H 842.30 (844.75) 3995428
INDIAN OIL 137.25 (137.70) 11509773
INDUSINDBANK 1576.60 (1595.60) 1164974
INFOSYS LTD 669.05 (665.05) 7416655
ITC 280.60 (282.70) 9934187
JSW STEEL LT 288.70 (303.95) 8855139
KOTAK MAHIND 1240.60 (1250.45) 1713677
LARSEN & TOU 1425.50 (1441.90) 2058504
M&M 741.70 (773.35) 10596260
MARUTI SUZIK 7267.85 (7476.80) 891844
NTPC LTD 147.00 (148.70) 4334233
ONGC 147.05 (148.50) 17436694
POWER GRID C 195.25 (200.00) 4430566
RELIANCE IND 1106.40 (1121.00) 7144970
SBI 293.90 (299.60) 25559853
SUN PHARMA 440.05 (433.55) 9656878
TATA CONSULT 1923.30 (1902.80) 2100463
TATA MOTORS 168.55 (173.45) 13410104
TATA STEEL L 493.65 (515.75) 11747350
TECH MAHINDR 712.05 (719.10) 2576769
TITAN IND 932.15 (928.00) 2672587
ULTRATECH 4006.10 (4009.20) 143828
UPL LIMITED 756.50 (753.50) 1308043
VEDANTA LIMI 193.15 (202.10) 18935386
WIPRO 325.55 (326.65) 3308303
YES BANK LTD 184.65 (184.25) 32583205
ZEE ENTERTAI 470.25 (480.25) 2687773

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1319.25 (1319.20) 56713
ACC 1483.95 (1488.80) 669181
ADITYA BIRLA 99.25 (100.10) 1728162
AMBUJA CEMEN 218.95 (222.90) 1826162
ASHOK LEYLAN 99.95 (102.50) 40123864
AUROBIND PHA 724.35 (733.15) 1845752
AVENUE SUPER 1560.25 (1590.75) 397366
BANDHAN BANK 552.15 (556.70) 834846
BANK OFBAROD 119.35 (123.30) 25568039
BEL 89.70 (87.45) 10231387
BHEL 73.00 (73.80) 8615103
BIOCON LTD 622.80 (625.80) 1232572
BOSCH LTD 19477.80 (19576.50) 10810
BRITANNIA 3116.85 (3103.05) 152324
CADILA HEALT 346.75 (350.05) 558345
COLGATE PALM 1301.80 (1323.90) 396926
CONTAINER 668.95 (685.30) 1092937
DABUR INDIA 416.40 (421.85) 2550167
DLF LIMITED 173.10 (180.30) 6604177
GENERAL INS 257.40 (259.40) 168951
GODREJ CONSU 806.65 (807.35) 1265919
HAVELLS INDI 691.80 (694.80) 1228486
HDFC STAND L 391.15 (386.40) 401487
HINDUSTAN ZI 272.75 (277.85) 336931
ICICI LOMBAR 875.45 (873.25) 170450
IDEA CELLULR 36.75 (37.75) 10619192
INTERGLOBE A 1161.00 (1165.60) 644385
L&TFIN.HOLD 150.50 (153.15) 4695402
LIC HOUS.FIN 476.15 (486.55) 1119301
LUPIN 832.80 (841.45) 1115202
MARICO LIMIT 372.85 (372.30) 1160137
MCDOWELL 619.75 (621.00) 1096370
MOTHERSON 163.75 (165.45) 2466757
MRF 66635.50 (66801.20) 7531
NHPC LTD 25.65 (25.95) 2384454
NMDC LTD 96.80 (95.75) 13102744
OIL INDIA 172.40 (175.75) 722532
ORACLE FIN S 3710.95 (3729.45) 34252
P&G HYG&HEAL 9895.00 (9903.75) 2809
PETRONET LNG 228.80 (229.00) 2741873
PIDILITE IND 1107.65 (1101.95) 410838
PIRAMAL ENTE 2343.75 (2395.30) 607051
SAIL 54.00 (55.75) 12322286
SBI LIFE INS 601.70 (598.85) 115282
SHREE CEMENT 16939.95 (16973.25) 13931
SHRIRAM TRAN 1195.40 (1229.75) 1588301
SIEMENS 1056.55 (1062.65) 581675
SUN TV LTD 604.60 (607.85) 1205671
THE NEW INDI 184.80 (179.75) 99671

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 2.65 (2.67) 8048
ALPHAGEO 476 (479.95) 167
AMAR RAJA BA 732.65 (739.65) 6058
ANDHRA BANK 29.45 (29.75) 91582
ANDHRA CEMEN 5.82 (5.96) 4575
ANDHRA PAPER 442.60 (447.40) 6683
ANDHRA PETRO 60.75 (58.20) 187676
ANDHRA SUGAR 332.40 (340) 1340
ANJANI PORTL 136 (130) 123
ASTRA MICROW 78.60 (78.55) 21264
AUROBINDO PH 722.30 (731.70) 64865
AVANTEL SOFT 223.15 (226.55) 1401
AVANTI FEEDS 378.50 (389) 16384
AVON ORG 7 (6.70) 25
BALAJI AMIN 452.30 (459.50) 1036
BARTRONICS 7.23 (7.22) 3539
BHAGIRA CHEM 424.10 (443.70) 6726
BHAGYA NAG 31.20 (31.35) 707
BN RATHI SEC 27.85 (27) 1931
BRILLIANT SE 1.21 (1.16) 32501
CAMBRIDGE TE 43.10 (41.20) 3307
CIL SECURI 18.60 (17.80) 1
COMBAT DRUGS 19.90 (20.90) 150
CONT COFFEE 268.75 (271.90) 252
COROMAN FERT 448.55 (450.50) 5431
CUBEX TUB 14.67 (14.60) 156
CYBERMATE 2.44 (2.43) 8695
CYIENT LIMIT 619.35 (618.20) 2476
DECCAN CEMEN 398.95 (400.25) 51
DIVI'S LAB 1471.20 (1478.55) 12023
DIVYA GRANIT 87 (90.40) 640
DR REDDY 2600.60 (2610.80) 19866
FINE PLAST 6.09 (5.80) 100
FOUR SOFT 52.20 (48.35) 54076
GATI CORPN 84.45 (86.30) 81871
GAYATRI PROJ 176.15 (179.05) 407
GMR INFRASTR 15.95 (16.45) 905990
GOLDST INFRA 241.65 (230.45) 72514
GOLDSTONE EN 16.15 (16.80) 48874
GRANULES (I) 89.65 (90.80) 33100
GSS AMERICA 130.85 (132.65) 51330
GVK POWER 7.88 (8.03) 379409
HBL NIFE POW 28.75 (28.85) 10152
HERITAGE FOO 525.40 (528.75) 2241
HIFCO MARWEL 72.75 (74.20) 1260
HIL LTD 2050.55 (2058) 314
HIND FLUROCA 17.45 (17.25) 375
IDL INDUSTRS 291.80 (295.95) 9
IKF SOFT 0.31 (0.31) 73110
ILFS ENGINEE 15.45 (16.25) 6124
INCAP 41 (43.10) 480
IVRCL INFRAS 1.03 (1.04) 118968
JEEVAN SCIEN 36.60 (38.25) 859
KAKATIYA CEM 199.95 (201.30) 9661
KALLAM SPG 18.15 (18.40) 3107
KAVERI SEED 568.40 (576.10) 18977
KCP LTD 89.05 (92) 11809
KERNEX MICRO 23 (23.20) 3303
KNR CONSTRUC 213.25 (210.40) 6242
KREBS BIO 112.95 (109.45) 6
LANCO INDUS 186.55 (187.75) 3046
LAURUS LABS 379.70 (384) 916
LOKESH MACH 46.90 (47.45) 583
MADHUCON PRO 6.80 (6.62) 1629
MEGA SOFT 7.77 (8.09) 4454
MIC ELECTRON 1.33 (1.40) 24933
MOLD-TEK.TEC 43.85 (42.50) 2210
MOLDTK PLA 265.65 (270) 1294
MSR INDIA LT 11.90 (11.85) 9788
NAGARJAGRICH 27.10 (27.50) 3538
NATCO PHARMA 699.65 (696.95) 9116
NAVA BH VENT 119.75 (119.95) 2955
NCC 89.40 (88.85) 1597184
NCL IND 138.35 (139.05) 1447
NEHA INTER 4.60 (4.68) 6308
NETTLINX 50 (50.70) 19646
NEULAND LAB 480.40 (471.90) 905
NIHAR INFO 15.04 (14.33) 12305
NILE 380.15 (385) 442
NORTHGATE TE 0.98 (0.94) 10290
OIL COUNTRY 16.75 (17.50) 8884
PANYAM CEMEN 13.67 (13.51) 1849
PENNER IND 36.70 (36.90) 29923
PIONEER DIST 167.25 (172) 675
PITTI LAMIN 70.50 (72.40) 17987
POKARNA 162 (163.05) 1486
PREMIER EXPL 243.70 (240.80) 1967
PRISM CEMENT 88.05 (89.60) 13976
PRUDENTL PHA 3.71 (3.70) 84266
RAASI REFRAC 10.22 (10.22) 500
RAIN INDUSTR 131.85 (135.95) 51486
RAJ PACKAGIN 27.95 (30) 511
RAM INFORMAT 42.10 (41.05) 1442
SAGAR CEM 695.60 (695.60) 210
SAMKRG PIST 190.30 (191.70) 2368
SATVAH. ISPA 9.55 (10) 5621
SMS PHARMA 69.85 (67.50) 232
SOUTH BIO TE 1.94 (1.91) 10000
SPHERE GLOBA 18.15 (18.95) 300
SREE RAYAL A 34.10 (34.55) 39134
SRINIVASA SH 46.50 (45) 112
STEEL EXCHAN 14.50 (14.70) 1248
SUJANA METAL 0.38 (0.37) 13000
SUJANA TOWER 1.05 (1) 4304
SURANA STRIP 1.31 (1.25) 12945
SURANA TELE 4.75 (4.51) 590
SURYALAKSH.C 41.90 (42.55) 1017
SURYALATA SP 133.65 (127.30) 25
SUVEN PHARMA 236.45 (232.35) 63383
TAJ GVK HOTE 176.40 (178.50) 715
TANLA 31.05 (30.70) 20074
TERA SOFTWAR 39.65 (39.70) 4577
TRANS BIOTEK 3.34 (3.26) 2632
TRENDY KNIT 0.19 (0.19) 50000
VAMSHI RUBB 33.90 (33.90) 75
VBC FERRO 43.20 (43.25) 174
VICEROY HOTE 5.20 (5.30) 17291
VIMTA LABS 312.40 (319.10) 1557
VISAKA IND 433.35 (436.90) 823
VISTA PHARMA 29.70 (29.35) 8043
VIVIMED LABS 36.80 (36.95) 13115
VJIL CONSULT 43.30 (41.25) 5262
YBRANT DIGIT 2.68 (2.71) 54600
ZENOTECH LAB 36.55 (37.30) 2359
ZENTECH 77.25 (78.70) 2123



3 కలిసి.. 3వ అతిపెద్ద బ్యాంక్

బీఓబీలోకి దేనా, విజయా బ్యాంకుల విలీనానికి కేంద్ర మంత్రివర్గ ఆమోదం

● షేర్ల మార్పిడి నిష్పత్తి ఖరారు ● అంగీకరించిన మూడు బ్యాంకుల బోర్డులు

● ఉద్యోగుల తొలగింపు ఉండదు: ప్రభుత్వం ● ఏప్రిల్ 1 నుంచి కార్యకలాపాలు

అగ్రగామి బ్యాంకులతో పోలిస్తే.. (రూ.కోట్లలో)

	ఎస్‌బీఐ	ఐసీఐసీఐ	విలీన బ్యాంకు
మొత్తం ఆదాయం	2,65,100	72,386	74,592
స్థూల నిరర్థక ఆస్తులు	2,23,427	54,063	80,367
మొత్తం అడ్వాన్సులు	19,90,172	5,16,289	6,40,592
కనీస మూలధన నిష్పత్తి(%)	12.6	18.42	12.25
నికర లాభం	-6,547	6,777	-3,628

(జూన్ త్రైమాసికానికి గణాంకాలు)

బ్యాంకులు	మార్కెట్ విలువ (రూ.కోట్లలో)
బ్యాంక్ ఆఫ్ బరోడా	31,588
దేనా బ్యాంక్	4055
విజయా బ్యాంక్	6658
మొత్తం మార్కెట్ విలువ	42,301

బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1285 కోట్ల సమీకరణ!

దిల్లీ: బాసెల్-3 నిబంధనలను పాటించే బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.1285 కోట్ల వరకు నిధులను సమీకరించుకోవడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా బోర్డు అనుమతించింది. రెండే వేర్వేరు నిర్ణయాల రూపంలో ఈ అనుమతులు దక్కాయి. రూ.250 కోట్ల వరకు సమీకరించేలా రెండో శ్రేణి క్యాపిటల్ బాండ్ల జారీకి అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా బాండ్లకు అధిక స్పందన లభిస్తే అదనంగా రూ.750 కోట్ల వరకు అట్టేపెట్టిఉంచుకోవచ్చు. ఇక మరో నిర్ణయంలో భాగంగా రూ.100 కోట్ల వరకు ప్రాథమికంగా బాండ్లను జారీ చేయడానికి అంగీకారం కుదిరింది. ఇందులోనూ అధిక స్పందన లభిస్తే రూ.185 కోట్లను అదనంగా అట్టేపెట్టిఉంచుకోవచ్చు.

దిల్లీ

మూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి మార్గం సుగమం అయింది. దేనా బ్యాంక్, విజయా బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయడానికి కేంద్ర మంత్రి వర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఫలితంగా ఆస్తుల పరంగా దేశంలో మూడో అతిపెద్ద బ్యాంకు అవతరించనుంది. ఏప్రిల్ 1 నుంచి విలీనబ్యాంక్ కార్యకలాపాలు సాగించనుంది. భారత్‌లో అతిపెద్ద బ్యాంక్ ప్రభుత్వరంగంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కాగా తరవాత స్థానంలో ప్రైవేటురంగ ఐసీఐసీఐ బ్యాంకు ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంక్, విజయా బ్యాంక్ విలీనం అయ్యాక, ఏర్పడే బ్యాంక్ మూడో అతిపెద్ద బ్యాంకుగా నిలవనుంది.

అంతర్జాతీయ స్థాయి బ్యాంకు: మంత్రి

విలీనం అనంతరం ఉద్యోగుల తొలగింపు ఏమీ ఉండదని.. అదే సమయంలో సర్వీసు నిబంధనలు కూడా మారవని కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారమిక్కడ జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మూడు బ్యాంకుల విలీనానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ విలీనం వల్ల అంతర్జాతీయ స్థాయిలో పోటీనిచ్చే మరో బ్యాంకు ఏర్పాటు అవుతుందని ఆయన పేర్కొన్నారు. 3 బ్యాంకుల నెట్‌వర్క్‌లు కలవడం వల్ల మెరుగైన ఫలితాలు లభిస్తాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

షేర్ల నిష్పత్తి ఇలా

విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లను విలీనం చేసుకోవడానికి బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) బుధవారం షేర్ల మార్పిడి నిష్పత్తిని



ఖరారు చేసింది. విలీన పథకం ప్రకారం..

- ✦ విజయా బ్యాంక్ వాటాదార్లకు తమ వద్ద ఉన్న ప్రతి 1000 షేర్లకు 402 బీఓబీ షేర్లు,
- ✦ దేనా బ్యాంక్ వాటాదార్లకు తమ వద్ద ఉన్న ప్రతి 1000 షేర్లకు 110 బీఓబీ షేర్లు లభిస్తాయి.
- ✦ మూడు బ్యాంకుల బోర్డులు సైతం ప్రతిపాదిత విలీనానికి బీఓబీ ఖరారు చేసిన షేర్ల మార్పిడి నిష్పత్తి(స్వాప్ రేషియో)కి ఆమోదం తెలిపాయి. విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేస్తున్నట్లు గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే.

పార్లమెంటు ముందుకు ఎపుడంటే..

విలీన పథకాన్ని పార్లమెంటుకు ముందుకు తీసుకువస్తారు. 30 రోజుల పాటు సభ్యుల పరిశీలనకు ఉంచుతారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. శీతకాల సమావేశాల చివర్లో ఈ పథకం పార్లమెంటు ముందుకు రావచ్చొని అంచనా. జనవరి 8న ఈ సమావేశాలు పూర్తవుతాయన్న సంగతి తెలిసిందే.

బ్యాంకు	2న షేరు ముగింపు (ధర రూ.లలో)	వచ్చే బీఓబీ షేర్లు (1000 షేర్లకు)	లభించిన ధర	రాయితీ (బీఓబీ ధర ప్రకారం)
బ్యాంక్ ఆఫ్ బరోడా	119.35	----	----	----
దేనా బ్యాంక్	17.90	110	13.13	27%
విజయా బ్యాంక్	51.05	402	47.97	6%

విలీనం.. విశేషం..

తొలిసారి → భారత బ్యాంకుల్లో ఈ విధంగా మూడు బ్యాంకులను త్రిమార్గ స్థిరీకరణ పద్ధతిలో విలీనం చేయడం ఇదే తొలిసారి.

ఏప్రిల్ 1 → ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభం కావొచ్చు.

ఎస్‌బీఐ తర్వాత → 3బ్యాంకుల విలీనానంతర బ్యాంకుకు రూ.14.82 లక్షల కోట్ల వ్యాపారం ఉంటుంది. దేశ వ్యాప్తంగా మూడో అతిపెద్ద బ్యాంకు, రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఇదే.

19 → ఈ విలీనం తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 19కి పరిమితం అవుతుంది.

సెప్టెంబరు → ఆర్థిక మంత్రి ఆధ్వర్యంలోని ప్రత్యామ్నాయ వ్యవస్థ ఈ 3 బ్యాంకుల విలీనానికి గత సెప్టెంబరులో సూత్రప్రాయ అంగీకారాన్ని తెలిపింది.

బ్రాండ్

విలీనం తర్వాత కూడా బ్రాండ్ గుర్తింపును పరిరక్షిస్తారని గతేడాది ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. అదే సమయంలో విలీన సంస్థలో ఉద్యోగులు అత్యుత్తమ సేవా నిబంధనలు పొందుతారని తెలిపారు.

ఆర్థిక వ్యవస్థ గాడిలోనే..


● అధిక వృద్ధి రేటు దిశగా పయనం

● ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ సాధిస్తాం

● తయారీకి మంచి ఊతమిచ్చాం ● సంవత్సరాంత సమీక్ష-2018లో జైట్లీ

దిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ధీమా వ్యక్తం చేశారు. మదుపర్ల విశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. వ్యాపారాన్ని సులువుగా నిర్వహించుకునే విషయంలో 2018లో 77వ స్థానానికి ఎగబాకిన విషయం తెలిసిందే.



2014-15 నుంచి 2017-18 మధ్య భారత ఆర్థిక వ్యవస్థ సగటున 7.3 శాతం వృద్ధిని నమోదు చేసిందని.. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధి సాధించిన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని సంవత్సరాంత సమీక్ష-2018లో జైట్లీ తెలిపారు. ఇదేవిధంగా 2018-19, 2019-20లోనూ తన స్థాయి నిలబెట్టుకుంటుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ అధిక వృద్ధి రేటును కొనసాగించగలదని ఆయన అన్నారు.

'తయారీకి ఊతమివ్వడానికి పలు చర్యలు చేపట్టాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలోనూ సమూల సంస్కరణలు తీసుకొచ్చాం. జౌళి పరిశ్రమకు ప్రత్యేక ప్యాకేజీలిచ్చాం. అందుబాటు గృహాలకు మౌలిక హోదా ఇచ్చాం. ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు సైతం భారత విధానాల విజయాన్ని ప్రస్తుతించాయ'ని ఆయన గుర్తు చేశారు.

పదేళ్లలోనే అత్యుత్తమం

ప్రత్యక్ష పన్నులు, జీడీపీకి మధ్య నిష్పత్తి 2017-18లో 5.98 శాతంగా నమోదైంది. ఇది గత పదేళ్లలోనే అత్యుత్తమం. 2016-17లో 5.57%; 2015-16లో 5.47 శాతంగా ఇది నమోదైందని ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో రిటర్నుల సంఖ్యలో కూడా 80 శాతం వృద్ధి నమోదైంది. 2013-14లో 3.79 కోట్ల రిటర్నులు దాఖలవ్వగా, 2017-18లో 6.85 కోట్లకు చేరింది. వ్యక్తిగత ఆదాయపన్ను రిటర్నుల సంఖ్య కూడా 2013-14లో 3.31 కోట్లు ఉండగా.. 2017-18లో అది 65 శాతం వృద్ధితో 5.44 కోట్లకు చేరుకుందని ఆ శాఖ తెలిపింది. ఏప్రిల్-నవంబరు 2018లో రూ.1.23 లక్షల కోట్ల రిఫండ్‌లను జారీ చేశామని, ఏడాదిక్రితం ఇదే సమయంలో జారీ చేసిన వాటితో పోలిస్తే 20.8 శాతం మేర వృద్ధి చెందాయి. కార్పొరేట్ ఆదాయ పన్ను, వ్యక్తిగత ఆదాయ పన్నులలో వృద్ధి రేటు వరుసగా 17.7%, 18.3% చొప్పున నమోదైనట్లు ఆర్థిక శాఖ తెలిపింది.

పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సురేష్ రాయుడు



ఈనాడు, హైదరాబాద్: శ్రీనివాస ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన సురేష్ రాయుడు అఖిల భారత పౌల్ట్రీ బ్రీడర్స్ అసోషియేషన్ (ఏఐపీబీఏ) ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పౌల్ట్రీ వర్తక సంఘాల్లో ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం సురేష్ రాయుడు ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ (ఐఈసీ), యూకే., వైస్‌ఛైర్మన్‌గా ఉన్నారు. అఖిల భారత పౌల్ట్రీ బ్రీడర్స్ అసోషియేషన్‌లో దాదాపు దేశంలోని పౌల్ట్రీ బ్రీడింగ్ సంస్థలన్నీ సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. పౌల్ట్రీ రైతులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ఈ అసోసియేషన్ కృషి చేస్తోంది.

జియో కనెక్షన్లు 26.28 కోట్లు

అక్టోబరులోనే కొత్తగా కోటి మంది చేరిక



దిల్లీ: రిలయన్స్ జియోకు గత అక్టోబరులో మరో కోటి మందికి పైగా కొత్త చందాదార్లు జతయ్యారని, దీంతో మొత్తం కనెక్షన్ల సంఖ్య 26.28 కోట్లకు చేరిందని టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) వెల్లడించింది. వొడాఫోన్ ఇండియా -ఐడియా సెల్యులార్ సంస్థల విలీనంతో అతి పెద్ద టెలికాం సంస్థగా అవతరించినా, విలీన సంస్థ అక్టోబరులో 73.6 లక్షల మంది ఖాతాదారుల్ని కోల్పోయింది. గత అక్టోబరు 31 నాటికి ఈ సంస్థకు 42.76 కోట్ల మంది ఖాతాదారులున్నారు. భారతీ ఎయిర్‌టెల్ కనెక్షన్లు 18.6 లక్షలు తగ్గి, 34.17 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ కొత్తగా 3,63,991 మందిని చేర్చుకోవడంతో కనెక్షన్లు 11.34 కోట్లకు చేరాయి. దేశంలో మొబైల్ కనెక్షన్లు 7,24,725 పెరిగి, మొత్తం 117 కోట్లకు చేరాయి.

సచిన్ బన్సల్ ముందస్తు పన్ను చెల్లింపు రూ.699 కోట్లు

ఫ్లిప్‌కార్ట్ విక్రయ లాభాలపై

దిల్లీ: ఫ్లిప్‌కార్ట్‌లో వాటాను వాల్‌మార్ట్‌కు విక్రయించడం ద్వారా ఆర్జించిన మూలధన లాభాలపై పన్నును ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ ఈ లావాదేవీ కంటే ముందుగానే చెల్లించినట్లు తెలుస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి ముందస్తు పన్ను చెల్లింపు కింద రూ.699 కోట్లను ఆయన జమచేశారు. ఫ్లిప్‌కార్ట్‌లో మెజార్టీ వాటాను అమెరికాకు చెందిన రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ దాదాపు రూ.లక్ష కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఫ్లిప్‌కార్ట్‌లో వాటా విక్రయం ద్వారా వచ్చిన మూలధన లాభాల వివరాలను వెల్లడించాలని సచిన్, బిన్నీ బన్సల్‌తో పాటు మరికొంత మంది వాటాదార్లకు ఆదాయపు పన్ను విభాగం నోటీసులు జారీ చేసింది. ఫ్లిప్‌కార్ట్‌లో 77 శాతం వాటా కొనుగోలు చేసిన కొన్ని నెలలకు పన్నుల రూపేణా రూ.7,440 కోట్లను వాల్‌మార్ట్ చెల్లించింది. అనంతరం ఈ కొనుగోలు లావాదేవీతో ఎంత మేర లాభాలు ఆర్జించారో తెలియజేయాలంటూ 46 మంది వాటాదార్లను, వివరాలు అడిగింది. ఫ్లిప్‌కార్ట్‌లో వాటా విక్రయం ద్వారా వచ్చిన మూలధన లాభాల వివరాలను బన్సల్‌లు ఇంతవరకు వెల్లడించలేదని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే ఫ్లిప్‌కార్ట్‌లో వాటా విక్రయం ద్వారా ఆర్జించిన లాభాలపై, ముందస్తు పన్ను రూపేణానే సచిన్ చెల్లించారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ఆభరణాల నాణ్యతా పరీక్షలే కొత్త ఖాతాదార్లను పెంచుతున్నాయ్



● ఎక్కడ కొన్నా క్యారెట్ మీటర్‌తో ఉచిత తనిఖీలు

● జీఎస్‌టీ తరవాత మా వ్యాపారంలో 25-30 శాతం వృద్ధి ● 2-5 లక్షల జనాభా పట్టణాలకు తనిష్క్ విస్తరణ

ఈనాడు ఇంటర్వ్యూ | టైటన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ బిజూ అలెగ్జాండర్

'బంగారు ఆభరణాల కొనుగోలులో ధర, నమ్మకం ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. వేరే వ్యాపారులు, సంస్థల వద్ద కొనుగోలు చేసిన ఆభరణాల నాణ్యతను తనిష్క్ విక్రయశాలల్లోని క్యారెట్ మీటర్ వద్ద ఉచితంగా పరీక్షించుకోవచ్చు. వేరే విక్రయశాలల్లో 22 క్యారెట్లు (916 స్వచ్ఛత) అనుకుని కొనుగోలు చేసిన ఆభరణాలు తెచ్చి, మా వద్ద తనిఖీ చేయించుకుంటున్నారు. స్వచ్ఛత సరిగా లేకపోతే, మాకో కొత్త ఖాతాదారు లభించినట్లే. ఈ విధంగానే గ్రామీణ, చిన్న పట్టణాల నుంచీ ఎగువ మధ్యతరగతి ప్రజలు తనిష్క్ ఆభరణాల నాణ్యతకు ఆకర్షితులవుతున్నారు. అందుకే 2-5 లక్షల మంది నివసించే పట్టణాలకు మరింతగా విస్తరించాలని నిర్ణయించాం' అని టైటన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, దక్షిణ ప్రాంత అధిపతి బిజూ అలెగ్జాండర్ తెలిపారు. 'ఈనాడు' ఇంటర్వ్యూలో ఆయన తెలిపిన అంశాలివీ..

? ఆభరణాల వ్యాపార రంగం ఎలా ఉంది

బిజూ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు తరవాత ఆభరణాల వ్యాపారం మందగించిన మాట వాస్తవమే. ఈ ఏడాది చూస్తే తొలి 6 నెలల్లో వ్యాపారాలు నిదానించాయి. డాలర్ విలువ అనూహ్యంగా పెరగడంతో, అంతర్జాతీయంగా మార్పు లేకున్నా దేశీయంగా పసిడి ధర బాగా అధికమవడం, కర్ణాటక వంటి రాష్ట్రాల ఎన్నికలు, కేరళ వరదలూ దెబ్బతీశాయి. అసంఘటిత రంగ వ్యాపారులపై ఇవి అధిక ప్రభావం చూపాయి. బిల్లులో పారదర్శకత, నాణ్యతకు భరోసా వంటి అంశాల వల్ల సంఘటిత రంగ సంస్థలకు కొనుగోలుదార్లు రావడం పెరిగింది.

? సంఘటిత రంగం, తనిష్క్ వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి

పెద్దనోట్ల రద్దు అనంతరం, రూ.2 లక్షలకు మించి కొనుగోళ్లకు పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) తప్పనిసరి చేయడంతో, తనిష్క్‌తో పాటు ఇతర సంఘటిత సంస్థలకు కలిసొచ్చింది. గతంలో మేము పాన్ అడిగితే, కొనుగోలుదార్లు వెనక్కి మళ్లేవారు. ఇప్పుడు బిల్లు కలిగి ఉండటం ఎంత ముఖ్యమనే అవగాహన పెరిగింది. జీఎస్‌టీ చెల్లించి, బిల్లు తీసుకుంటున్నారు. అందువల్ల ఆన్‌లైన్-కార్డ్ స్వైపింగ్ చెల్లింపులూ అధికమవుతున్నాయి. పెద్దమొత్తాల్లో కొనేవారు కూడా సాధికారికంగా, బిల్లుతోనే తీసుకుంటున్నారు. తనిష్క్ వ్యాపారం 2016 కంటే 2017లో 25 శాతం వృద్ధి సాధిస్తే, గతేడాది కంటే ఈ ఏడాది 30 శాతం వృద్ధితో సాగుతున్నాం.

? ఇతర విక్రయశాలల కంటే తనిష్క్‌లో ధర ఎక్కువనే భావన ఉంది. కొత్త ఖాతాదారులను ఎలా ఆకర్షిస్తున్నారు

ఆరోజు బంగారం కొనుగోలు ధర, మార్కెట్ ధరకు అనుగుణంగా మా విక్రయ ధరను నిర్ణయిస్తున్నాం. తనిష్క్ ఎప్పుడైనా సంస్థ అవసరాలకు అనుగుణంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుంది కానీ, ధర తక్కువున్నప్పుడు అధికంగా సమీకరించి పెట్టుకోదు. సాధారణంగా వ్యాపారులు ధర తక్కువ ఉన్నపుడు మేలిమి బంగారం కొనుగోలు చేసి, నిల్వ ఉంచుకుంటుంటారు. అందువల్ల గిరాకీ తక్కువగా ఉన్నపుడు, ఆన్‌లైన్ బులియన్ ధర కంటే, కాస్త తక్కువకూ అమ్మే పరిస్థితులు వస్తున్నాయి. మా వద్ద అలా ఉండదు. అందువల్ల ఒక్కోసారి, మా ధరలో 0.5 శాతం నుంచి 2 శాతం వరకు తేడా ఉండొచ్చు. అయితే వినియోగదారులకు అధిక విలువ, పారదర్శకత ఇస్తాం. బంగారంపై తరుగు, తయారీ వ్యయాలు అన్నీ కలిపి, 'తయారీఖర్చు (మేకింగ్‌ఛార్జీ)'గానే చూపుతాం. మేకింగ్ ఛార్జీ 8 శాతం నుంచి ప్రారంభమవుతుంది. ఆభరణ డిజైన్ సంక్లిష్టతను బట్టి 25 శాతం వరకు కూడా ఉంటుంది. అయితే బిల్లు విషయంలో పూర్తి పారదర్శకంగా ఉంటాం. కొనుగోలుదార్లు బేరమాడితే, తరుగు శాతాన్ని తగ్గించే పరిస్థితి కాకుండా, నిర్ణయమే వారికి అనుకూలంగా ఉంటుంది. ఏడాదిలో ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించినప్పుడు, అందరికీ ఒకే రకంగా ప్రయోజనం కల్పిస్తాం.

? ఎవరైనా ఆభరణాల నాణ్యతను ఉచితంగా పరీక్షించుకోవచ్చా

ప్రతి విక్రయశాలలో క్యారెట్ మీటర్ ఉంచాం. పాత ఆభరణాలు తెచ్చుకుని, ఉచితంగా పరీక్షించుకోమంటున్నాం. నాణ్యత నిర్ధారణ రశీదు కూడా ఉంటుంది. ఎంతో నమ్మకంగా తెలిసిన వ్యాపారి వద్ద కొనుగోలు చేశామనేవారు, సదరు ఆభరణాలు తెస్తుంటారు. పరీక్ష తరవాత నాణ్యతలో తేడా వస్తే, వారు వెంటనే తనిష్క్‌కు ఖాతాదారుగా మారుతున్నారు. ఇలా అత్యధికులు మాకు ఖాతాదారులయ్యారు. వినూత్న డిజైన్లు కూడా కలిసి వస్తున్నాయి. వివాహాది శుభకార్యాలకు కావాల్సిన అన్ని రకాల ఆభరణాలను ఆకర్షణీయ మోడళ్లలో 'రివా' బ్రాండ్‌పై అందుబాటులోకి తెచ్చాక, విక్రయాలు మరింత పెరిగాయి. పాత ఆభరణాలు మార్చుకుని, కొత్తవి తీసుకునే వారు మా దగ్గర తక్కువే. కానీ పాత ఆభరణాలకూ మంచి విలువ ఇస్తాం.

? మీ వ్యాపారంలో దక్షిణాది, తెలుగు రాష్ట్రాల వాటా ఎంత

ఇటీవల కాకినాడలో ప్రారంభించిన శాఖతో కలిసి దేశవ్యాప్తంగా 274 తనిష్క్ విక్రయశాలలున్నాయి. వీటిలో దక్షిణాదిలో 78 ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 10, తెలంగాణాలో 12 ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలు మాకు చాలా ముఖ్యమైన విపణి. వజ్రాలు, విలువైన రత్నాభరణాలు, వినూత్న డిజైన్లను ఇక్కడి ఖాతాదారులు కోరుతుంటారు. దేశ వ్యాపారంలో దక్షిణాది వాటా 20 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి సంపన్న ఖాతాదారులు మా దగ్గరకు వస్తుంటారు. వీరు సమీప పట్టణాల్లో కొనుగోలు చేస్తుంటారు. అందుకే దేశవ్యాప్తంగా 2-5 లక్షల జనాభా ఉన్న పట్టణాల్లోనూ విక్రయశాలలు ప్రారంభిస్తాం.

– ఈనాడు వాణిజ్య విభాగం



మంత్రివర్గ సమావేశం అనంతరం బుధవారం విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రవిశంకర్ ప్రసాద్

కేంద్ర, రాష్ట్ర స్థాయిలో కార్మిక సంఘాలకు గుర్తింపు

- ప్రతినిధుల నియామకంలో మరింత పారదర్శకత
- ఆరోగ్య పథకానికి ప్రాధికార సంస్థ
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

ఈనాడు, దిల్లీ: కార్మిక సంఘాల చట్టం-1926లో సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఇప్పటివరకూ ఉన్న 'నమోదైన కార్మిక సంఘాలు' (రిజిస్టర్డ్ ట్రేడ్ యూనియన్స్) స్థానంలో 'గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు' అని చేర్చడానికి వీలుగా నిబంధనలను సవరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదం తెలిపింది. ఇకపై కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో కార్మిక సంఘాలను గుర్తిస్తారు. త్రైపాక్షిక చర్చల వ్యవస్థల్లో 'గుర్తింపు పొందిన సంఘాల' ప్రతినిధులకు ప్రాతినిధ్యం లభిస్తుంది. వివాదాలు, పారిశ్రామిక అశాంతిని తగ్గించడానికి ఈ పారదర్శక చర్య దోహదం చేస్తుందని అంచనా వేస్తున్నారు. గుర్తింపు పొందిన సంఘాలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి ఆమోదం తెలపడంతో పాటు ఇంకా పలు నిర్ణయాలను కేంద్ర మంత్రివర్గం తీసుకుంది.

సరికొత్త రూపంలో జాతీయ ఆరోగ్య సంస్థ

'ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన'ను మరింత సమర్థంగా నిర్వహించడానికి 'జాతీయ ఆరోగ్య సంస్థ' (నేషనల్ హెల్త్ ఏజెన్సీ)ని 'జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ' ('నేషనల్ హెల్త్ అథారిటీ)గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకొంది. నేషనల్ హెల్త్ ఏజెన్సీ రద్దయిపోతుంది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నేతృత్వంలోని పాలక మండలి నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ పాలకమండలిలో ప్రభుత్వ ప్రతినిధులు, వైద్య రంగ నిపుణులు సభ్యులుగా ఉంటారు.

- ◆ రాష్ట్రీయ యువ సశక్తీకరణ్ కార్యక్రమాన్ని 2019-20 వరకు కొనసాగించాలని నిర్ణయించి, రూ.1,160 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం వల్ల 15-29 ఏళ్ల యువతకు ప్రయోజనం కలుగుతుంది.
- ◆ వైద్య ఆరోగ్య పథకాలన్నీ 2019-20 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. దీని కోసం రూ.2,381.84 కోట్లు ఖర్చుచేస్తారు.
- ◆ వాణిజ్య ఎగుమతిదారులకు రూ.600 కోట్ల మేర ప్రయోజనం కల్పించే పథకానికీ ఆమోదం లభించింది.
- ◆ అసోంలో స్థానిక ప్రజలకు రాజ్యాంగపరమైన, చట్టపరమైన రక్షణలు కల్పించేందుకు అవసరమైన చర్యల్ని సిఫార్సు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని నిర్ణయించింది.

పీఎఫ్‌పై పెరగనున్న వడ్డీ రేటు!

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్)పై వడ్డీ రేటు పెరిగే అవకాశం ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు 8.55 శాతం ఉంది. గత అయిదేళ్లతో పోల్చితే ఇదే అతి తక్కువ రేటు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు పెరిగే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. ఒకవేళ పెరగకపోయినా తగ్గే అవకాశాలు లేవని స్పష్టం చేశాయి. ద్రవ్యోల్బణం తగ్గుతున్నందువల్ల ప్రస్తుత వడ్డీ రేటు కొనసాగినా, ఆదాయం బాగుంటుందని పేర్కొన్నాయి. నూతన వడ్డీ రేట్లను డిసెంబరులో ప్రకటించాల్సి ఉన్నా, ఆడిటింగ్ పూర్తి కాకపోవడంతో ఈసారి ఆలస్యమయింది. ఎన్నికలకు ముందు ఫిబ్రవరి ఒకటో తేదీన కొత్త వడ్డీ రేటును వెల్లడించే అవకాశం ఉంది.

6 కోట్లకు చేరిన గ్యాస్ కనెక్షన్లు

దిల్లీ: ప్రతి ఇంటా వంటగదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. ప్రభుత్వం 6 కోట్లవ వంటగ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్‌ను అందజేసింది. ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు దిల్లీలోని ఖాన్పుర్‌కు చెందిన జస్మీనా అనే మహిళకు సంబంధిత పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ పీఎంయూవైని విప్లవాత్మక పథకంగా అభివర్ణించారు. వంటచెరకు వినియోగం లేకుండా చేస్తూ ఎల్పీజీని 90శాతం జనాభాకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.

పాక్‌కు అత్యాధునిక యుద్ధనౌక!

బీజింగ్: మిత్రపక్షం చైనా సహకారంతో పాకిస్థాన్ నౌకాదళం త్వరలో శక్తిమంతం కానుంది. పాక్‌కు నాలుగు అత్యాధునిక యుద్ధనౌకలను అందించే ఒప్పందంలో భాగంగా తొలి యుద్ధనౌకను చైనా నిర్మిస్తోంది. శత్రుభీకరమైన ఆయుధ వ్యవస్థలను అందులో పొందుపరుస్తోంది. ప్రత్యర్థి నౌకలు, జలాంతర్గాములను ధ్వంసం చేయగల సామర్థ్యం దాని సొంతమని చైనా ప్రభుత్వరంగ వార్తాసంస్థ 'చైనా డైలీ' తాజాగా ఓ కథనంలో వెల్లడించింది. షాంఘైలోని హుడాంగ్-ఝూంగ్వా నౌకాస్థావరంలో ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపింది. ఆ యుద్ధనౌక 'టైప్ 054ఏపీ' తరగతికి చెందినదని తెలుస్తోంది. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడంలో, హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి - స్థిరత్వాన్ని కొనసాగించడంలో, తీర ప్రాంతాల రక్షణలో పాక్ నౌకాదళానికి ఈ యుద్ధనౌక దోహదపడుతుందని చైనా చెబుతోంది

ఓటమి శాశ్వతం కాదు.. నిరాశ వద్దు: రాహుల్

దిల్లీ: ఓటమి ఏదీ శాశ్వతం కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విద్యార్థులకు ఉద్బోధ చేశారు. రాజస్థాన్‌లోని కోటలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "విద్యార్థులారా! మీరే మాకు గర్వకారణం. వైఫల్యాలకు ఎవరూ నిరాశ చెందవద్దు. కష్టపడి చదవండి, ధైర్యంగా ఉండండి. ఏదో రూపంలో మిమ్మల్ని విజయం వరిస్తుంది." అని రాహుల్‌గాంధీ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. పిల్లలపై ఒత్తిడి తేవద్దంటూ కోటలోని తల్లిదండ్రులను ఆయన అభ్యర్థించారు.

ఐదుగురు సైన్యాధికారులపై సీబీఐ ఎఫ్ఐఆర్

దిల్లీ: దేశ రక్షణ కోసం ప్రాణాలొడ్డి పోరాడే సైన్యంలో మరోసారి అవినీతి ఆరోపణల కలకలం చెలరేగింది. రేషన్ సరఫరాదారుల నుంచి ముడుపులు స్వీకరించారన్న ఆరోపణలతో ఐదుగురు సైన్యాధికారులపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నిందితుల్లో ఒకరు కల్నల్ స్థాయి అధికారి. అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లలో మోహరించిన బలగాలకు రేషన్ సరఫరా చేసే గుత్తేదారుల నుంచి మొత్తం రూ.18 లక్షలమేర అధికారులు ముడుపులు స్వీకరించినట్లు సీబీఐ పేర్కొంది. ఎఫ్ఐఆర్‌లో కల్నల్ రమణ్ డహ్యా, లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర కుమార్, సుబేదార్ దేవేందర్ కుమార్, హవిల్దార్ అభయ్ సింగ్, సుబేదార్ సహారణ్ సాహు, సరఫరాదారు కె.కె.యాంగ్ఫోల పేర్లు చేర్చింది. తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రేషన్ పరిమాణం, నాణ్యతపై వారు రాజీపడినట్లు ఆరోపించింది. నాగాలాండ్‌లో రేషన్ సరఫరాదారు నుంచి 2012-16 మధ్య రూ.82 లక్షల ముడుపులు స్వీకరించారన్న ఆరోపణలతో లెఫ్టినెంట్ కల్నల్ అమిత్ శర్మ, లెఫ్టినెంట్ కల్నల్ సుతీక్షణ్ రాణాలపై సీబీఐ ఇటీవల ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి గమనార్హం.

అయ్యప్ప గుడిలోకి మహిళలు

- దర్శనం చేసుకున్న ఇద్దరు 10-50 ఏళ్ల వయసు స్త్రీలు
- నిరసనలు.. ఘర్షణలు

శబరిమల – తిరువనంతపురం

ఎన్నోనిరసనలు...ఎన్నెన్నో వ్యతిరేకతలతో గత కొంత కాలం నుంచీ యాభయ్యేళ్లలోపు మహిళల ప్రవేశానికి ఎదురైన అవరోధాలను ఛేదించుకుని కనకదుర్గ, బిందులు శాశ్వత బ్రహ్మచారిగా పేరొందిన అయ్యప్ప ఆలయంలోకి బుధవారం ప్రవేశించారు. పోలీసుల సాయంతో నిర్విఘ్నంగా దర్శనం చేసుకుని వెనుదిరిగారు. పోలీసులు తర్వాత వారిని సురక్షితంగా పథనంతిట్టకు తీసుకొచ్చారు. అక్కడ్నుంచి గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన అనంతరం ప్రాంగణం నుంచి వెళ్లిపోవాల్సిందిగా ప్రధాన పూజారి భక్తులను కోరారు. గర్భగుడి తలుపులను మూసివేశారు. గంటపాటు ఆలయశుద్ధి నిర్వహించారు. అనంతరం మళ్లీ తలుపులు తెరిచారు. సంఘటనకు సంబంధించి కొన్ని స్థానిక ఛానళ్లలో దృశ్యాలు ప్రసారమైన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందిస్తూ ఇంతకు ముందు కొన్ని అడ్డంకుల కారణంగా మహిళలు ఆలయానికి వెళ్లలేకపోయే వారని, బుధవారం ఎలాంటి సమస్యలు ఎదురుకాకపోవడంతో గుడిలోకి ప్రవేశించగలిగారన్నారు. శబరిమల ఆలయంలోకి యాభయ్యేళ్లలోపు మహిళలు ఇద్దరు ప్రవేశించడం వాస్తవమేననీ.... పోలీసులు భద్రత కల్పించారని ప్రకటించారు.

ఎల్లెడలా నిరసనలు..

మహిళల దర్శనం ఘటనపై సమాచారం విస్తృతంగా వ్యాప్తి చెందడంతో నిరసనలు వెల్లువెత్తాయి. ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. తిరువనంతపురంలో రాష్ట్ర సచివాలయం వద్ద భాజపా కార్యకర్తలు నిర్వహించిన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. అధికార పార్టీ సీపీఎం, భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకుని, ఇరువర్గాలు రాళ్లు విసురుకోవడంతో రాష్ట్ర సచివాలయం పరిసరాలు దాదాపు ఐదు గంటలపాటు యుద్ధక్షేత్రాన్ని తలపింపచేశాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు జలఫిరంగులు, భాష్పవాయుగోళాల్ని ప్రయోగించారు. ఐదుగురు భాజపా మహిళా మోర్చా కార్యకర్తల్ని అరెస్టు చేశారు. మలప్పురంలో సీఎం విజయన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూత్వ సంస్థల ఉద్యమకారులు రహదారులను దిగ్బంధించారు. దుకాణాలు, మార్కెట్లను మూసివేయించారు. పలు ప్రాంతాల్లో అధికార సీపీఎం కార్యాలయాలపై దాడులు చేశారు. కొన్నిచోట్ల ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి.



శబరిమల దేవాలయం లోపలకు వెళ్తున్న బిందు, కనకదుర్గ ★ శుద్ధీకరణ నిర్వహిస్తున్న పూజారులు ★ కొచ్చిలో నిరసన చేపడుతున్న కేరళవాసులు

సచివాలయం వద్ద మీడియా సిబ్బందిపైనా దాడులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. హిందూ సంస్థలతో ఏర్పడిన శబరిమల కర్మ సమితి, అంతరాష్ట్రీయ హిందూ పరిషత్తు (ఏహెచ్‌పీ) గురువారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. బ్లాక్‌డేగా పాటించనున్నట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రకటించింది. ఇటీవల కాలంలో తరచూ బంద్‌లతో విసిగిపోయిన వ్యాపార సంఘాలు బంద్ పిలుపును తిరస్కరిస్తూ, దుకాణాలు తెరిచి ఉంచాలని నిర్ణయించాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా హిందూత్వ సంస్థలు, కార్యకర్తలు కాసరగోడ్-మంగళూరు రహదారిపై వాహనాల్ని నిలిపివేశారు. దేవస్థానం బోర్డు కార్యాలయాలకు తాళాలు వేశారు. గురువాయూర్‌లో దేవాదాయ శాఖ మంత్రి సురేంద్రన్‌కు, కన్నూరులో ఆరోగ్యమంత్రి శైలజకు భాజపా యువమోర్చా కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. కేరళ వ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో అయ్యప్ప చిత్రపటాలతో, పాటలు పాడుతూ నిరసన తెలిపారు.

ఎవరీ మహిళలు..

సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి ఎంతో మంది మహిళలు శబరిమల ఆలయానికి వెళ్లేందుకు యత్నించినా అయ్యప్ప భక్తుల నిరసనలతో వెనుదిరగాల్సి వచ్చింది. చివరికి కేరళకు చెందిన బిందు, కనకదుర్గ అనే మహిళలు గుడికి వెళ్లగలిగారు. కేరళలోని కొజికోడ్ జిల్లా కోయిలాండీకి చెంది బిందు వృత్తిరీత్యా ఓ కళాశాలలో అధ్యాపకురాలు. సీపీఎం కార్యకర్తగా పని చేస్తున్నారు. మల్లాపురం జిల్లా అంగడిపురానికి చెందిన కనకదుర్గ పౌరసరఫరాల విభాగం ఉద్యోగి. తాజా ఉదంతం నేపథ్యంలో వీరిద్దరి ఇళ్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాజా ఉదంతంపై బిందు ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ.. కొండ ఎక్కుతున్నప్పుడుగాని, పూజ చేస్తున్నప్పుడుగాని తమకు అయ్యప్ప భక్తుల నుంచి ఎలాంటి నిరసన ఎదురు కాలేదన్నారు. గతంలో మాదిరిగా కొండ ఎక్కుతున్నప్పుడు ఎక్కడా భక్తులు నామజపం చేయలేదని, కేవలం సాధారణ భక్తులు మాత్రమే ఉన్నారని, వారు తమను ఆపలేదని, నిరసనలు తెలపలేదని వివరించారు. పంబ నుంచి పోలీసులు తమకు రక్షణ కల్పించారని వెల్లడించారు. అయ్యప్ప దర్శనం కోసం వెళ్లే మహిళలు ధరించాల్సిన వస్త్రధారణలోనే వెళ్లినట్లు తెలిపారు. వీరిద్దరూ డిసెంబర్ 24న కూడా దర్శనం కోసం ప్రయత్నించి విఫలమైన విషయం గమనార్హం.

నేపథ్యమిది..

శబరిమలలోకి పది నుంచీ యాభయ్యేళ్లలోపు వయసున్న మహిళల ప్రవేశంపై ఎప్పట్నుంచి నిషేధం ఉందనే విషయంలో కచ్చితమైన ఆధారాలు లేకున్నా, 19వ శతాబ్దంలో బ్రిటిష్ సర్వే నివేదిక ప్రకారం 200 ఏళ్ల క్రితం నుంచే ఆంక్షలు ఉన్నట్లు తెలుస్తోంది. 1991 కేరళ హైకోర్టు తీర్పుతో అనధికార ఆంక్షలకు చట్టపరమైన గుర్తింపు, ఆమోదం లభించాయి.

ఎవరేమన్నారు..

అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశం ఘటనపై కేరళ విపక్షాలు కాంగ్రెస్, భాజపా.. సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై మండిపడ్డాయి. అయ్యప్ప భక్తులు రెండురోజులపాటు నిర్వహించే నామజపం నిరసనకు మద్దతు ఇస్తామని భాజపా ప్రకటించింది. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలంటూ శబరిమల కర్మ సమితి డిమాండ్ చేసింది.

భక్తుల మనోభావాలు గాయపడ్డాయి

ఇది ముఖ్యమంత్రి తలబిరుసు వైఖరిని ఎత్తిచూపుతోంది. భక్తుల మనోభావాల్ని గాయపరిచింది. మహిళల గోడ కార్యక్రమం తర్వాత వెంటనే వారిని ఎవరు గుడికి తీసుకెళ్లారు? గతంలో దర్శనానికి ప్రయత్నించినప్పటి నుంచి వారిద్దరూ కనిపించకుండా పోయారు. ఆలయ శుద్ధి వంద శాతం సరైనదే.

-రమేష్ చెన్నితల, కాంగ్రెస్ సీనియర్ నేత

అయ్యప్ప ఆగ్రహం నుంచి తప్పించుకోలేరు

సీపీఎం ప్రభుత్వం అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. కమ్యూనిస్టు నేతలు, వారి వారసులు, కేరళ ప్రభుత్వం అయ్యప్ప ఆగ్రహం నుంచి తప్పించుకోలేరు.

-శ్రీధరన్‌పిళ్లై, భాజపా కేరళ రాష్ట్రశాఖ అధ్యక్షుడు

శుభారంభం

మా ఉద్యమానికి ఇది పెద్ద విజయం, సమానత్వానికి గెలుపు. కొత్త ఏడాదిలో మహిళలకు శుభారంభం.

-తృప్తి దేశాయ్, భూమాత బ్రిగేడ్ నేత

ప్రతి ఒక్కరూ ఆమోదించాలి

శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించాలని కోరుకుంటున్నాం. అయితే రహస్యంగా కాకుండా, బహిరంగంగా జరగాలని, ప్రతి ఒక్కరూ ఆమోదించాలనేది మా వైఖరి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు మహిళలు ఆలయంలోకి ప్రవేశించడం మంచిదే.

-సురవరం సుధాకరరెడ్డి, సీపీఐ ప్రధాన కార్యదర్శి

ప్రతి మహిళకూ హక్కుంది

శబరిమల అయ్యప్ప ఆలయంలో పూజలు చేసుకునే హక్కు ప్రతి మహిళకూ ఉంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. కనకదుర్గ, బిందు అనే మహిళలు.... .అయ్యప్పను దర్శించుకోవాలనుకున్నారు. అందుకే, వారికి అవసరమైన భద్రతను కేరళ ప్రభుత్వం కల్పించింది.

-బృందా కారాట్, సీపీఎం నాయకురాలు

ఆధార్ ఇక తప్పనిసరి కాదు!

- అది లేకున్నా బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డుల జారీ
- లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం

దిల్లీ: బ్యాంకు ఖాతాలను తెరుచుకునేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్లు పొందేందుకు ఇక ఆధార్ తప్పనిసరికాకపోవచ్చు. ధ్రువీకరణ నిమిత్తం దీనిని స్వచ్ఛందంగానే సమర్పించుకునేందుకు వీలు కల్పించే 'ఆధార్-ఇతర చట్టాల సవరణ బిల్లు-2018'ను బుధవారం కేంద్ర న్యాయ, ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీని ప్రకారం- ఆధార్ లేదని బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డుల జారీకి ఆయా సంస్థలు నిరాకరించడం కుదరదు. ఇందుకు అనుగుణంగా ఆధార్, టెలికాం, బ్యాంకింగ్ నియంత్రణ చట్టాలకు ఈ బిల్లులో సవరణలను ప్రతిపాదించారు. ఆధార్ చట్టాన్ని అతిక్రమించే సంస్థలపై రూ.కోటి వరకూ; అదే తప్పులను పునరావృతం చేసిన పక్షంలో రోజుకు రూ.10 లక్షల వరకూ జరిమానా పడుతుందని ఈ బిల్లులో ప్రభుత్వం పేర్కొంది. వ్యక్తిగత గుర్తింపు సమాచారాన్ని అనధికారికంగా ఉపయోగించే వ్యక్తులకు మూడేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.10 వేల వరకూ జరిమానా; అదే సంస్థలకైతే రూ.లక్ష వరకూ జరిమానా తప్పదు. ఆధార్ వ్యవస్థలోకి అనధికారికంగా చొరబడి, మార్పులు చేర్పులకు పాల్పడితే ప్రస్తుతమున్న మూడేళ్ల జైలు శిక్షను పదేళ్లకు పొడిగించే అవకాశం ఉంది. వ్యక్తుల అనుమతి లేకుండా వారి ఆధార్ సంఖ్యలను ఆఫ్‌లైన్‌లో పరిశీలించడాన్ని నిషేధించనున్నట్లు బిల్లులో ప్రభుత్వం పేర్కొంది.

అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్

కావేరి జలాల విషయమై అన్నాడీఎంకేకు చెందిన సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి, ప్లకార్డులను చేతబూని నినాదాలు చేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ వారించినా ఫలితం లేకపోయింది. వీరిలో కొందరు కాగితాలను చించేసి అధికారులు కూర్చునే బెంచీలవైపు విసిరారు. దీంతో స్పీకర్ ఆ పార్టీకి చెందిన 24 మంది సభ్యులను ఐదు పనిదినాల వరకూ సస్పెండ్ చేశారు.



రాజ్యసభ క్యాలెండర్-2019ను విడుదల చేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి జైట్లీ తదితరులు

రాజ్యసభలోనూ రగడ...

కావేరి అంశం విషయమై అన్నాడీఎంకే, డీఎంకే సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేస్తుండటంతో రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు వారిని ఒక రోజు పాటు సస్పెండ్ చేశారు. సభలో గడబిడ కొనసాగుతుండగానే... జమ్ము-కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనకు సంబంధించి హోంమంత్రి రాజ్‌నాథ్ ప్రకటన చేశారు.

పరిష్కారం చూపాలని కేంద్రానికి సూచన

పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు విఘాతంగా మారిన కావేరి జల వివాదానికి పరిష్కారం కనుగొనేలా రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు బుధవారం ఆయా పార్టీల నేతలతో సంప్రదింపులు నిర్వహించారు. కర్ణాటకలో కావేరి నదిపై మాకెదాతు జలాశయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలకు చెందిన ఎంపీలు ఉభయ సభల్లోనూ నిరసన వ్యక్తం చేస్తుండడంతో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు స్పందించారు. ఆయన సూచన మేరకు- కావేరి సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్‌గోయెల్, జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీలు ఆయా పార్టీల నేతలతో చర్చలు జరపనున్నారు.

'సముద్ర మార్గ జిహాద్'కు పాక్‌లో శిక్షణ

సముద్ర మార్గం ద్వారా మన దేశంపై దాడులకు పాల్పడేందుకు పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రవాదులకు శిక్షణ కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహీర్ బుధవారం రాజ్యసభకు వెల్లడించారు. 'సముందరీ జిహాద్' పేరుతో సముద్ర జలాల ద్వారా భారత్‌పై దాడుల కోసం ఉగ్రమూకలు శిక్షణ పొందుతున్నాయని చెప్పారు. ఓడరేవులు, సరకు రవాణా నౌకలు, చమురు ట్యాంకర్లపై ముంబయి ఉగ్రదాడుల తరహాలో దాడులు చేయవచ్చనే నిర్దిష్ట సమాచారమేదీ ప్రస్తుతానికి అందుబాటులో లేదని రాతపూర్వక సమాధానంలో వివరించారు. అయితే సముద్ర మార్గాల ద్వారా మన దేశంలోకి ఉగ్రవాదులను పంపించేందుకు తగిన సామర్థ్యాన్ని మాత్రం ఉగ్రవాదులు సమకూర్చుకుంటున్నారని చెప్పారు.

ఈ రూ.9,395 కోట్లు ఎవరివో

ఈనాడు, దిల్లీ: దేశంలో తపాలా శాఖలో ఎవరూ క్లెయిం చేయని మొత్తాలు రూ.9,395 కోట్లు ఉన్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. ఈ మేరకు బుధవారం లోక్‌సభకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కిసాన్ వికాస్ పత్రాలు, నెలవారీ ఆదాయ పథకం ఖాతా, జాతీయ పొదుపు పత్రాలు, ప్రజా భవిష్య నిధి, రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) ఖాతా, కాల పరిమితి ఖాతాల్లో ఈ మొత్తం ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి మొత్తాలు ఆంధ్రప్రదేశ్‌లో రూ.224.29 కోట్లు, తెలంగాణలో రూ.164.16 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. అత్యధికంగా పశ్చిమ బెంగాల్లో రూ.1591.16 కోట్లు ఉన్నట్లు తెలిపారు.



ఇటు చూడు..

అవును ఇది నిజం. చూపుడు వేలిపై ఫుట్‌బాల్‌ను గిర్రున తిప్పుతోంది పోప్ ఫ్రాన్సిసే. వాటికన్‌లోని పాల్-4 హాల్‌లో బుధవారం ఆయన నైపుణ్యం చూసి క్యూబా సర్కస్ కళాకారుడు నోరు వెళ్లబెట్టాడు.

చినూక్, అపాచె వచ్చేస్తున్నాయ్

- మార్చిలో భారత అమ్ములపొదిలో చేరనున్న అత్యాధునిక హెలికాప్టర్లు

దిల్లీ: సైనిక సామర్థ్యాన్ని పరిపుష్టం చేసేలా భారత అమ్ములపొదిలో త్వరలో సరికొత్త అస్త్రాలు చేరనున్నాయి. అమెరికా నిర్మించిన అత్యాధునిక చినూక్, అపాచె హెలికాప్టర్లు మార్చిలో సాయుధ బలగాలకు అందనున్నాయి. తొలి విడతగా అందించనున్న హెలికాప్టర్లను అమెరికా రక్షణ విభాగ గుత్తేదారు 'బోయింగ్' ఇప్పటికే కంటెయినర్లలో పంపించింది. అవి గుజరాత్‌లోని ముంద్రా తీరానికి వచ్చే నెల్లో చేరే అవకాశముంది. పనితీరును పరీక్షించిన అనంతరం వాటిని సాయుధ దళాలకు మార్చిలో అప్పగిస్తారు. మొత్తం మూడు బిలియన్ డాలర్ల వ్యయంతో 15 చినూక్, 22 అపాచె హెలికాప్టర్లను భారత్ కొనుగోలు చేస్తోంది. భారీ బరువులను మోయగల సామర్థ్యం చినూక్ హెలికాప్టర్ల సొంతం. వాటిని చండీగఢ్ వైమానిక స్థావరంలో ఉంచుతారు. అత్యంత క్లిష్టమైన సియాచిన్, తూర్పు లద్దాఖ్ సెక్టార్లకు రవాణా సాధనాలుగా వాటిని ఉపయోగిస్తారు. అపాచె హెలికాప్టర్లు శత్రుభీకరమైనవి. వాటి ద్వారా క్షిపణుల వర్షం కురిపించవచ్చు. గాజియాబాద్‌లోని హిండన్ వైమానిక స్థావరంలో ఈ హెలికాప్టర్లను ఉంచనున్నారు.

వచ్చే ఏడాది అక్టోబరు నుంచి అందనున్న 'ఎస్-400'

దిల్లీ: రష్యా నుంచి కొనుగోలు చేస్తున్న ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు వచ్చే ఏడాది అక్టోబరు నుంచి మనదేశ అమ్ములపొదిలో చేరనున్నాయి. 2023 ఏప్రిల్ కల్లా వీటి స్వీకరణ పూర్తవుతుంది. లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా రక్షణశాఖ సహాయమంత్రి సుభాష్ భామ్రే బుధవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. రూ.40 వేలకోట్లతో ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు రష్యాతో మనదేశం ఒప్పందం కుదుర్చుకున్న సంగతి గమనార్హం.

కడుపు మండిన రైతు

- 19 టన్నుల ఆలుగడ్డలకు రూ.490
- ఆ మొత్తం ప్రధానికి మనీ ఆర్డర్

ఆగ్రా: దేశంలో మరో రైతు తన ఆక్రోశాన్ని వినిపించేందుకు మనీ ఆర్డర్ అస్త్రాన్ని ఎంచుకున్నాడు. చెమటోడ్చి పండించిన 19 టన్నుల బంగాళాదుంపలకు కేవలం రూ.490 ప్రతిఫలంగా లభించడంతో ఆ మొత్తాన్నీ ప్రధాని నరేంద్ర మోదీకి పంపి తన నిరసనను తెలియజేశాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ప్రదీప్ శర్మ అనే రైతు ఈ పని చేశారు. రైతుల అగచాట్లను తెలియజెప్పేందుకే తాను ఆ డబ్బును ప్రధానికి మనీ ఆర్డర్ చేశానని ఆయన వెల్లడించారు. ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతించాలని కూడా ప్రధాని, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు తాను లేఖలు రాశానని, సమస్యలను పరిష్కరించాలని ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రిని కలిసి అభ్యర్థించినా ఫలితం లేకపోయిందని వివరించారు. బంగాళదుంపలను పండించేందుకు క్వింటాల్‌కు రూ.800 వరకు వ్యయమవుతుంటే.. ప్రభుత్వం కేవలం రూ.549 కనీస మద్దతు ధరను కల్పిస్తోందని వాపోయారు. అందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు వెళ్లడం లేదని అన్నారు. ఇటీవల మహారాష్ట్రకు చెందిన ఓ రైతు కూడా 750 కేజీల ఉల్లిపాయలను విక్రయించగా వచ్చిన రూ.1,064 మొత్తాన్ని ప్రధానికి మనీ ఆర్డర్ చేశారు.

నేటి నుంచి పంజాబ్‌లో సైన్స్ కాంగ్రెస్

ప్రారంభించనున్న ప్రధాని మోదీ


చండీగఢ్: పరిశోధనలు, నవకల్పనలపై చర్చించేందుకుగాను వివిధ దేశాలకు చెందిన సైన్స్ ప్రేమికులను ఒక్కచోటికి చేర్చే 'భారత సైన్స్ కాంగ్రెస్' గురువారం పంజాబ్‌లోని జలంధర్‌లో ప్రారంభంకానుంది. ఈనెల 7 వరకు కొనసాగనున్న ఈ వార్షిక మహా సదస్సుకు లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం ఆతిథ్యమిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించి ప్రసంగిస్తారు. జర్మనీ, హంగేరి, ఇంగ్లాండ్ తదితర దేశాలకు చెందిన ఆరుగురు నోబెల్ గ్రహీతలు సహా దాదాపు 30 వేల మంది శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు. 'భవిష్యత్తు భారత్ - శాస్త్ర సాంకేతికత' అనే అంశాన్ని ఈ ఏడాది సదస్సుకు ఇతివృత్తంగా ఎంచుకున్నారు.

పరస్పర అంగీకారంతో కూడిన శృంగారం అత్యాచారం కాదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: సహజీవనంలో ఉన్న వ్యక్తుల మధ్య పరస్పర అంగీకారంతో కూడిన లైంగిక బంధాన్ని అత్యాచారంగా పరిగణించకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కొంతకాలం తనతో సహజీవనం సాగించిన వైద్యుడిపై మహారాష్ట్రకు చెందిన వితంతువైన ఓ నర్సు పెట్టిన కేసును కొట్టివేస్తూ జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. అత్యాచారం, పరస్పర అంగీకారంతో కూడిన శృంగారం మధ్య భేదం స్పష్టంగా ఉందని వ్యాఖ్యానించింది. ''పెళ్లాడాలన్న ఉద్దేశం నిందితుడికి ఉన్నా.. ఆ తర్వాత పరిస్థితులు మారడం, అనివార్య కారణాల వల్ల అందుకు అతడికి వీలు పడకపోవచ్చు. ఈ కేసులో ఫిర్యాదు చేసిన మహిళ, నిందితుడు కొంతకాలం సహజీవనంలో ఉన్నారు. అతడు వేరే మహిళను పెళ్లాడినట్లు తెలిసిన తర్వాత.. ఆమె ఫిర్యాదు చేశారు. ఆమె ఆరోపణలు పూర్తిగా వాస్తవమని పరిగణించినా.. నిందితుడు నేరం చేసినట్లు పరిగణించడానికి ఏమీ లేదు'' అని ధర్మాసనం పేర్కొంది.

ఛాంపియన్



సచిన్ తెందుల్కర్ కోట్లాది మంది క్రికెట్ అభిమానులకు ఆరాధ్యుడు.. వేలాది మంది క్రికెటర్లకు స్ఫూర్తి! అతడి ఆటకు ముగ్ధులయ్యాం. రెండు దశాబ్దాలకు పైగా అతడి ఆటను ఆస్వాదించాం. ఆనంద డోలికల్లో తేలియాడాం! అతడి ఘనతల్ని కీర్తించాం!

మరి ప్రపంచానికి సచిన్ అంటే ఏంటో తెలియనపుడు అతడి ప్రతిభను గుర్తించిందెవరు? అతను ఛాంపియన్ అవుతాడని అంచనా వేసిందెవరు? కఠిన శిక్షణతో అతడిని తీర్చిదిద్దిందెవరు? అతడిని ఒక శిల్పంలా తయారు చేసిందెవరు?

ఇంకెవరు.. రమాకాంత్ ఆచ్రేకర్!

సచిన్ కోచ్‌గా ప్రపంచ వ్యాప్త గుర్తింపు సంపాదించిన ఈ గురు దిగ్గజం తన జీవన ప్రయాణాన్ని ముగించాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన బుధవారం తుది శ్వాస విడిచాడు.

ఆచ్రేకర్ కన్నుమూత

ముంబయి

సచిన్ తెందుల్కర్ కోచ్, దిగ్గజ గురువు రమాకాంత్ ఆచ్రేకర్ (87) కన్నుమూశాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆచ్రేకర్ బుధవారం సాయంత్రం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచాడు. 2013లో గుండెపోటు తర్వాత ఆచ్రేకర్ ఆరోగ్యం మరింత క్షీణించింది. సరిగ్గా తన పుట్టిన రోజు నాడే ఆచ్రేకర్ మరణించాడు. "ఆచ్రేకర్ సర్ మనల్ని విడిచి వెళ్లిపోయాడు. సాయంత్రం కన్నుమూశాడు" అని ఆయన కుమార్తె రష్మి దాల్వి ప్రకటించింది.

మీరు వేసిన పునాదిపైనే నేను

రమాకాంత్ ఆచ్రేకర్ సర్ చేరికతో స్వర్గంలో క్రికెట్ సుసంపన్న మవుతుంది. చాలా మంది శిష్యులలాగే సర్ దగ్గర నేను క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నా. నా జీవితంలో ఆయన పాత్ర గురించి మాటల్లో చెప్పలేను. ఆయన వేసిన పునాదిపైనే నేను నిలబడ్డా.



గత నెలలోనే సర్‌ను కలిశా. పాత విషయాలు గుర్తు చేసుకుని నవ్వుకున్నాం. స్ట్రెయిట్‌గా ఆడడం, జీవితంలో నిజాయతీగా ఉండడం నేర్పించారు. మీ జీవితంలో మమ్మల్ని భాగం చేసుకున్నందుకు థాంక్యూ సర్. మీరు ఎక్కడున్నా మీ కోచింగ్ కొనసాగాలని కోరుకుంటున్నా.

– సచిన్ తెందుల్కర్

మాస్టర్‌కే మాస్టర్

1932 జనవరి 2న మహారాష్ట్రలో జన్మించిన ఆచ్రేకర్.. క్రికెట్ గుగ్గురువుగా పేరు తెచ్చుకున్నాడు. సచిన్, వినోద్ కాంబ్లి, చంద్రకాంత్ పండిట్, ప్రవీణ్ ఆమ్రే, అజిత్ అగార్కర్, రమేశ్ పొవార్, సమీర్ దిఘే, బల్వీందర్‌సింగ్ సంధు వంటి క్రికెటర్లను తీర్చిదిద్దాడు. కోచింగ్ కెరీర్‌తో పోల్చుకుంటే ఆచ్రేకర్ గొప్ప ఆటగాడేమీ కాదు. 1943లో క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన ఆచ్రేకర్ 1945లో న్యూ హింద్ స్పోర్ట్స్ క్లబ్‌కు ఆడాడు. యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, ముంబయి పోర్ట్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 1963లో హైదరాబాద్‌తో జరిగిన మొయినుద్దౌలా గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లో ఎస్‌బీఐ తరపున బరిలో దిగాడు. ఆచ్రేకర్ ఆడిన ఏకైక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ అదే. కొద్దికాలం ముంబయి సెలెక్టర్‌గా కూడా పనిచేశాడు. అనంతరం శిక్షకుడిగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. శివాజీ పార్క్‌లో కామత్ మెమోరియల్ క్రికెట్ క్లబ్‌ను స్థాపించి వర్ధమాన ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చాడు. 11 ఏళ్ల వయసులో సచిన్.. ఆచ్రేకర్ అకాడమీలో చేరడం అతడి కెరీర్‌తో పాటు భారత క్రికెట్ ముఖచిత్రాన్నే మార్చేసింది. పాఠశాల స్థాయిలో ఫాస్ట్ బౌలర్‌గా కెరీర్ మొదలుపెట్టిన సచిన్‌ను బ్యాట్స్‌మన్‌గా మార్చింది ఆచ్రేకరే. ప్రపంచంలోనే సచిన్‌ను మేటి క్రికెటర్‌గా తయారు చేసిన ఆచ్రేకర్‌ను 1990లో ద్రోణాచార్య పురస్కారం వరించింది. 2010లో పద్మశ్రీ పురస్కారం లభించింది.

గురువు కాదు అంతకుమించి

ఈనాడు క్రీడావిభాగం

గురువంటే శిష్యుడికి మార్గనిర్దేశత్వం చేస్తాడు. రమాకాంత్ ఆచ్రేకర్ కూడా అదే చేశాడు. తన శిష్యులకు ఆట నేర్పాడు, క్రమశిక్షణ నేర్పాడు. అంతకుమించి వారికి.. ఆటపై ప్రేమను పెంచాడు. తన శిష్యుల అభ్యున్నతికి అహర్నిశలూ కృషి చేశాడు. ఒక మామూలు పిల్లాణ్ని ప్రపంచ అత్యుత్తమ ఆటగాడిగా తీర్చిదిద్ది, క్రికెట్ దేవుడిగా నిలబెట్టాడు. భారత క్రికెట్‌కి సచిన్ తెందుల్కర్ లాంటి వజ్రాన్ని అందించాడు.

నాణెంతో ఆట

శిక్షణలో భాగంగా సచిన్ అలసిపోకుండా ఎంతసేపైనా ఆడేందుకు ఆచ్రేకర్ రూపాయి నాణేలను వాడేవాడు. వాటిని స్టంప్స్‌పై ఉంచి పడగొట్టమని బౌలర్లకు సవాలు విసిరేవాడు. అవి పడకుండా బ్యాటింగ్ చేస్తే వాటిని సచిన్‌కు ఇస్తానని చెప్పేవాడు. దాంతో సచిన్ ఎంతో ఏకాగ్రతగా గంటల పాటు వికెట్ పోగొట్టుకోకుండా ఆడేవాడు. అలా సొంతం చేసుకున్న నాణేలు ఎంతో ప్రీతిపాత్రమైనవని చెప్పే సచిన్ ఇప్పటికీ వాటిని దాచుకున్నాడు.



"ఆచ్రేకర్ సర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నా. భారత క్రికెట్‌కు ఒక వజ్రాన్ని అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు"

– వీవీఎస్ లక్ష్మణ్

చెంప చెళ్లు

బయట ఎలా ఉన్నా కూడా ఆట విషయానికి వచ్చే సరికి ఆచ్రేకర్ చాలా కఠినంగా ఉండేవాడు. ఎవరైనా పొరపాటు చేసినట్లు కనిపించినా.. ఉపేక్షించేవాడు కాదు. అలాంటి ఓ సందర్భంలోనే అతను సచిన్ చెంప చెళ్లుమనిపించాడు. ఓ రోజు సచిన్ తన మ్యాచ్‌కు వెళ్లకుండా స్కూల్ సీనియర్స్ ఆడుతున్న ఫైనల్ మ్యాచ్‌ను చూస్తూ కూర్చున్నాడు. అప్పుడే అక్కడికి వచ్చిన ఆచ్రేకర్.. సచిన్ చెంప మీద బలంగా కొట్టి.. "వేరేవాళ్లు మైదానంలో ఆడుతుంటే చూస్తూ నువ్వు చప్పట్లు కొట్టడం కాదు. నువ్వు ఆడుతుంటే నీ ఆటను చూసి జనం చప్పట్లు కొట్టాలి" అని చెప్పాడు. ఆ సంఘటనను జీవితంలో మర్చిపోలేనని చెప్పే సచిన్ ఆ మాటలే తనలో ప్రేరణను రగిలించాయంటాడు.

బాగా ఆడితే.. వడా పావ్

మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లను కోచ్‌లు అభినందించడం మనం చూస్తునే ఉంటాం. కానీ ఆచ్రేకర్ శైలి దానికి భిన్నం. తన శిష్యులు ఎంత గొప్ప ప్రదర్శన చేసినా అతనెప్పుడూ బాగా ఆడావని చెప్పేవాడే కాదు. అలా చెబితే వాళ్ల ప్రదర్శన అక్కడితోనే ఆగిపోతుందని, మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నించరని ఆచ్రేకర్ అభిప్రాయం. అందుకే సచిన్ కెరీర్ ఆరంభం నుంచి క్రికెట్‌కు వీడ్కోలు పలికేంత వరకు కూడా బాగా ఆడావని ఆచ్రేకర్ ఎప్పుడూ అనలేదు. కాకపోతే మంచి ఇన్నింగ్స్ ఆడిన రోజు మాత్రం వడాపావ్ తినిపించేవాడు. ఆచ్రేకర్ స్కూటర్ వడాపావ్ బండి దగ్గర ఆగిందా.. ఆ రోజు మంచి ఇన్నింగ్స్ ఆడాననే ప్రశంస పొందానని సచిన్ అనుకునేవాడు. తన చివరి టెస్టు తర్వాత సచిన్ మాట్లాడుతూ... "బాగా ఆడావని సర్ (ఆచ్రేకర్) నాకెప్పుడూ చెప్పలేదు. అలా చెబితే నేను అక్కడితోనే ఆగిపోతానని సర్ అనుకునేవారు. ఇక నేను ఆడేందుకు మ్యాచ్‌లే లేవు కాబట్టి ఇప్పుడైనా చెబుతారా సర్" అని తెలిపాడు.



"రమాకాంత్ ఆచ్రేకర్ గొప్ప క్రికెటర్లను తయారు చేయడమే కాదు, మంచి మనుషులుగా కూడా తీర్చిదిద్దారు. భారత క్రికెట్‌కు ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి"

– బీసీసీఐ

"మొదట్లో నేను స్పిన్నర్‌ను. కానీ ఆచ్రేకర్ సర్ నన్ను పేసర్‌గా మార్చాడు. ఓ యువ క్రికెటర్‌లోని ప్రతిభను ఎలా వెలుగులోకి తేవాలో ఆయనకు బాగా తెలుసు"

– మాజీ పేసర్ బల్వీందర్ సంధూ

గురు పూజ కోసం

తాను జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆచ్రేకర్ అంటే సచిన్‌కు ఎనలేని అభిమానం. ప్రతి గురుపౌర్ణమికి సచిన్ తన గురువు దగ్గరకు వెళ్లేవాడు. సచిన్‌తో పాటు ఆచ్రేకర్ దగ్గర శిక్షణ పొందిన వినోద్ కాంబ్లి, చంద్రకాంత్ పండిట్, అమోల్ ముజుందార్, ఆమ్రె లాంటి వాళ్లు అందరూ కలిసి వెళ్లి అతడిని సత్కరించేవాళ్లు. ప్రతిభావంతులను గుర్తించి వారి దగ్గర డబ్బు లేకపోతే ఉచితంగానే నేర్పేవాడు ఆచ్రేకర్.

సిడ్నీలో గెలిస్తే చాలా గొప్ప

సిడ్నీ: చరిత్ర గురించి తాను పట్టించుకోనని టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. కానీ సిడ్నీలో నెగ్గి ఆస్ట్రేలియాలో మొట్టమొదటి సిరీస్ సాధిస్తే అది గొప్ప ఘనత అవుతుందని చెప్పాడు. నాలుగేళ్ల కింద ధోని టెస్టు కెప్టెన్సీకి అకస్మాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంతో సిడ్నీలోనే కోహ్లి సారథిగా బాధ్యతలు అందుకున్నాడు. "నేను కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్లే అయింది. సిడ్నీలో భారత్ సిరీస్ గెలిస్తే అది గొప్ప ఘనతే. ఎందుకంటే ఇక్కడ టెస్టు సిరీస్ ఆడడం నాకిది మూడోసారి. ఇక్కడ సిరీస్ నెగ్గడం ఎంత కష్టమో నాకు తెలుసు. సిడ్నీలో సిరీస్ గెలిస్తే జట్టంతటికీ అది గొప్ప ఘనత అవుతుంది. ఎందుకంటే ఇక్కడే మాలో మార్పు మొదలైంది. ఇదే వేదికలో ధోని కెప్టెన్సీని వదులుకున్నాడు. అప్పటికి మాది కుర్ర జట్టు. ర్యాంకుల్లో ఆరు లేదా ఏడో స్థానంలో ఉన్నాం. ఇప్పుడు నంబర్‌వన్ జట్టుగా ఆస్ట్రేలియాలో అడుగుపెట్టాం" అని అన్నాడు. సిడ్నీ పిచ్ సాధారణంగా తొలి 2-3 రోజులు బ్యాటింగ్‌కు సహకరిస్తుందని, ఆ తర్వాత రివర్స్ స్వింగ్, స్పిన్‌కు అనుకూలిస్తుందని అతడు అన్నాడు. తాము చరిత్ర గురించి ఆలోచించమని, ప్రస్తుతం చేయాల్సిన పనిపై దృష్టిపెడతామని కోహ్లి చెప్పాడు. కోహ్లి 3-1తో సిరీస్ గెలిస్తే విదేశీ గడ్డపై అత్యంత విజయవంతమైన కెప్టెన్ అవుతాడు. ఐతే ఇక్కడ ఎవరికీ నిరూపించడానికి ఏమీ లేదని అతడు అన్నాడు. "చరిత్రను మార్చాలనే ఉద్దేశంతో మేం ఆడట్లేదు. ప్రపంచంలో ఎక్కడైనా ఏ జట్టునైనా ఓడించగలమనే నమ్మకాన్ని పెంచుకోవాలనుకుంటున్నామంతే" అని కోహ్లి చెప్పాడు.

ఆంధ్ర, హైదరాబాద్ మ్యాచ్ డ్రా

ఈనాడు, విజయనగరం: ఆంధ్ర, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ గ్రూప్-బి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 33/0తో బుధవారం ఉదయం ఆట కొనసాగించిన హైదరాబాద్ నాలుగో రోజు మ్యాచ్ ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 5 వికెట్లకు 251 పరుగులు చేసింది. కెప్టెన్ అక్షత్‌రెడ్డి (65), సందీప్ (45), హిమాలయ్ (60 నాటౌట్) రాణించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన ఆంధ్రకు 3, హైదరాబాద్‌కు ఒక పాయింటు లభించాయి.

మెరిసిన శ్రీకాంత్, ప్రణీత్

దిల్లీపై బెంగళూరు విజయం



అహ్మదాబాద్: పీబీఎల్‌లో బుధవారం బెంగళూరు ర్యాప్టర్స్ జట్టు 2-1తో దిల్లీ డాషర్స్‌పై విజయం సాధించింది. మొదట పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను దిల్లీ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. కానీ ఆ జట్టు ఆటగాడు హెచ్.ఎస్. ప్రణయ్ 12-15, 15-14, 13-15తో సాయి ప్రణీత్ చేతిలో ఓడిపోయాడు. ఆ తర్వాత మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ (బెంగళూరు ట్రంప్)లో మార్కస్ ఎలిస్, లారెన్ స్మిత్ ద్వయం 13-15, 9-15తో జాంగ్‌జిత్, కొసెత్స్‌కయా జోడీ (దిల్లీ) చేతిలో కంగుతింది. మూడో మ్యాచ్‌లో శ్రీకాంత్ 15-6, 12-15, 15-10తో సుగియార్తోను ఓడించి బెంగళూరును తిరిగి ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. నాలుగో మ్యాచ్‌లో మహిళల సింగిల్స్‌లో టి.టి.వు 12-15, 15-3, 15-8తో లీపై నెగ్గడంతో బెంగళూరు విజయం ఖరారైంది. ఆఖరి మ్యాచ్‌లో పురుషుల డబుల్స్‌లో బియావో-జాంగ్‌జిత్ (దిల్లీ) జోడీ 15-7, 11-15, 15-14తో ఎహ్సాన్-సెతియావాన్ జోడీని ఓడించింది.

తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవాలని ఉవ్విళ్లూరుతున్న టీమ్ ఇండియా ఆఖరి సమరానికి సన్నద్ధమైంది. కంగారూలతో నాలుగో టెస్టు గురువారం నుంచే. సిరీస్‌లో 2-1 ఆధిక్యంతో రెట్టించిన విశ్వాసంతో ఉన్న కోహ్లీసేన ఇప్పటికే 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. కానీ ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ ఫిట్‌నిస్‌పైనే అనిశ్చితి నెలకొంది.





చరిత్ర సృష్టించాలని

కోహ్లీసేన తహతహ

ఉ.5 గంటల నుంచి సోని నెట్‌వర్క్‌లో

- ఆస్ట్రేలియాతో ఆఖరి టెస్టు నేటి నుంచే
- అశ్విన్ ఫిట్‌నెస్‌పై అనిశ్చితి?
- ఇషాంత్ ఔట్

సిడ్నీ

సిడ్నీ టెస్టు కోసం భారత జట్టు మేనేజ్‌మెంట్ బుధవారం 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. కానీ పెద్ద గందరగోళమే చెలరేగింది. నాలుగో టెస్టుకు ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ ఫిట్‌గా లేడని జట్టు ప్రతినిధి ప్రకటించాడు. కానీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆ తర్వాత ప్రకటించిన 13 మంది సభ్యుల జట్టులో అతడికి చోటు లభించింది. ఐతే ఇప్పటికే అతడి ఫిట్‌నెస్‌పై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ఫామ్‌లోనే ఉన్న ఇషాంత్ ఇందులో లేకపోవడం మరో ఆశ్చర్యకర విషయం. అతడి స్థానంలో ఉమేశ్ యాదవ్ జట్టులోకి వచ్చాడు. ఇషాంత్ పక్కటెముకల్లో నొప్పితో బాధపడుతున్నాడని జట్టు ప్రతినిధి తెలిపాడు. ఎడమచేతివాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు కూడా 13లో స్థానం లభించింది. రోహిత్ శర్మ స్థానంలో కేఎల్ రాహుల్ వచ్చాడు.

కోహ్లి కూడా చెప్పాడు..

అశ్విన్ ఫిట్‌గా లేడని భారత జట్టు ప్రతినిధే కాదు, కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా చెప్పాడు. నిరుడు ఇంగ్లాండ్‌లోలాగే అతణ్ని పక్కటెముకల నొప్పి ఇబ్బంది పెడుతోందని అన్నాడు. "దురదృష్టమేమంటే.. ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన సమస్యే అశ్విన్‌కు ఇప్పుడూ ఎదురైంది. అతడు పక్కటెముకల నొప్పితో బాధపడుతున్నాడు. అతడు గాయం నుంచి కోలుకునేందుకు ఫిజియో, ట్రెయినర్ సహకరిస్తున్నారు. అశ్విన్ మాకు చాలా కీలక ఆటగాడు. అతడు నూరు శాతం ఫిట్‌గా ఉండాలని మేం కోరుకుంటున్నాం. కానీ అతడు సమయానికి కోలుకోలేకపోవడం నిరాశ కలిగిస్తోంది. ఐతే హనుమ విహారి కూడా బాగానే బౌలింగ్ చేస్తున్నాడు. ఎప్పుడు బంతి ఇచ్చినా వికెట్లు తీసేలా కనిపిస్తున్నాడు. అశ్విన్ లేకున్నా మేం ఆందోళన చెందకుండా చూస్తున్నాడు" అని కోహ్లి చెప్పాడు. దీంతో ఆఖరి టెస్టులో అశ్విన్ ఉండడనే అనుకున్నారంతా. కానీ రెండు గంటల తర్వాత టీమ్ మేనేజ్‌మెంట్ ప్రకటించిన తుది 13లో అతడు ఉన్నాడు. ఇషాంత్ గైర్హాజరీలో అనుభవజ్ఞుడు ఉండాలన్న ఉద్దేశంతో అతణ్ని తీసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇషాంత్‌ను తప్పించడం కూడా ఆశ్చర్యమే. నిజానికి షమినే జట్టులో ఉండకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. జాకెట్ ధరించి మైదానంలోకి వచ్చిన అతడు సాధన చేయలేదు. ఇక తిరిగి జట్టులోకి వచ్చిన రాహుల్.. తన మిత్రుడు మయాంక్ అగర్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. విహారి తిరిగి ఆరో స్థానంలోకి వెళ్లిపోతాడు. షమి, బుమ్రా, జడేజా తుది జట్టులో ఉండడం ఖాయం. మిగిలిన ఒక్క స్థానం కోసం అశ్విన్, ఉమేశ్, కుల్‌దీప్‌ల మధ్య పోటీ ఉంది. ఉదయం టాస్‌కు ముందు అశ్విన్ ఫిట్‌నెస్‌పై అంచనాకు వస్తారని బీసీసీఐ తెలిపింది.

నాలుగో టెస్టుకు భారత జట్టు

రాహుల్, మయాంక్, పుజారా, కోహ్లి, రహానె, హనుమ విహారి, రిషబ్ పంత్, జడేజా, కుల్‌దీప్ యాదవ్, అశ్విన్, షమి, బుమ్రా, ఉమేశ్.


టీమ్‌ఇండియా జాగ్రత్త

సౌరభ్ గంగూలీ

మెల్‌బోర్న్‌లో చారిత్రక విజయం సాధించిన టీమ్‌ఇండియా చివరి టెస్టుకు సిద్ధమైంది. రెండు జట్లకు ఇది ముఖ్యమైన మ్యాచ్. ప్రధానంగా ఆస్ట్రేలియాలో తొలి టెస్టు సిరీస్ నెగ్గాలనుకుంటున్న భారత్‌కు ఈ మ్యాచ్ కీలకం. టాస్ గెలిచిన జట్లే ఇప్పటివరకు మ్యాచ్ గెలవడం యాదృచ్ఛికం. మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 106 పరుగులకే ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడం చూస్తుంటే సిడ్నీలో కూడా టాస్ గెలిచిన జట్టే గెలుస్తుందనిపిస్తోంది. సిడ్నీ పిచ్ గురించి చర్చ సాగుతోంది. పిచ్‌పై కొద్దిగా పచ్చిక ఉండే అవకాశం ఉంది. రెండో స్పిన్నర్‌ను ఎంచుకొనే విషయంలో టీమ్‌ఇండియా జాగ్రత్తగా ఉండాలి. ఆస్ట్రేలియా మరో స్పిన్నర్‌గా మార్నస్‌ను జట్టులోకి తీసుకుంది. అయినప్పటికీ సిడ్నీలో ఆ జట్టు రెండో స్పిన్నర్‌తో బరిలో దిగడం నేనెప్పుడూ చూడలేదు. అశ్విన్ విషయంలో భారత జట్టు జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అందుకే ఉమేశ్‌ను జట్టులోకి తీసుకుంది. రెండో స్పిన్నర్‌ను ఆడించాలని భావిస్తే అశ్విన్ వంద శాతం ఫిట్‌గా ఉన్నాడో లేదో చూడాలి.

డీజిల్ తాగారు.. క్షయ నిధులనూ మింగారు!

- జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయాల లీలలెన్నెన్నో
- ఏ పని జరగాలన్నా ముడుపులు చెల్లించాల్సిందే
- కొందరు వైద్యాధికారులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- డీఎంహెచ్ కార్యాలయాల్లో వ్యక్తిగత సహాయకులదే పెత్తనం
- సర్కారుకు బాధితుల ఫిర్యాదులు



- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొన్ని నెలల కిందట వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఓ అధికారి కుమార్తె వివాహానికి ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రూ.10 వేల చొప్పున దాదాపు రూ. 3 లక్షల వరకూ వసూలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డబ్బుల్లేకుండా దస్త్రం కదలదని ఫిర్యాదులు రావడంతో ఇటీవలే ఆ అధికారిపై బదిలీ వేటుపడింది.

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ వైద్యాధికారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారికి నేరుగా రూ.20 లక్షలు ముడుపులు ఇవ్వచూపారు. దీంతో ఆ అధికారి బదిలీకి ప్రభుత్వం సిద్ధపడింది.

- ఓ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇటీవల తనిఖీలు చేసిన వైద్యాధికారులు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వసూళ్లకు పాల్పడ్డారని సమాచారం. సిద్దిపేట, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉందని పేర్కొంటూ ప్రైవేటు ఆసుపత్రుల సంఘం నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే ఫిర్యాదు చేసింది.

- ఆసిఫాబాద్‌లో కొద్దికాలం కిందట పని చేసిన ఒక వైద్యాధికారి రూ. 12 లక్షల క్షయ వ్యాధి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలొచ్చాయి. చివరికి ఆశా కార్యకర్తలకి ఇవ్వాల్సిన ప్రోత్సాహక నగదును కూడా వాడుకున్నారని ఫిర్యాదులొచ్చాయి. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంబులెన్సులు లేకపోయినా.. వాటికి డీజిల్ ఖర్చు అయినట్లుగా లెక్కలు చూపి సొమ్ములు చేసుకున్నారు. ఈ ఘటనలో బదిలీ వేటు పడింది.

వైద్యఆరోగ్య రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చి కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా.. ఆరోగ్య శాఖను మాత్రం అవినీతి చీడ పట్టి పీడిస్తూనే ఉంది. ముఖ్యంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయాలు అక్రమాల పుట్టగా మారాయనే ఆరోపణలున్నాయి. ఒప్పంద వైద్యునికి వేతనం అందాలన్నా.. ఏఎన్ఎం బదిలీ జరగాలన్నా.. ముడుపులు చెల్లించాల్సిందే! డీఎంహెచ్ కార్యాలయాల్లో అధికారుల వ్యక్తిగత సహాయకులదే దళారి పాత్ర. డబ్బులు వసూలు చేయడమే వీరి పని. ఈ అక్రమాలపై ప్రభుత్వానికి ఇటీవల పెద్దఎత్తున ఫిర్యాదులందాయి.

అడ్డగోలు నియామకాలు

అవసరమున్నా లేకపోయినా కొందరు జిల్లా వైద్యాధికారులు సర్దుబాట్లు(డిప్యుటేషన్లు) పేరిట తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు. ఉదాహరణకు నల్గొండ జిల్లాలో గణాంకాలు లెక్కించే అధికారి నియామకంలో నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక హెల్త్ ఎక్స్‌టెన్షన్ అధికారి స్థాయి ఉద్యోగిని సర్దుబాటు పేరుతో జిల్లా వైద్యాధికారి, ఉప వైద్యాధికారులు ప్రత్యేక సహాయకులుగా కూడా నియమించుకున్నారు. సూర్యాపేటలోనూ జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కోదాడ నుంచి అక్రమంగా సర్దుబాటు చేశారని ప్రచారం జరుగుతోంది. ఒక అధికారికి కొద్ది నెలల కిందట మెదక్‌లో 'డిప్యూటీ డిస్ట్రిక్ ఎక్స్‌టెన్షన్ అండ్ మీడియా ఆఫీసర్'గా పోస్టింగ్ ఇవ్వగా.. అదే రోజు సాయంత్రానికి మేడ్చల్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. కొద్ది రోజుల్లోనే రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి చేరి చక్రం తిప్పుతున్నారు.

ప్రైవేటులో తనిఖీలంటే పైసా వసూలే!

డీఎంహెచ్‌వోలు నిర్వహించే ప్రధాన విధుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులివ్వడం, పర్యవేక్షించడం, తనిఖీలు నిర్వహించడం వంటివి ముఖ్యమైనవి. ప్రైవేటు ఆసుపత్రుల వ్యవహారం అంటే పైసా వసూలు కార్యక్రమమేననే భావన డీఎంహెచ్ కార్యాలయ వర్గాల్లో ఉంది. తనిఖీలు, అనుమతుల సందర్భాల్లో ఏ చిన్న తప్పు దొరికినా.. జిల్లా వైద్యాధికారులను భారీగా సంతృప్తి పర్చాల్సిందేనన్న విమర్శలున్నాయి. ఇటీవల వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు వికటించిన సంఘటనలో 18 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా, ఇందులో ఇద్దరు కంటిచూపు కూడా కోల్పోయారు. ఈ సంఘటనపై విచారించిన ప్రభుత్వ వైద్య బృందం శస్త్రచికిత్స గది ఎంత అధ్వానంగా ఉందో నివేదికలో పొందుపర్చింది. ఇలాంటి వాటిని తరచూ తనిఖీల ద్వారా గుర్తించి చక్కదిద్దాల్సిన డీఎంహెచ్‌వోలు ముడుపులకు తలొగ్గుతున్నారనే విమర్శలున్నాయి. ఎక్కడ ఎక్కువ ప్రైవేటు ఆసుపత్రులున్నాయో ఆ జిల్లాకే పోస్టింగ్ ఇవ్వాలని కొందరు డీఎంహెచ్‌వోలు భారీగా పైరవీలు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

నిధులు స్వాహా

- జాతీయ ఆరోగ్యమిషన్ నిధులను వినియోగించేది డీఎంహెచ్‌వోలే. వారు అడ్డగోలు లెక్కలు చూపించి పథకాల ప్రచారానికిచ్చే నిధులను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అసలు ఈ నిధుల వినియోగంపై ఇప్పటి వరకూ తనిఖీలే నిర్వహించలేదని సమాచారం.
- ఒక్కో జిల్లాకు అత్యవసర ఔషధాల కొనుగోళ్లకు ప్రభుత్వం సుమారు రూ. 70-80 లక్షల నిధులను డీఎంహెచ్‌వోలకు ఇస్తుంది. ఈ నిధులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అవసరాలకు తగ్గట్లుగా వినియోగించాలి. ఏటా మార్చి నెలాఖరులో హడావిడిగా డీఎంహెచ్‌వోలే ఔషధాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరం లేకపోయినా తాము కొనుగోలు చేసిన వాటినే సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారంలో టెండరు నిబంధనలేమీ పాటించకుండా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులున్నాయి.
- కొన్ని జిల్లాల్లో కంటి వెలుగు పథకం అమల్లోనూ అక్రమాలకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. పథకం అమలుకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, ఇతర సామగ్రి కొనుగోలులోనూ చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి.

అవినీతి అధికారులపై కఠిన చర్యలు



ప్రజారోగ్య సంచాలకుల విభాగాన్ని ప్రక్షాళన చేసే దిశగా దృష్టి సారించాం. జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల కార్యాలయాల్లో అవినీతిపై ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమే. వీటిపై ఇప్పటికే విచారణ జరిపి సంబంధితులపై బదిలీ వేటు వేశాం. మరికొందరిపైనా విచారణ జరుపుతున్నాం. ప్రజారోగ్య సంచాలకుల రాష్ట్ర కార్యాలయంలోనూ క్రమశిక్షణ చర్యలు చేపట్టాం. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలితే ఉపేక్షించేది లేదు. జిల్లా అధికారుల్లోనూ స్పష్టమైన పని విభజన చేస్తున్నాం. అధికార వికేంద్రీకరణ ద్వారా మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్‌లోనే అనుమతులు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం. బాధితులెవరైనా నేరుగా రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

– డాక్టర్ జి.శ్రీనివాసరావు, ప్రజారోగ్య సంచాలకులు

– ఈనాడు, హైదరాబాద్

గొంతులో మెంతోప్లస్ డబ్బా ఇరుక్కుని చిన్నారి మృతి

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఎంతో వేడుకగా మొదటి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన మర్నాడే.. దురదృష్టవశాత్తు ఆ చిన్నారికి నూరేళ్లు నిండిపోయాయి. మెంతోప్లస్ బామ్ డబ్బా గొంతులో ఇరుక్కొని మృతి చెందింది. ఈ హృదయ విదారకర ఘటన కొడపాకలో బుధవారం జరిగింది. ఈ గ్రామానికి చెందిన దమ్మరాజు, యశోదల కుమార్తె బిందు (1) బుధవారం మెంతోప్లస్ బామ్ డబ్బాతో ఆడుతూ నోట్లో పెట్టుకుంది. అది కాస్త గొంతులో ఇరుక్కోవడంతో గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలపడంతో తల్లిదండ్రులు శోకంలో మునిగిపోయారు. మంగళవారమే ఆ చిన్నారి పుట్టినరోజు జరపగా.. అంతలోనే మరణించడం కుటుంబ సభ్యుల్లో తీరని విషాదం నింపింది.

పారిశ్రామికాభివృద్ధికి బాసట

ఈనాడు, దిల్లీ: ఏపీ, తెలంగాణల్లో పారిశ్రామికాభివృద్ధి, ఆర్థికవృద్ధికి కేంద్ర ప్రభుత్వం పన్ను ప్రోత్సాహకాలను ఇస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సి.ఆర్.చౌదరి తెలిపారు. తెదేపా రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

అమరావతికి రూ.2,500 కోట్లు ఇచ్చాం

ఏపీ నూతన రాజధాని అమరావతిలో ముఖ్య నిర్మాణాలు, మౌలిక వసతులకు రూ. 2,500 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ తెలిపారు. తెదేపా రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. హైకోర్టు, సచివాలయం, శాసనసభ, రాజ్‌భవన్, శాసనమండలి ఇతర ముఖ్య కట్టడాల నిర్మాణానికి రూ. 1500 కోట్లు ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. నూతన రాజధాని ప్రాంతం పరిధిలోని విజయవాడ, గుంటూరు నగరాల్లో పట్టణ మౌలిక వసతుల కల్పనకు రూ. 1000 కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

షెడ్యూలు 13 సహా పలు అంశాలు వివిధ దశల్లో..

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని షెడ్యూలు 13 ప్రాజెక్టులు సహా పలు అంశాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రం తెలిపింది. తెలుగు రాష్ట్రాల నుంచి సహకారం లేకపోవడం వల్ల విభజన చట్టంలోని చాలా అంశాలు అమలు కావట్లేదా?.. అని కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ మల్లికార్జున ఖర్గే అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ గంగారాం అహిర్ రాతపూర్వక సమాధానమిచ్చారు.

కేసీఆర్ మాటలు బాధించాయి

- చండ్ర రాజేశ్వరరావు ఆంధ్ర ప్రాంత వ్యక్తి కదా.. అన్నారు
- ఫౌండేషన్ అధ్యక్షుడు, సీపీఐ నేత నారాయణ

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: చండ్ర రాజేశ్వరరావు (సీఆర్) ఫౌండేషన్ కార్యక్రమాల విస్తరణ కోసం రెండెకరాల భూమి కావాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అడిగితే చండ్ర రాజేశ్వరరావు ఆంధ్ర ప్రాంత వ్యక్తి కదా.. అన్నారని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చెప్పారు. తెలంగాణ కోసం అనేక త్యాగాలు చేసిన చండ్రను ఇలా ఒక ప్రాంతానికి పరిమితం చేసినట్లు మాట్లాడటం బాధించిందన్నారు. కొండాపూర్‌లో సీఆర్ ఫౌండేషన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నారాయణ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సీఆర్ ఫౌండేషన్‌ను నిర్వహించేది కమ్యూనిస్టు నాయకులే అయినా ఇక్కడ పార్టీలకు అతీతంగా కార్యక్రమాలు ఉంటాయి. ఫౌండేషన్ కార్యక్రమాల విస్తరణ కోసం గతంలో మేం ఎన్నోసార్లు విన్నవించగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గచ్చిబౌలి ప్రాంతంలో రెండెకరాల భూమి కేటాయింపునకు ఆమోదిస్తూ సంతకం చేశారు. జీవో వచ్చేలోపు పదవి నుంచి దిగిపోయారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కలిస్తే చండ్ర రాజేశ్వరరావు ఆంధ్ర ప్రాంత వ్యక్తి కదా.. అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా ఆంధ్ర, రాయలసీమలకు చెందిన చాలా మంది నాయకులు ఆస్తులు అమ్మి ఆయుధాల కొనుగోలుకు డబ్బు అందించారు. కేసీఆర్ అలా మాట్లాడిన తర్వాత ఆ రెండెకరాల గురించి మళ్లీ అడగలేదు. తరువాత అమరావతిలో కోరితే ఏపీ ప్రభుత్వం అక్కడ మూడెకరాలు కేటాయించింది'అని నారాయణ చెప్పారు.



వంద అడుగుల ఔన్నత్యం

ప్రయాణికుల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో 100 అడుగుల ఎత్తున జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. స్టేషన్ అవుట్‌గేట్‌కు సమీపంలో నూరు అడుగుల పొడవైన స్తంభంపై జెండాను సీనియర్ క్యాబిన్ మేన్ అశోక్‌చారి, సీనియర్ టెక్నీషియన్ గోపాల్‌రెడ్డి, స్టేషన్ మేనేజర్ సి.బి.ఎన్ ప్రసాద్‌లు రైల్వే ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి బుధవారం ఉదయం ఆవిష్కరించారు. ఏ1 కేటగిరీ రైల్వేస్టేషన్లలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాలని రైల్వే బోర్డు మార్గదర్శక సూత్రాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా దేశంలో రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన తొలి జాతీయ జెండా ఇదేనని దక్షిణ మధ్య రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

– న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్

త్వరితగతిన ప్రాజెక్టుల పూర్తికే సందర్శన

- విశ్రాంత ఇంజినీర్ల బృందం వెల్లడి

మన్ననూర్ (శ్రీశైలం ప్రాజెక్టు), న్యూస్‌టుడే: నిర్మాణపనుల్లో సాంకేతిక, ఆర్థికపరమైన అంశాలను అధ్యయనం చేసి.. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా దోహదపడేందుకే సాగునీటి ప్రాజెక్టుల సందర్శన చేపడుతున్నామని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల బృందం తెలిపింది. నాగర్‌కర్నూలు జిల్లా పరిధి అమ్రాబాద్ మండలం ఎడమగట్టు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద చేపడుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను ఇంజినీర్ల బృందం బుధవారం పరిశీలించింది.

బృందం సొరంగం వద్ద స్థానిక అధికారులతో మాట్లాడి పనుల ప్రగతిని సమీక్షించింది. ఈ సందర్భంగా బృందం సారథి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. మరో పది కిలోమీటర్ల పనులను పూర్తి చేయాల్సి ఉందన్నారు. సొరంగం నుంచి నీటిని తోడే ప్రక్రియలో సమస్యలు తలెత్తుతున్నాయని, అన్ని అంశాలతో కూడిన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు వివరించారు. బృందం సభ్యులు చంద్రమౌళి, నరేందర్ రెడ్డి, వెంకటేశం, ఇంద్రసేనారెడ్డి, ఎస్ఎల్‌బీసీ ఈఈ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



దోమలపెంట గ్రామంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద విశ్రాంత ఇంజినీర్లు

సంచలనం కోసమే జగన్‌పై దాడి

- ఎలాంటి కుట్రా లేదు
- హత్యాయత్నం ఉద్దేశమే లేదు
- ఫ్లెక్సీలు నిందితుడు తయారుచేయించినవే
- అక్టోబరు 18న దాడికి ప్రణాళిక
- విశాఖ సీపీ వెల్లడి



జగన్ కేసు దర్యాప్తు వివరాలను వెల్లడిస్తున్న మహేశ్ చంద్ర లడ్డా

ఈనాడు, విశాఖపట్నం: సంచలనం కోసమే విశాఖపట్నం విమానాశ్రయంలో జగన్‌పై తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంకకు చెందిన జనుపల్లి శ్రీనివాసరావు అనే యువకుడు దాడికి పాల్పడ్డాడని, హత్య చేసే ఉద్దేశం అతడికి లేదని, జగన్‌కు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాడని విశాఖ నగర పోలీసు కమిషనరు మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు. శ్రీనివాసరావుకు జగన్ అంటే విపరీతమైన అభిమానమని తెలిపారు. అందుకే ఫ్లెక్సీలు వేయించుకున్నాడని చెప్పారు. గత ఏడాది అక్టోబరు 25వ తేదీన జరిగిన దాడిపై సిట్ విచారణ వివరాలను డీసీపీ నయీం అస్మి, సిట్ అధిపతి నాగేశ్వరరావు, ఏసీపీ అర్జున్, సీఐ మళ్ల శేషు తదితరులతో కలిసి బుధవారమిక్కడ లడ్డా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

'తనకు పరిచయస్తురాలైన పిడుగురాళ్లకు చెందిన షేక్ అమ్మాజీ అనే యువతికి దాడి విషయాన్ని శ్రీనివాసరావు ముందే చెప్పాడు. ఆమె పెద్దగా పట్టించుకోలేదు. అక్టోబరు 18నే జగన్‌పై దాడి చేయాలని శ్రీనివాసరావు భావించాడు. కానీ దసరా నేపథ్యంలో 17నే జగన్ వెళ్లిపోవడంతో మొదటి ప్రయత్నం విఫలమైంది. అప్పుడూ అమ్మాజీతో చెప్పినా ఆమె నమ్మలేదు. తాను పని చేస్తున్న సహోద్యోగులతోనూ భవిష్యత్తులో ఎంపీ, ఎమ్మెల్యేల్లా ప్రముఖుడిగా మారతానని శ్రీనివాసరావు చెప్పేవాడు. వైకాపా కార్యాలయంలో సహాయకుడిగా (ఆఫీస్ అసిస్టెంట్) విధులు నిర్వర్తిస్తున్న కృష్ణకాంత్ (కె.కె.) ఫ్యూజన్ ఫుడ్స్ రెస్టారెంట్ క్యాషియరుగా విధులు నిర్వర్తిస్తున్న హేమలతతో మాట్లాడుతుండేవాడు. దీంతో ఆమె జగన్‌తో ఫొటో తీసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కృష్ణకాంత్‌ను కోరింది. ఆ మేరకు అక్టోబరు 25వ తేదీన జగన్ విమానాశ్రయానికి వచ్చినప్పుడు శ్రీనివాసరావును 2 మంచినీళ్ల సీసాలతో హేమలత లోపలికి పంపింది. ఇదే సమయంలో విమానం బయలుదేరుతుందని చెప్పగా జగన్ లేచారు. ఈ సమయంలోనే శ్రీనివాసరావు దాడి చేశాడు. చంపాలనే ఉద్దేశం లేకపోవడంతో చేతిపైనే దాడి చేశాడు. జగన్‌పై దాడి చేయడానికి వీలుగా 2 కోడి కత్తులను రాజుపాలెంలో శ్రీనివాసరావు సేకరించాడు. జగన్‌పై దాడికి వీలుగా తనతోపాటు ఒక దానిని విశాఖ తెచ్చుకున్నాడు. మరో కత్తిని ఠాణేలంకలోని ఇంట్లోనే దాచాడు. వెంకటపతి అనే వ్యక్తి ద్వారా ఫ్యూజన్ ఫుడ్స్‌లో వంటవాడిగా (కుక్) శ్రీనివాసరావు చేరాడు. అతడిపై ఎలాంటి కేసులు లేవని ఎయిర్‌పోర్టు అధికారులకు పోలీసులు నివేదిక ఇచ్చారు. విజయదుర్గ అనే యువతితో శ్రీనివాసరావు 9 పేజీల లేఖ రాయించాడు. రేవతీపతితో ఒక పేజీ, తానొక పేజీ చొప్పున రాశాడు. దాడి సందర్భంగా తనకు ఏదైనా అయితే అవయవాల్ని దానం చేయాలని రాసుకున్నాడు. ఆ లేఖను అక్టోబరు 23వ తేదీన జిరాక్స్ తీయించాడు. అక్టోబరు 25వ తేదీన విమానాశ్రయానికి వచ్చేటప్పుడు రేవతీపతి బ్యాగులో పెట్టి తీసుకొచ్చాడు. ఆ తర్వాత జేబులో పెట్టుకున్నాడు. తన జేబులోని పర్సులో కోడి కత్తిని పెట్టుకుని విమానాశ్రయం వద్దకు వచ్చినా పోలీసులు అతడి పాస్‌ను చూసి లోపలికి పంపేశారేగానీ పర్సును తనిఖీ చేయలేదు. జగన్ కేసు దర్యాప్తులో భాగంగా 92 మందిని విచారించాం. 321 ఫోన్‌కాల్స్‌ను విశ్లేషించాం. జగన్‌పై దాడికి ఇతరుల ప్రమేయం ఉన్న దాఖలాలు ఎక్కడా కానరాలేదు. జగన్‌కు ఎలాంటి హాని కలగకుండా కత్తిని 2 సార్లు శ్రీనివాసరావు స్టెరిలైజ్ చేశాడు. మొదటిసారి స్టెరిలైజ్ చేస్తున్న సమయంలో శిరీష, ప్రసాద్ అనే ఇద్దరు సహోద్యోగులు చూశారు. ఎందుకు చేస్తున్నావని వారు ప్రశ్నించగా కూరగాయలు, పళ్లపై డిజైన్లు వేయాలంటే చేయాలని వారికి చెప్పాడు. దాడి చేసే ముందూ రెస్టారెంట్లో స్టెరిలైజ్ చేసి జగన్‌కు ఎలాంటి అపకారం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

హైకోర్టు అనుమతించిన వెంటనే ఛార్జిషీట్...

నిందితుడు, మరో ఇద్దరు కలిసి రాసిన లేఖలోని చేతిరాతలు వారివేనని ఫోరెన్సిక్ నిపుణులు నిర్ధారించారు. జగన్ చొక్కా, గాయం కణాలు (టిస్యూలు), కోడికత్తిల పరీక్షలకు సంబంధించిన నివేదికలు రావాల్సి ఉంది. అప్పటి వరకూ సిట్ దర్యాప్తు కొనసాగుతుంది. హైకోర్టు అనుమతించిన వెంటనే ఛార్జిషీట్ దాఖలు చేస్తాం.

ఫ్లెక్సీలో గరుడ పక్షి ఫొటో వేయించుకోవడం యాదృచ్ఛికంగా జరిగింది. శ్రీనివాసరావుకు పక్షులంటే ఇష్టంతో ఆ ఫొటో ఫ్లెక్సీలో వేయించుకున్నాడు తప్ప ఆపరేషన్ గరుడలో భాగమన్న ప్రచారంలో వాస్తవం లేదు. విశాఖ విమానాశ్రయంలో దాడి జరిగినప్పుడు జగన్ చేతికైన గాయం కేవలం 0.5 సెం.మీ. లోతే ఉందని విమానాశ్రయ వైద్యులు ధ్రువీకరించారు. కత్తికి విషం ఉండుంటే మెల్లగా శరీరంలోకి ప్రవేశిస్తుందన్న ఉద్దేశంతో హైదరాబాద్ వైద్యులు గాయమైన చోట 3 సెం.మీ. పొడవు, 1 సెం.మీ. వెడల్పు, 3.5సెం.మీ. లోతున 'డిబ్రీడ్‌మెంట్' చేశారు. ఫలితంగా ఆ గాయం పెద్దదైనట్లైంది.'

ఎస్ఎల్‌బీసీ గట్టెక్కేది రెండేళ్లకే!

- నిపుణుల సంఘం అంచనా

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) పని పూర్తిచేయడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఒక వైపు సీపేజి సమస్య, ఇంకోవైపు టన్నెల్ బోరింగ్ మిషన్ పాడవడం వల్ల జాప్యం జరిగే అవకాశం ఉందని ఈ ప్రాజెక్టు పనులను పరిశీలించిన నిపుణుల సంఘం ప్రతినిధులు గుర్తించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విశ్రాంత ఇంజినీర్ల బృందం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో ప్రాజెక్టుల పనులను పరిశీలిస్తున్న సంఘం బుధవారం శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనులను పరిశీలించింది. ఇంకా 10 కిలోమీటర్లకు పైగా సొరంగ మార్గం పని మిగిలి ఉంది. శ్రీశైలం నుంచి నీటిని తీసుకునే వైపు సీపేజి సమస్య వల్ల పనులు జరగడం లేదని ఈ బృందం గుర్తించింది. 4,000 క్యూసెక్కులకు పైగా నీటిని తోడేందుకు పెద్ద మోటార్లు పెట్టాలని, మరో రెండువారాల్లో నీటిమట్టాలు తగ్గిపోతాయి కాబట్టి పని చేయడానికి ఇబ్బంది ఉండదని ప్రతినిధి బృందం గుర్తించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. నీటిని బయటకు తెచ్చే వైపు టీబీఎం యంత్రానికి బేరింగ్ దెబ్బ తినడంతో పని చేయడం లేదు. దానిని దిగుమతి చేసుకున్నామని.. చెన్నైలో ఉందని, త్వరలో బిగించి పని ప్రారంభిస్తామని గుత్తేదారు సంస్థ ప్రతినిధులు వీరి దృష్టికి తెచ్చినట్లు సమాచారం. రెండువైపుల నుంచి పని ప్రారంభించినా సుమారు రెండేళ్ల సమయం పట్టొచ్చని విశ్రాంత ఇంజినీర్ల బృందం అభిప్రాయపడినట్లు తెలిసింది. చంద్రమౌళి, రామిరెడ్డి తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

భారత సంతతి బాలుడికి జ్ఞాపకశక్తి పోటీల్లో స్వర్ణాలు

సింగపూర్: 'వరల్డ్ మెమొరీ ఛాంపియన్‌షిప్'లో భారత సంతతికి చెందిన 12 ఏళ్ల సింగపూర్ విద్యార్థి ధ్రువ్ మనోజ్‌ను రెండు స్వర్ణాలు వరించాయి. డిసెంబరు 20-22 మధ్య హాంగ్‌కాంగ్‌లో ఈ పోటీలు జరిగాయి. మొహాలు-పేర్లు, పదాల విభాగాల్లో 56 మందిని వెనక్కు నెట్టి ధ్రువ్ ఈ ఘనత సాధించాడు. ఇతడి తండ్రి మనోజ్ ప్రభాకర్ చమురు, సహజవాయువుల కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00